
మంగళవారం 26, ఆగస్ట్ 2025

https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

**ఎరువులపై ఆందోళన వద్దు**

- రైతులకు మంత్రి అచ్చెన్నాయుడు భరోసా

6

**అబద్ధాల్లో అంబటికి ఆస్కార్ ఇవ్వొచ్చు**

- మంత్రి నిమ్మల వ్యంగ్యం

6

## వరద ప్రవాహాలతో
# ప్రాజెక్టులు నింపండి



## రాష్ట్రంలో రిజర్వాయర్లకు జలకళ

- సమర్థ నీటి నిర్వహణతో సత్ఫలితాలు
- ఎప్పటికప్పుడు సీఎం దిశానిర్దేశం
- హంద్రీనీవా ద్వారా సీమ జిల్లాల ప్రాజెక్టులకు సమృద్ధిగా నీళ్లు

4

- రాయలసీమలో చెరువులన్నీ జలాలతో కళకళలాడాలి
- వృథాగా సముద్రంలోకి ప్రవాహాలు.. బాధగా ఉంది
- వరద నీటిని సద్వినియోగం చేసుకుంటేనే రాష్ట్రానికి ప్రయోజనం
- జలవనరుల శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

2

# మట్టిలో మాణిక్యాలు!

*వజ్రం అయినా సానబెడితేనే దాని విలువ తెలుస్తుంది. అలాగే మట్టిలో మాణిక్యాలకు అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు చేస్తారు. సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు ఇటీవల సాధించిన ఫలితాలు వారి సమర్థతను రుజువు చేస్తున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఐఐటీ-నీట్ సెంటర్లలో కోచింగ్ పొంది ఈ ఏడాది ఐఐటీ, నిట్, నీట్ లలో 55 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు సీట్లు సాధించారు. సచివాలయంలో నన్ను కలిసిన సందర్భంగా, వారు తమ సంతోషాన్ని నాతో పంచుకుంటే ఎంతో సంతృప్తి కలిగింది. ప్రతిష్టాత్మక సంస్థల్లో సీట్లు పొందిన వారికి మెమొంటోతో పాటు ఒక్కొక్కరికి రూ. లక్ష ప్రోత్సాహకం అందించి అభినందించాను. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపయోగపడేలా కొత్తగా మరో 7 ఐఐటీ-నీట్ కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తాం. సరైన సదుపాయాలు, శిక్షణ, సాయం అందిస్తే ప్రపంచంలో అందరితో పోటీ పడే సత్తా మన విద్యార్థులకు ఉంది. వీరి విజయం ఎంతో మందికి స్ఫూర్తినివ్వాలని ఆశిస్తున్నాను.*

– సీఎం చంద్రబాబు నాయుడు



- ప్రతిభ చూపిన ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ విద్యార్థులు
- ఐఐటీ, నిట్, నీట్‌లో రాష్ట్రం నుంచి 55 మందికి సీట్లు
- సీఎం చంద్రబాబును కలిసి సంతోషాన్ని పంచుకున్న విద్యార్థులు
- వచ్చే ఏడాది నాలుగు రెట్ల ఫలితాలు రావాలని సీఎం ఆకాంక్ష
- సీట్లు పొందిన ఒక్కో విద్యార్థికి ప్రోత్సాహకంగా రూ.లక్ష

3



# మండలానికో ‘జన ఔషధి’ స్టోర్..

## బీసీ యువతకు ఉపాధి

- అమరావతిలో నేచురోపతి యూనివర్సిటీ
- త్వరలో ‘యోగా ప్రచార పరిషత్’
- ‘ఆరోగ్యరథం’తో మొబైల్ వైద్యసేవలు
- రాష్ట్రమంతటా ఉచిత వైద్య పరీక్షలు
- వైద్యారోగ్య శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు
- ఎన్టీఆర్ బేబీ కిట్స్ పరిశీలన... త్వరలోనే అమలుకు ఆదేశాలు

2

## మహిళల సహకారంతో..
# స్త్రీ శక్తి గ్రాండ్ సక్సెస్

- సద్వినియోగం చేసుకుంటున్న మహిళలు
- అవసరం మేరకే ప్రయాణాలు
- ఉచిత బస్సులకు త్వరలో లైవ్ ట్రాకింగ్
- స్త్రీ శక్తి బస్సులకు రెండు వైపులా బోర్డులు పెట్టండి
- ఆర్టీసీపై సమీక్షలో సీఎం చంద్రబాబు

3

## వైద్యారోగ్య రంగంలో వినూత్న ఆవిష్కరణలకు..
# ‘బ్రెయిన్’ కార్యక్రమం!

- రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో కలిసి కార్యకలాపాలు
- వైద్యారోగ్య రంగంలో పరిశోధన, శిక్షణ, స్టార్టప్‌లు, ఇంక్యుబేషన్లలో సహకారం కోసం ఎంఓయూ
- అంతర్జాతీయ బయోడిజైన్ నిపుణులతో సీఎం చంద్రబాబు సమావేశం

4

## మంత్రి లోకేష్ చొరవ
# గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్

## - విజయదశమి దుర్గాదేవి మండపాలకూ..



అమరావతి (చైతన్యరథం): వినాయక చవితి పండుగను పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా గణేష్ ఉత్సవ మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. వినాయక చవితి ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రాంతాల్లో పందిళ్ళకు ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పించాలని పలువురు నిర్వాహకులు మంత్రి నారా లోకేష్‌ను కోరారు. దీనిపై స్పందించిన లోకేష్... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 15వేల గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. గణేష్ ఉత్సవ పందిళ్ళకు ఉచిత విద్యుత్ అందించడానికి రూ.25 కోట్లు ప్రభుత్వం భరించాల్సి ఉంది. రాష్ట్రంలోని కోట్లాది గణేష్ భక్తుల సౌలభ్యం దృష్ట్యా ఉచిత విద్యుత్ అందించేలా చూడాలని మంత్రి లోకేష్ చేసిన వినతిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు ప్రత్యేకంగా జీ.ఓ విడుదలకు ఆదేశాలు జారీచేశారు. అలాగే రాబోయే విజయదశమి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసి దుర్గాదేవి మండపాలకి కూడా ఉచిత విద్యుత్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# ర్యాపిడో రాణులు!

స్కూటర్‌కు సబ్సిడీతో రుణం



- మెప్మా సహకారం, ర్యాపిడో చొరవతో ఉపాధి పొందిన 1003 మంది మహిళలు
- తొమ్మిది నగరాల్లో సేవలు.. 3 నెలల్లో రూ.35 లక్షల ఆదాయం
- మహిళా సాధికారతే తమ ప్రాధాన్యమన్న మంత్రి లోకేష్
- ఇది ఆరంభం మాత్రమే.. రాబోయే రోజుల్లో మరింత చేస్తామని ఉద్ఘాటన

5

## సాధికారత దిశగా రాష్ట్ర మహిళ



ఆర్థిక స్వాతంత్ర్యం, సాధికారత గురించి కలలు కన్న మహిళ రాష్ట్రంలో నేడు దాని సాధన దిశగా పయనిస్తోందని విద్య, ఐటీశాఖల మంత్రి లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. ‘స్త్రీ శక్తి’ ద్వారా ఉచిత బస్సు ప్రయాణ పథకం గొప్ప విజయం సాధించిందన్నారు. మరోవైపు ర్యాపిడో భాగస్వామ్యంలో వెయ్యి మందికి పైగా మహిళా డ్రైవర్లకు ఉపాధి కలగడం సంతోషమని చెప్పారు. మహి ళలు ఈవీ వాహనాలు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం రాయితీ ఇస్తోందన్నారు. రవాణా ప్రణాళిక (మొబిలిటీ) అంటే కేవలం ప్రయాణం కాదు.. ఇది అవకాశం, గౌరవం, భవిష్యత్‌పై భరోసా అని పేర్కొన్నారు. ముమ్మాటికీ ఇది మంచి ప్రభుత్వమే అని వివరించారు. మహిళల ర్యాపిడో వాహనాల డ్రైవింగ్‌పై ఓ వీడియోను ‘ఎక్స్’లో మంత్రి లోకేష్ పోస్ట్ చేశారు.

చైతన్యరథం

# మండలానికో 'జన ఔషధి' స్టోర్...

# బీసీ యువతకు ఉపాధి

- అమరావతిలో నేచురోపతి యూనివర్శిటీ
- త్వరలో 'యోగా ప్రచార పరిషత్'
- 'ఆరోగ్య రథం'తో మొబైల్ వైద్యసేవలు
- రాష్ట్రమంతటా ఉచిత వైద్య పరీక్షలు
- వైద్యారోగ్య శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఎన్టీఆర్ బేబీ కిట్స్ పరిశీలన... త్వరలోనే అమలుకు ఆదేశాలు



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో వైద్య సదుపాయాలు మెరుగుపరచడం, ఆరోగ్య బీమాలో మార్పులు, కొత్త వైద్య కళాశాలలు, ఉచితంగా వైద్య పరీక్షలు, యోగా-నేచురోపతి అభివృద్ధి వంటి అంశాల్లో తీసుకోవాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. పేదలపై భారం తగ్గేలా ప్రతీ మండలంలో జనరిక్ ఔషధాలు లభించేలా చూడాలని భావిస్తున్న ముఖ్యమంత్రి... దీనికి సంబంధించి వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులతో సోమవారం సచివాలయంలో జరిగిన సమీక్షలో కీలక నిర్ణయం తీసుకున్నారు. జనఔషధి స్టోర్లు పెట్టేందుకు బీసీ కార్పొరేషన్ నుంచి పెద్దఎత్తున వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తక్షణమే వాటికి అనుమతులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. దీంతో పేదలకు తక్కువ ధరకే ఔషధాలు లభించడమే కాకుండా, బీసీ యువతకు విస్తృతంగా ఉపాధి లభించేందుకు మార్గం సుగమం అవుతుంది.

## రూ.25 లక్షల వరకు వైద్య బీమాపై కసరత్తు

ఎన్టీఆర్ వైద్య సేవ కింద రూ.25 లక్షల వరకు వైద్య బీమా అందించే అంశంపైనా సమీక్షలో చర్చించారు. ప్రస్తుతం ఉన్న విధానం ద్వారా 1.43 కోట్ల కుటుంబాలకు మాత్రమే లబ్ధి కలుగుతుండగా, దీనిని 1.63 కోట్ల కుటుంబాలకు వర్తించేలా మార్పులు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ఇది అమలైతే 5.02 కోట్ల మందికి ప్రయోజనం కలుగుతుందని అధికారులు తెలిపారు.



## ప్రతీ నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రి

ప్రతీ నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రిని నిర్మించేలా కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. మార్కాపురం, మదనపల్లి, పులివెందుల, ఆదోనిలో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీల పురోగతిపైనా చర్చించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ప్రతి వెయ్యి మంది జనాభాకు 2.24 అసుపత్రి పడకలు ఉండగా, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ నిర్దేశకాల ప్రకారం 3 పడకాలు ఉండాలని సూచించిందన్నారు. దీని ప్రకారం రాష్ట్రంలో మరో 12,756 పడకలు అందుబాటులోకి తేవాల్సి ఉందని.... దీనిపై సమగ్ర అధ్యయనం చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.

## ఆరోగ్య సూత్రాలు పాటించేలా అవగాహన

వివిధ వ్యాధులతో చికిత్స పొందేందుకు ఆస్పత్రులకు రావడం కన్నా... అనారోగ్యం పాలవ్వకుండా ముందగానే జాగ్రత్తపడేలా, ప్రజలంతా ఆరోగ్య సూత్రాలు పాటించేలా అవగాహన కల్పించాలని అధికారులకు ముఖ్యమంత్రి చెప్పారు. ఇందు కోసం యోగా, నేచురోపతిని ప్రమోట్‌చేసేలా 'యోగా ప్రచార పరిషత్' ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 3 రీజనల్ స్టడీ సెంటర్లలో 64మంది సభ్యులను నియమించేందుకు అనుమతించారు. అమరావతి పరిధిలో నేచురోపతి యూనివర్సిటీ ఏర్పాటుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు.

## 45 రోజుల్లోగా కుప్పంలో ఉచిత వైద్య పరీక్షలు

రాష్ట్రంలో ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ రూపొందించే క్రమంలో తలపెట్టిన ఉచిత వైద్య పరీక్షల పైలెట్ ప్రాజెక్టును కుప్పం నియోజకవర్గంలో 45 రోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. కుప్పం నియోజకవర్గంలోని కుప్పం, శాంతిపురం, రామకుప్పంతో పాటు మరిన్ని ల్యాబ్ టెస్టింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని, అలాగే శాంపిల్ కలెక్షన్ టీమ్‌లు పెంచాలని స్పష్టం చేశారు.

## ప్రతీ గ్రామానికి 'ఆరోగ్య రథం'

'ఆరోగ్యం రథం'తో ప్రతీ పల్లెలోనూ మొబైల్ వైద్య సేవలు అందించాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. 108 వాహనాల సిబ్బందికి యూనిఫామ్ అమలు చేయాలని నిర్దేశించారు. మరోవైపు ఎన్టీఆర్ బేబీ కిట్స్ పథకాన్ని అమలు చేసేందుకు అధికారులు తీసుకొచ్చిన పలురకాల కిట్స్‌ను ముఖ్యమంత్రి పరిశీలించారు. బేబీ కిట్స్ పథకం త్వరలోనే అమలుచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## మోడల్ ఇంక్లూజివ్ సిటీగా అమరావతి

పెర్కిన్స్ ఇండియా - ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ భాగస్వామ్యంతో అమరావతిలో 'మోడల్ ఇన్‌క్లూజివ్ సిటీ' ఏర్పాటుకు ముందుకొచ్చాయి. దీనిపై ఆ సంస్థల ప్రతినిధులు ముఖ్యమంత్రిని కలిసి ప్రజెంటేషన్ ఇచ్చారు. ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా సమగ్ర విద్య, సమాన హక్కులు, అందరికీ అందుబాటులో మౌలిక వసతులను సృష్టించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు. బారియర్ ఫ్రీ పబ్లిక్ ప్లేస్, ఇన్‌క్లూజివ్ రోడ్ డిజైన్, అందరికీ అందుబాటులో ఉండేలా ప్రజా రవాణా సౌకర్యాలు రూపకల్పన, డిజిటల్ స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి, ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ మోడల్ స్కూల్ ప్రోగ్రామ్స్ ద్వారా ప్రతి పిల్లవాడు తన సహచరులతో సమానంగా నేర్చుకునే వాతావరణం కల్పించడం, ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమాలు వంటివి చేస్తామని చెప్పారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో రావాలని సూచించారు.

# వరద ప్రవాహాలతో ప్రాజెక్టులు నింపండి

- రాయలసీమలో చెరువులన్నీ జలాలతో కళకళలాడాలి
- వృథాగా సముద్రంలోకి ప్రవాహాలు.. బాధగా ఉంది
- వరద నీటిని సద్వినియోగం చేసుకుంటేనే రాష్ట్రానికి ప్రయోజనం
- జలవనరుల శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి(చైతన్యరథం): కృష్ణా,గోదావరి నదుల్లో ఎగువ నుంచి వస్తున్న ప్రవాహాలను సద్వినియోగం చేసుకునేలా కార్యాచరణ ఉండాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ప్రస్తుతం ఎగువ నుంచి కొనసాగుతున్న ప్రవాహాలతో ప్రాజెక్టులన్నీ పూర్తిగా నింపాలని సూచించారు. రాష్ట్రంలోని చెరువులన్నీ నిండేందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రత్యేకించి రాయలసీమలోని చెరువుల్ని తక్షణం నింపేందుకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో జలవనరుల శాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. సముద్రంలోకి వృథాగా పోతున్న నీటిని కాలువల ద్వారా మళ్లించి చెరువుల్లోకి పంపాలని సూచించారు. ప్రధాన కాలువల నుంచి ఫీడర్ కెనాల్స్‌కు ఉన్న అడ్డంకులను సరిచేసి నీటిని సరఫరా చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అడ్డంకులు తొలగించి నీరిస్తేనే ప్రజలకు, రైతులకు ప్రయోజనం కలుగుతుందని ముఖ్యమంత్రి అన్నారు.కుప్పం వరకూ నీళ్లు తీసుకెళ్లినట్టే..మిగతా ప్రాంతాలకూ నీరు వెళ్లేలా చర్యలు చేపట్టాలన్నారు. సముద్రంలోకి వృథాగా ప్రవాహాలు వెళ్తుంటే బాధ కలుగుతోందన్నారు. వరద నీటిని సద్వినియోగం చేసుకుంటేనే రాష్ట్రానికి ప్రయోజనం కలుగుతుందన్నారు.రాయలసీమలోని చెరువులు నింపేందుకు ఎంత నీరు అవసరం, ఎక్కడెక్కడ అడ్డంకులు ఉన్నాయన్న అంశాలను గుర్తించి వాటిని సరి చేయాల్సిందిగా సీఎం సూచించారు. తెలుగు గంగ పథకం, కుందూ నదుల విస్తరణ జరిగితేనే నీటిని దిగువన రిజర్వాయర్లకు తరలించేందుకు అవకాశం ఉంటుందని అధికారులు వివరించారు. ప్రస్తుతం హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి రాయలసీమలోని జిల్లాలకు నీరు అందుతోందని.. సోమశిల, కండలేరు రిజర్వాయర్లను త్వరగా నింపాలన్నారు. కుప్పం, పలమనేరు, పుంగనూరు, మదనపల్లిలో ఉన్న చెరువులను ఈ నీటి ద్వారా నింపాలన్నారు. నిప్పుల వాగు, కుందూ విస్తరణ ద్వారా 35 టీఎంసీల నీటిని తరలించేందుకు ఆస్కారం ఉందని అధికారులు వివరించారు. మరో మూడు రోజుల్లో సోమశిల రిజర్వాయర్ నిండుతుందని, కండలేరు రిజర్వాయర్ నింపేందుకు మరికొంత సమయం పట్టే అవకాశముందని తెలిపారు. జీడిపల్లి నుంచి పీఏబీఆర్‌కు అక్కడి నుంచి చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లను నింపాలని సీఎం సూచించారు. మరోవైపు రాష్ట్రంలో భూగర్భ జలాలు రీఛార్జి చేసే అంశంపై కూడా దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో భూగర్భ జలాల సగటు నీటి మట్టం 9.92 మీటర్ల లోతున ఉన్నట్టు అధికారులు వెల్లడించారు.

## పోలవరం ఎడమ కాలువ పనుల్లో వేగం పెంచండి

పోలవరం ఎడమకాలువ పనులు నిర్దేశిత గడువు లోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నిధులకు ఇబ్బంది లేదని పనులు వేగంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర ప్రాజెక్టులను కూడా ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలన్నారు. వంశధార- నాగావళి, చంపావతి నదులను అనుసంధానించేందుకు ఏం పనులు చేపట్టాలన్న అంశాన్ని గుర్తించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రూల్స్ కోసం కాదు రిజల్ట్స్ కోసం పనిచేయాలని సీఎం అధికారులకు సూచించారు. గాలేరు నగరి ద్వారా కడపకు, పేరూరు- బీటీపీ ద్వారా హిందూపూర్‌కు, మదనపల్లె, తంబళ్లపల్లిలకు అడవిపల్లి రిజర్వాయర్ నుంచి చిత్తూరు వరకూ నీళ్లు తీసుకెళ్లేందుకు ఏం చేయాలన్న దానిపై బ్లూప్రింట్ సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. ఈ సమీక్షకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ఆ శాఖ సలహాదారు వేంకటేశ్వరరావు, ఈఎన్సీ, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

చైతన్యరథం

## మహిళల సహకారంతో..

# స్త్రీ శక్తి గ్రాండ్ సక్సెస్



- సద్వినియోగం చేసుకుంటున్న మహిళలు
- అవసరం మేరకే ప్రయాణాలు
- ఉచిత బస్సులకు త్వరలో లైవ్ ట్రాకింగ్
- స్త్రీ శక్తి బస్సులకు రెండు వైపులా బోర్డులు పెట్టండి
- ఆర్టీసీపై సమీక్షలో సీఎం చంద్రబాబు

అమరావతి(చైతన్యరథం): మహిళల సహకారంతో స్త్రీశక్తి పథకం గ్రాండ్‌సక్సెస్ అయిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఆర్టీసీపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. స్త్రీ శక్తి పథకం అమలు ఎలా జరుగుతుందని ఆర్టీసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆక్యుపెన్సీ రేషియో ఎంత మేర పెరిగిందని ఆరా తీశారు. స్త్రీ శక్తి బస్సుల్లో సీట్ల కోసం పోటీ పడే క్రమంలో ఏమైనా ఇబ్బందులు ఎదురువుతున్నాయా.. అని ముఖ్యమంత్రి అడిగారు. స్త్రీ శక్తి పథకం అమలు చేసినప్పటి నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో పెరిగిందని అధికారులు చెప్పారు. గతంలో ఆక్యుపెన్సీ రేషియో 68 నుంచి 70 శాతంగా ఉండేదని.. ఇప్పుడు 60డిపోల పరిధిలో తిరిగే బస్సుల్లో 100 శాతం ఆక్యుపెన్సీ రేషియో వస్తోందని.. అలాగే 13 జిల్లాల్లో 100 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో బస్సులు తిరుగుతున్నాయని అధికారులు వివరించారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సందర్భంగా సీట్ల కోసం ఇబ్బందులు.. గందరగోళం వంటి సంఘటనలు తలెత్తడం లేదని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. అంతే కాకుండా.. ఉచిత బస్సు వెసులుబాటును మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారని... అవసరమైన మేరకే ప్రయాణాలు చేస్తున్నారని ముఖ్యమంత్రికి ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు వివరించారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఏపీ మహిళల్లో చైతన్యం ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రభుత్వం ఎలాంటి పథకాలను తెచ్చినా.. వాటిని సద్వినియోగం చేస్తారు. ప్రభుత్వం అందించే పథకాలను అందిపుచ్చుకుని అభివృద్ధి చెందుతారు. అందుకే నేను ఉమ్మడి రాష్ట్రానికి సీఎంగా ఉన్నప్పటి నుంచి మహిళలకు ప్రత్యేక పథకాలు ఇవ్వడానికి ఆసక్తి చూపిస్తా. డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పిస్తే.. ఇప్పుడు స్త్రీ శక్తి ద్వారా వారికి ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించాం. ఒకప్పుడు బాలికా విద్యను ప్రోత్సహించేందుకు సైకిళ్లు ఇచ్చాం. ఇప్పుడు విద్యార్థినులు,మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం కానుకగా ఇచ్చాం. దీని వల్ల బస్ పాసుల కోసం క్యూ లైన్లల్లో నిల్చొనే శ్రమ తప్పింది. ఆర్టీసీ బస్సుల్లో వెళ్తే భద్రత కూడా ఉంటుందని సీఎం చెప్పారు.

### సహకరిస్తోన్న మహిళలకు ధన్యవాదాలు

స్త్రీ శక్తి పథకాన్ని మహిళలు చాలా చక్కగా ఉపయోగించుకుంటున్నారు. అవసరం ఉంటేనే బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. అనవసర ప్రయాణాలు పెట్టుకోవడం లేదు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికంగా భారమైనా సరే.. మహిళలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి... వారికి చేయూత అందివ్వడానికే స్త్రీ శక్తి పథకం ప్రారంభిస్తున్నామని మహిళలకు చెప్పాను. ఆ మేరకు మహిళలు కూడా సహకరిస్తున్నారు. రాష్ట్ర పరిస్థితిని అర్థం చేసుకుని... దానికి అనుగుణంగా వ్యవహరిస్తున్న మహిళలకు ధన్యవాదాలు. ఇప్పటి వరకు సహకరించిన విధంగానే మహిళలు భవిష్యత్తులోనూ సహకరించాలని కోరుతున్నాను. ఆర్టీసీ సిబ్బందికి ప్రయాణికులు సహకరించాలి. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలకు.. అభివృద్ధి కార్యక్రమాలకు ఇదే విధమైన సహకారం లభిస్తే.. మరింత ఉత్సాహంగా పని చేస్తాం. ప్రజలకు, మహిళలకు మరింత మేలు చేకూర్చగలమని సీఎం చంద్రబాబు వివరించారు.

### బోర్డులు పెట్టండి... అమల్లోకి లైవ్ ట్రాకింగ్..

స్త్రీ శక్తి పథకం కింద నడిపే బస్సులకు వెనుకా... ముందు భాగాన బోర్డులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో మొత్తంగా 8,458 స్త్రీ శక్తి బస్సులకు బోర్డులు పెట్టాలని చెప్పారు. సీట్లకోసం పోటీ పడితే.. ఆర్టీసీ సిబ్బంది సంయమనంతో వ్యవహరించాలని సీఎం సూచించారు. ఇప్పటి వరకు ప్రయాణికులతో ఆర్టీసీ సిబ్బందికి ఎలాంటి ఘర్షణ వాతావరణం తలెత్తలేదని ఆర్టీసీ ఎండీ తెలిపారు. మహిళా ప్రయాణికుల సంఖ్య ఎంత మేరకు పెరిగిందని ముఖ్యమంత్రి ఆరా తీశారు. పథకం ప్రారంభానికి ముందు 40 శాతం మహిళలు ప్రయాణిస్తే.. 60 శాతం మంది పురుషులు ప్రయాణించే వారని.. ఇప్పుడు 65 శాతం మేర మహిళలు ప్రయాణిస్తుంటే.. 35 శాతం మేర పురుషులు ప్రయాణిస్తున్నారని అధికారులు వివరించారు. అలాగే స్త్రీ శక్తి బస్సుల లైవ్ ట్రాకింగ్ విధానం ఎప్పటి నుంచి అమల్లోకి తెస్తున్నారని ముఖ్యమంత్రి ఆరా తీశారు. రెండు, మూడు రోజుల్లో గుంటూరు డిపోలో స్త్రీ శక్తి బస్సుల లైవ్ ట్రాకింగ్ విధానాన్ని పైలెట్ ప్రాజెక్టుగా చేపడతామని... ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా లైవ్ ట్రాకింగ్ విధానాన్ని ప్రవేశపెడతామని అధికారులు చెప్పారు. లైవ్ ట్రాకింగ్ విధానం అమల్లోకి వస్తే.. బస్సుల వేళలు తెలుసుకుని.. ఆ మేరకు తమ ప్రయాణ సమయాలను మహిళలు ఖరారు చేసుకుంటారని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ సమీక్ష సందర్భంగా ఆర్టిక్యులేటెడ్ ఈ – బస్సులపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ తరహా బస్సులు ప్రస్తుతమున్న సాధారణ బస్సులకు... మెట్రో రైలుకు మధ్య మిడిల్ లెవెల్ ట్రాన్స్‌పోర్టు వ్యవస్థగా ఉంటాయని అధికారులు వివరించారు.

---



# మట్టిలో మాణిక్యాలు!

- ప్రతిభ చూపిన ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ విద్యార్థులు
- ఐఐటీ, నిట్, నీట్‌లో రాష్ట్రం నుంచి 55 మందికి సీట్లు
- సీఎం చంద్రబాబును కలిసి సంతోషాన్ని పంచుకున్న విద్యార్థులు
- వచ్చే ఏడాది నాలుగు రెట్ల ఫలితాలు రావాలని సీఎం ఆకాంక్ష
- సీట్లు పొందిన ఒక్కో విద్యార్థికి ప్రోత్సాహకంగా రూ.లక్ష

అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో చదివి ఈ ఏడాది ఐఐటీ, నిట్, నీట్‌లో విజయం సాధించిన విద్యార్థులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అభినందించారు. ఐఐటీ, నిట్, నీట్‌లో సీట్లు సాధించిన 55 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి రాష్ట్ర ప్రభుత్వం అందించిన ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలిపారు. తమ సంతోషాన్ని ముఖ్యమంత్రితో పంచుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన ముఖ్యమంత్రి... మరింతగా కష్టపడి ఉన్నత చదువుల్లోనూ ప్రతిభ చూపాలని సూచించారు. భవిష్యత్‌ను ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవడంతోపాటు... రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

### ప్రోత్సహించండి... స్ఫూర్తినింపండి :

విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దేలా సాంఘిక సంక్షేమ విద్యాసంస్థలు రూపుదిద్దుకోవాలి. రాష్ట్రంలోని విద్యార్థుల్లో ప్రతిభకు కొదవలేదు. వారికి సరైన వసతులు, ప్రోత్సాహం అందిస్తే ప్రపంచంలో అందరితో పోటీ పడే సత్తా ఉంది. ఇందుకు ఈ 55 మంది విద్యార్థులే నిదర్శనం. సాంఘిక సంక్షేమ విద్యాసంస్థల నుంచి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు ఎంపికయ్యే విద్యార్థుల సంఖ్య వచ్చే ఏడాదికి నాలుగు రెట్లు పెరగాలి. ఇప్పుడు ర్యాంకులు సాధించిన విద్యార్థులు తాము చదువుకున్న పూర్వ విద్యాసంస్థకు వెళ్లి అక్కడ విద్యార్థుల్లో స్ఫూర్తి నింపాలని ముఖ్యమంత్రి ఉద్బోధించారు.

### 356 మందికి శిక్షణ... 55 మంది ఎంపిక

కర్నూలు జిల్లా చిన్నటేకూరు, ఎన్టీఆర్ జిల్లా కుంటముక్కల, గుంటూరు జిల్లా అడవి తక్కెళ్లపాడులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఐఐటీ–నీట్ సెంటర్లలో వీరంతా కోచింగ్ తీసుకుని ర్యాంకులు సాధించారు. ఈ సెంటర్లలో జేఈఈ మెయిన్ అండ్ అడ్వాన్స్‌డ్‌లో 176 మంది శిక్షణ పొందగా 129 మంది క్వాలిఫై అయ్యారు. నీట్‌కు 180 మంది కోచింగ్ తీసుకోగా 143 మంది క్వాలిఫై అయ్యారు. చివరగా ఐఐటీలో 12 మంది, నిట్‌లో 30 మంది, నీట్ ఎంబీబీఎస్‌లో 13మంది విద్యార్థులు సీట్లు సాధించారు. మొత్తం 55 మంది విద్యార్థుల్లో 20మంది విద్యార్థినులు ఉండటం విశేషం. వీరు కాకుండా బీడీఎస్‌లో మరో 14మందికి సీట్లు వచ్చే అవకాశం ఉంది.జీఎఫ్‌టీఐ, సెంట్రల్ యూనివర్సిటీల్లో 19 మందికి సీట్లు లభిస్తాయి.

### ఈ ఏడాది కొత్తగా 7 కోచింగ్ సెంటర్లు

ఈ ఏడాది కొత్తగా మరో 7 ఐఐటీ–నీట్ కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. కొత్తగా ఏర్పాటు చేసే సెంటర్లతో 1,411 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుంది. బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల కోసం ఎంతైనా ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

సమావేశం చివరిలో ఐఐటీ, నిట్, నీట్‌లో సీట్లు సాధించిన విద్యార్థులకు మెమొంటోలు, ఒక్కో విద్యార్థికి రూ.లక్ష చొప్పున చెక్ స్వయంగా అందించి వారితో విడివిడిగా సీఎం చంద్రబాబు ఫొటోలు దిగారు. మొత్తం 55 మంది విద్యార్థులకు రూ.55 లక్షలు ఇచ్చారు. విద్యార్థులందరూ పేదరికం నుంచి వచ్చి ఉత్తమ ప్రతిభ చూపడంతో ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. భుజం తట్టి ఆల్ ది బెస్ట్ చెప్పారు. సమావేశం చివరిలో బోధనా సిబ్బంది, విద్యార్థులు ముఖ్యమంత్రితో గ్రూపు ఫొటో తీసుకున్నారు. ఈ సమావేశంలో మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, అధికారులు పాల్గొన్నారు.

## వైద్యారోగ్య రంగంలో వినూత్న ఆవిష్కరణలకు..

# 'బ్రెయిన్' కార్యక్రమం!



- రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో కలిసి కార్యకలాపాలు
- ఏఐ, మెడ్‌టెక్ అలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ
- ఆసియా-పసిఫిక్ బయోడిజైన్ అలయన్స్-స్టాన్‌ఫోర్డ్ సంయుక్త సహకారం
- వైద్యారోగ్య రంగంలో పరిశోధన, శిక్షణ, స్టార్టప్‌లు, ఇంక్యుబేషన్‌ల్లో సహకారం కోసం ఎంఓయూ
- అంతర్జాతీయ బయోడిజైన్ నిపుణులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం

అమరావతి (చైతన్యరథం): వైద్యారోగ్య రంగంలో వినూత్న ఆవిష్కరణలకోసం భారత్ బయోడిజైన్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ (BRAIN-బ్రెయిన్) కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. అమరావతిలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో అంతర్భాగంగాా ఈ రీసెర్చి ఇన్నోవేషన్ కార్యకలాపాలు ఉంటాయన్నారు. ఏఐ, మెడ్‌టెక్ అలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆసియా-పసిఫిక్ బయోడిజైన్ అలయన్స్, అమెరికాలోని ప్రతిష్టాత్మక స్టాన్‌ఫోర్డ్ బయోడిజైన్ సంయుక్తభాగస్వామ్యంలో దీనిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆరోగ్య రంగంలో పరిశోధనలు, ఆవిష్కరణలను ప్రోత్సహించేలా భారత్ బయోడిజైన్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ కార్యక్రమం దృష్టి సారించనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెడికల్ టెక్నాలజీ రంగాల్లో,నూతన ఆవిష్కరణలకు మార్గం సుగమం చేయడమే లక్ష్యంగా పని చేయనుంది. అంతర్జాతీయ, స్థానిక నైపుణ్యాలను సమన్వయం చేయటం ద్వారా ప్రజారోగ్య రంగంలో బ్రెయిన్ కార్యక్రమం గణనీయమైన మార్పులను తీసుకువచ్చే అవకాశం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఆసియా పసిఫిక్ బయోడిజైన్ అలయన్స్‌కు చెందిన వేర్వేరు దేశాల వైద్య నిపుణులతో సీఎం సమావేశమయ్యారు. ఈ ప్రాజెక్టు ద్వారా మెడికల్ టెక్నాలజీ రంగంలో కొత్త స్టార్టప్‌లతోపాటు పరిశోధనలు, నిపుణులకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు.తద్వారా ఏపీ నాలెడ్జి ఎకానమీ, ఆవిష్కరణల కేంద్రంగా ఎదుగుతుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

### మెడ్ టెక్ ఆవిష్కరణలు- పరిశోధనలు

ఆస్ట్రేలియా, అమెరికా, ఇజ్రాయెల్, జపాన్, సింగపూర్, తైవాన్, ఐర్లాండ్, తదితర దేశాలకు చెందిన వైద్య నిపుణులు ఆయా దేశాల్లో బయోడిజైన్ కార్యకలాపాలపై ముఖ్యమంత్రికి ప్రజెంటేషన్ ఇచ్చారు. ఏఐ, మెడ్ టెక్ అలయన్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాకేష్ కలపాల, స్టాన్‌ఫర్డ్ సెంటర్ ఫర్ బయోడిజైన్ ప్రొఫెసర్ అనురాగ్ మైరల్, ఆసియా పసిఫిక్ బయోడిజైన్ సహాధ్యక్షుడు డాక్టర్ యోనా వైస్‌బచ్, బయోడిజైన్ ఆస్ట్రేలియా ఫ్లైర్ ప్రొఫెసర్ కెవిన్ ఫ్లెగర్, టోక్యో బయోడిజైన్ ప్రతినిధి యూరియోన్ కొబయాషి, తైవాన్ బయోడిజైన్‌నుంచి జేమ్స్ చియెన్-హియాట్సెంగ్, సింగపూర్ నేషనల్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ మార్క్‌చాంగ్, మిరాయ్ మెడికల్ సహ వ్యవస్థాపకుడు కొలిన్ ఫోర్డ్, తదితరులు ముఖ్యమంత్రికి తమ దేశాల్లో అనుసరిస్తున్న విధానాలను వివరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌ను వైద్యారోగ్యరంగంలో ఆవిష్కరణలకు, మెడ్‌టెక్ పరిశోధనలకు కేంద్రంగా అభివృద్ధి చేయాలనే రోడ్‌మ్యాప్‌పై ముఖ్యమంత్రి చర్చించారు. వైద్యారోగ్యరంగంలో పరిశోధన,శిక్షణ, సాంకేతిక బదిలీ స్టార్టప్, ఇంక్యుబేషన్, తదితర రంగాల్లో సహకారం అందించే అంశంపై గ్లోబల్ నిపుణులు-ఏపీ ప్రభుత్వం మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది.యూనివర్సిటీ ఆఫ్ వెస్ట్రన్ ఆస్ట్రేలియాకుచెందిన ఎయిమ్‌ఫౌండేషన్‌తో ఒక ప్రత్యేక ఒప్పందం కుదిరింది. ఒప్పందంతో భారత్ బయోడిజైన్-బయోడిజైన్ ఆస్ట్రేలియాలుఉమ్మడిగా పని చేయనున్నాయి. వైద్యారోగ్య రంగంలో సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, విద్యార్థులకు ప్రత్యేకకోర్సులను నిర్వహించేలా ఈ ఒప్పందం సహకరించనుంది.

### భారత్ బయోడిజైన్ రీసెర్చ్ ఇన్నోవేషన్ కార్యక్రమం

ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ హెల్త్ టెక్నాలజీ, డిజిటల్ హెల్త్ ఇన్నోవేషన్ హబ్‌గా తీర్చిదిద్దే అంశంపై భారత్ బయోడిజైన్ రీసెర్చ్ ఇన్నోవేషన్ కార్యక్రమం ప్రధానంగా పనిచేయనుంది.

ముందస్తు విశ్లేషణల ద్వారా వ్యాధుల సంక్రమణను నియంత్రించటం, ముందస్తుగా ఆరోగ్య భద్రతా కార్యక్రమాలు, తక్కువ వ్యయంతో ఆరోగ్య సేవల్ని ప్రజలకు అందించే అంశాలపై దృష్టి సారించనుంది. అదే సమయంలో అంతర్జాతీయ బయోడిజైన్ ఎకోసిస్టంలను-భారత్‌లో ఉన్న భాగస్వామ్యులను అనుసంధానించటంపైనా ఈఒప్పందం సహకరించనుంది. ప్రపంచ వ్యాప్తంగా అనుసరిస్తున్న ఉత్తమ విధానాల్ని ఏపీలో అమలు చేయటం, బయోడిజైన్‌లో శిక్షణ, పరిశోధనా రంగాల్లో అంతర్జాతీయ సహకారం, ప్రజారోగ్య రంగంలో ఆవిష్కరణల్ని, స్టార్టప్‌లను ప్రోత్సహించటం లాంటి అంశాలపై దృష్టి పెట్టనుంది. దీంతోపాటు గ్రామీణ పట్టణప్రాంతాల్లోని ఆరోగ్య సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను కూడా అందించేలా సమావేశంలో చర్చించారు. వీటితోపాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఆరోగ్యసేవలు అందించే అంశంతో పాటు చౌకగా మెడ్ టెక్ పరికరాలు, వైద్యారోగ్య రంగంలో పనిచేస్తున్న సిబ్బందికి శిక్షణ తదితర అంశాలపైనా దృష్టి పెట్టనున్నారు.

### ప్రజారోగ్యంలో డిజినెర్వ్స్ సెంటర్

ప్రజారోగ్యంలో ఇప్పటికే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి వైద్యసేవలు అందించేలా కార్యక్రమాన్ని చేపట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. చిత్తూరుజిల్లా కుప్పంలో టాటా-గేట్స్ ఫౌండేషన్‌లతో కలిసి డిజినెర్వ్స్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి ఏరియా ఆస్పత్రిని అనుసంధానించి ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నామని స్పష్టం చేశారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా డిజినెర్వ్స్ సెంటర్ సేవలు విస్తరిస్తామని తెలిపారు. ఆధునిక వైద్య సేవలతో పాటు భారతీయ సంప్రదాయ వైద్య విధానాలైన యోగా, నేచురోపతిని కూడా ప్రజారోగ్యం కోసం అనుసంధానిస్తున్నామని తెలిపారు. విశాఖలోని ఏపీ మెడ్ టెక్ జోన్ కూడా ఆధునిక వైద్య పరికరాల తయారీలో కీలకంగా ఉందని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుత ఒప్పందంతో వైద్యారోగ్య రంగంలో విప్లవాత్మక ఆవిష్కరణలు సాధ్యం అవుతాయని సీఎం వ్యాఖ్యానించారు.

ఈ సమావేశానికి వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, వైద్యారోగ్యం కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ జి.వీరపాండియన్, ఈడీబీ సీఈఓ సాయికాంత్ వర్మ, తదితరులు హాజరయ్యారు.

---

# రాష్ట్రంలో రిజర్వాయర్లకు జలకళ

- సమర్థ నీటి నిర్వహణతో సత్ఫలితాలు
- ఎప్పటికప్పుడు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
- 80 శాతం పైగా నిండిన రిజర్వాయర్లు
- కృష్ణా, గోదావరి, పెన్నా, వంశధార నదుల ద్వారా ఈ సీజన్‌లో ఇప్పటికి 310 టీఎంసీల వినియోగం
- హంద్రీనీవా ద్వారా సీమ జిల్లాల ప్రాజెక్టులకు సమృద్ధిగా నీళ్లు
- హంద్రీ నీవా కాలువల విస్తరణతో 738 కి.మీ మేర ప్రయాణించి కుప్పం చేరిన కృష్ణమ్మ
- ఎగువ రాష్ట్రాల నుంచి వస్తున్న ప్రవాహాలతో సముద్రంలోకి వృథాగా 1969 టీఎంసీలు



అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న సమర్థ నీటి నిర్వహణ సత్ఫలితాలను ఇస్తోంది. నీటి నిర్వహణపై సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఇరిగేషన్ అధికారులకు ఇదే విషయంపై చంద్రబాబు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తూనే ఉన్నారు. ప్రతీ వర్షపు చుక్కనూ ఒడిసి పట్టాలన్న లక్ష్యం మేరకు ఓవైపు రిజర్వాయర్లను నింపుతూనే మరోవైపు అన్ని నదీ బేసిన్ల ఆయకట్టుకు నీరిచ్చేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. దానికి అనుగుణంగా ఈ సారి కృష్ణా, గోదావరి, వంశధార, పెన్నా నదీ బేసిన్లలో అన్ని రిజర్వాయర్లలోనూకలిపి ప్రస్తుతం 80శాతం మేర నీటి నిల్వలు ఉన్నాయి. కృష్ణా నదిపై ప్రధాన ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జున సాగర్, పులి చింతల ప్రాజెక్టులు గత నెలలోనే నిండాయి. పైనుంచి నిరంతర వరద ప్రవాహాలు కొనసాగుతుండడంతో వచ్చిన నీటిని వచ్చినట్లు కిందికి పంపుతున్నారు. ఇదే సమయంలో ఆయా ప్రాజెక్టుల నుంచి గరిష్ట మొత్తంలో నీటిని వివిధ లిఫ్టుల ద్వారా, కాలువల ద్వారా ఇతర రిజర్వాయర్లకు, చెరువులకు, పంటలకు మళ్లిస్తున్నారు. ఈ ఏడాది జులై నెలలోనే కృష్ణాకు భారీ వరద రావడంతో పెద్ద ఎత్తున నీటికి సీమ ప్రాంతానికి తరలించి ప్రాజెక్టులు నింపుతున్నారు.ప్రస్తుతం కృష్ణా డెల్టాలోని ఆయకట్టుకు ఈ ఏడాది జూన్ 1 తేదీ నుంచి ఇప్పటి వరకూ 52 టీఎంసీల నీటిని రైతులు వినియోగించుకున్నారు. ప్రభుత్వం చేపట్టిన సమర్థ నీటి నిర్వహణతో గతంతో పోలిస్తే ఈసారి అదనంగా 12టీఎంసీల వినియోగం జరిగింది. గోదావరి బేసిన్‌లోని సర్ ఆర్థర్‌కాటన్ బ్యారేజీ ద్వారా ఎగువ నుంచి వస్తున్న ప్రవాహాలను యథాతథంగా దిగువకు సముద్రంలోకి వదులుతు న్నారు. గోదావరి డెల్టాలోని పంటల సాగుకు సీజన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ 70టీఎంసీల మేర నీటిని ఆయకట్టుకు విడుదల చేశారు. పెన్నా బేసిన్లో వెలిగోడులో 15 టీఎంసీలు, సోమశిలలో 56 టీఎంసీలు, కండలేరులో 31 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వంశధార బేసిన్లోని గొట్టా బ్యారేజీ నుంచి ఈ సీజన్లో 8 టీఎంసీల నీటిని ఆయకట్టుకు ప్రభుత్వం అందించింది. మొత్తంగా చూస్తే ఆగస్టు 24 నాటికి ప్రధాన జలాశయాల్లో 650 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది.

### సమర్థ నీటి నిర్వహణ- వినియోగం

ఈ ఏడాది ఇప్పటి వరకు కృష్ణా, గోదావరి, వంశధార బేసిన్లలో కలిపి 309 టీఎంసీల నీటిని ఆయకట్టు అవసరాలకు వినియోగించారు. సర్ ఆర్థర్ కాటన్ ధవళేశ్వరం బ్యారేజీనుంచి 70టీఎంసీలు, ప్రకాశం బ్యారేజీ నుంచి 52 టీఎంసీలు, వంశధార నుంచి 8 టీఎంసీల మేర నీటిని కాలువలకు విడుదలచేశారు. పోతిరెడ్డి పాడు, హంద్రీ నీవా, నాగార్జున సాగర్ కుడికాలువ ద్వారా ఈ సీజన్లో ఇప్పటివరకు 156టీఎంసీల నీటి వినియోగం జరిగింది. ఈఏడాది హంద్రీ-నీవా ప్రధాన కాలువ ద్వారా మల్యాల ఎత్తిపోతల నుంచి రాయలసీమ ఉమ్మడిజిల్లాల్లో ఉన్నలక్షల ఎకరాల ఆయకట్టుకూ సాగునీరుఅందిస్తున్నారు.హంద్రీనీవా కాలువల వెడల్పు చేయడంతో 738కి.మీ ప్రయాణించి కృష్ణా జలాలు చిత్తూరుజిల్లా చివరి ప్రాంతాలకు చేరుతున్నాయి. కృష్ణా జలాలు ఇప్పటికే కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు చేరుకున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు సూచనలతో ఏడాది కాలంగా చేపట్టిన సమర్థ నీటి నిర్వహణ, నిరంతర పర్యవేక్షణ ద్వారా పంటలకు అవసరమైన సాగు నీరు సకాలంలో ఇవ్వడంతోపాటు... రానున్న కాలానికి అవసరమైన విధంగా రిజర్వాయర్లను నీటితో నింపుతున్నారు.

### ఈ సీజన్ లోనే 1969 టీఎంసీలు సముద్రం పాలు

ఇలా సాధ్యమైనంత ఎక్కువ మొత్తంలో వరద నీటిని సద్వినియోగం చేసుకుంటున్నా... వివిధ నదీ బేసిన్ల నుంచి పెద్దఎత్తున నీరు సముద్రంలోకి వెళ్లింది. ఎగువ రాష్ట్రాల నుంచి వస్తున్న వరద ప్రవాహాలతో మన ప్రాజెక్టులు నిండగా మిగిలిన నీటిని సముద్రం లోకి విడుదల చేస్తున్నారు. గోదావరి, కృష్ణా, వంశధార, పెన్నా బేసిన్ల నుంచి ఈ సీజన్లో జూన్ 1 తేదీ నుంచి ఇప్పటి వరకూ 1969 టీఎంసీలకు పైగా నీరు సముద్రంలో కలిసింది. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి గోదావరి నీరు ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకూ 1483టీఎంసీల మేర సముద్రంలోకి వెళ్లింది. ప్రకాశం బ్యారేజీ నుంచి డెల్టా అవసరాల వినియోగం తర్వాత సముద్రంలోకి ఈ సీజన్లోనే 468టీఎంసీల నీరు వెళ్లింది. అలాగే వంశధార బేసిన్లో ఈ వర్షాకాల సీజన్లో ఇప్పటికే 18 టీఎంసీలకు పైగా సముద్రంలోకి వదిలారు.ప్రస్తుతం శ్రీశైలంనుంచి 4.38 లక్షలు, సాగర్ నుంచి 3.38లక్షలు, పులిచింతల నుంచి 2.72లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజ్ నుంచి పంట కాలువలకు 18వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పై నుంచి వరద వస్తుండడంతో 3.42 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. ఎగువ రాష్ట్రాల నుంచి వరద వచ్చిన సమయంలో మన రిజర్వాయర్లు నింపుకున్నా...పెద్ద మొత్తంలో నీరు సముద్రంలోకి పోతోంది. నదుల అనుసంధానం ద్వారా వరద నీటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ముందుగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసుకుని గరిష్ట నీటి వినియోగం సాధించడం, కొత్త ప్రాజెక్టులు చేపట్టడంపై ప్రభుత్వం దృష్టి సారించింది.

చైతన్యరథం

# ర్యాపిడో రాణులు!

## స్కూటర్‌కు సబ్సిడీతో రుణం





- మెప్మా సహకారం, ర్యాపిడో చొరవతో ఉపాధి పొందిన 1003 మంది మహిళలు
- తొమ్మిది నగరాల్లో సేవలు.. 3 నెలల్లో రూ.35 లక్షల ఆదాయం
- మహిళా సాధికారతే తమ ప్రాధాన్యమన్న మంత్రి లోకేష్
- ఇది ఆరంభం మాత్రమే.. రాబోయే రోజుల్లో మరింత చేస్తామని ఉద్ఘాటన


అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ మహిళలు సాధికారత దిశగా సరికొత్త మార్గంలో పయనిస్తున్నారు. మెప్మా సహకారంతో స్వయం ఉపాధి పొందుతూ వారి కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు. చేతిలోని స్మార్ట్ ఫోన్ ఉపయోగిస్తూ, ఎలక్ట్రిక్ స్కూటర్ నడుపుతూ సొంతంగా సంపాదిస్తున్నారు. రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నం, నెల్లూరు, తదితర నగరాల్లో మహిళలు కేవలం ఇంటికే పరిమితం కాకుండా సొంత కాళ్లపై నిలబడేందుకు ర్యాపిడో ద్వారా కుటుంబానికి అదనపు ఆదాయం సమకూర్చుకుంటున్నారు.

### 'ఒక కుటుంబం-ఒక వ్యాపారవేత్త' స్ఫూర్తి

మహిళల స్వయం ఉపాధికి తొలి అడుగు ఈ ఏడాది మార్చి 8న, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పడింది. అదే రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించడంతో మొదలైంది. ముఖ్యమంత్రి మానస పుత్రికగా ప్రారంభించిన "ఒక కుటుంబం - ఒక వ్యాపారవేత్త" కింద మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ మునిసిపల్ ఏరియాస్ (మెప్మా) సంస్థ ర్యాపిడో ద్వారా మహిళలకు ఎలక్ట్రిక్ వాహనాలు అందించింది. అందులో భాగంగా తొలి దశలో తొమ్మిది పట్టణాల్లో 1000 మంది లబ్ధిదారులకు రుణ సౌకర్యం కల్పించారు. వీటిలో విశాఖపట్నంలో 400 వాహనాలు, విజయవాడలో 400, నెల్లూరు, గుంటూరులో 50 చొప్పున, కర్నూలు, తిరుపతి, కాకినాడ, రాజమండ్రిలో 25 వాహనాలు చొప్పున మహిళలకు అందజేశారు. వీటిలో 760 ఎలక్ట్రిక్ టూ-వీలర్లు కాగా, 240 ఎలక్ట్రిక్ త్రీ-వీలర్లు ఉన్నాయి.

### డ్వాక్రా, మెప్మా సహకారంతో..

ఈ వాహనాలు కొనుగోలు చేసేందుకు అవసరమైన బ్యాంకు రుణాలు డ్వాక్రా సంఘాల మహిళల పేర్లతో మంజూరయ్యాయి. డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి వారి కుటుంబ సభ్యులు వాహనం నడిపేందుకు అవకాశం కల్పించారు. ఇందుకోసం అవసరమైన ప్రాజెక్ట్ రిపోర్టులను మెప్మా సిద్ధం చేసి, జాతీయ బ్యాంకుల ద్వారా రుణాలు పొందేలా సహకారం అందించింది. ఈ క్రమంలో ర్యాపిడో సైతం మహిళలకు సాధికారతనందించడంలో భాగస్వామ్యం కావడం విశేషం. కొత్తగా చేరిన వారికి ప్లాట్‌ఫామ్ ఫీజులో మూడు నుంచి నాలుగు నెలల వరకు మినహాయింపు ఇచ్చారు. అలాగే తొలి సంవత్సరం టూ-వీలర్, త్రీ-వీలర్ యజమానులకు నెలకు వెయ్యి రూపాయల ఈఎంఐ మొత్తాన్ని సాయంగా అందించారు. దీంతో ర్యాపిడో నడపడం ప్రారంభించిన గృహిణులకు తొలి రోజు నుంచే ఆదాయం ప్రారంభమైంది. అలాగే ఈఎంఐ, ఇంధన భారం కూడా తగ్గింది. దీనిలో భాగంగా ఇప్పటివరకు 1003 కుటుంబాలు లబ్ధి పొందగా, వారిలో 688 మంది ర్యాపిడోలో నమోదు అయ్యారు.



### మహిళల విజయగాథలు

విజయవాడకు చెందిన వడ్లపూడి గ్లోరీ మంజు మార్చిలో ప్రభుత్వ సబ్సిడీతో స్కూటర్ కొనుగోలు చేసి ర్యాపిడో నడపడం ప్రారంభించారు. ప్రస్తుతం నెలకు పది వేల వరకు సంపాదిస్తున్నారు. "ఇంటిపనులు పూర్తి చేసిన తర్వాత కొద్ది గంటలు ర్యాపిడో నడిపి వాహనం ఈఎంఐ మొత్తాన్ని చెల్లిస్తున్నాను. అలాగే కొంత సొమ్మును పొదుపు చేస్తున్నాను. సొంత కాళ్లపై నిలబడటం ద్వారా వస్తున్న ఆదాయం కన్నా ఆర్థిక స్వాతంత్ర్యం లభించడంతో ఎక్కువ సంతోషంగా అనిపిస్తోందని మంజు చెబుతున్నారు.

విజయవాడలోని కండ్రిక ప్రాంతానికి చెందిన మాధవి తన భర్తకు పక్షవాతం రావడంతో కుటుంబ బాధ్యతలను తాను స్వీకరించారు. "ఎస్సీ వర్గానికి చెందిన నేను బ్రహ్మానందరెడ్డిని ప్రేమ వివాహం చేసుకున్నాను. ఆయనకు పక్షవాతం వచ్చిన తర్వాత ప్రభుత్వం ఇచ్చే రూ. 6,000 దివ్యాంగ పెన్షన్ మందులకు సరిపోతోంది. ఈ సమయంలో మెప్మా ద్వారా రుణం పొంది ఆక్టివా టూ-వీలర్ కొన్నాను. ర్యాపిడో వాహనం నడుపుతూ నెలకు రూ.12 వేల వరకూ సంపాదిస్తున్నాను. ఈఎంఐ చెల్లించడంతోపాటు ఇంటిని నడపడానికి ఆ ఆదాయం తోడ్పడుతోందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

విజయవాడకు చెందిన 45 ఏళ్ల బాడిస భవాని భర్త అనారోగ్యం బారిన పడటంతో ఇంటికే పరిమితమయ్యారు. ఇంటి బాధ్యతను తలకెత్తుకున్న భవాని ఆదాయం సంపాదించాలని ఆలోచించారు. అదే సమయంలో మెప్మా అందిస్తున్న సహాయం గురించి తెలుసుకుని, అధికారుల సహకారంతో రూ.1.20 లక్షల విలువైన ఈ-స్కూటర్ కొనుగోలు చేసి ర్యాపిడోలో చేరారు. ప్రస్తుతం రోజుకు రూ. 500 నుంచి రూ. 700 వరకు సంపాదిస్తున్నానని ఇప్పుడు కుటుంబ పోషణ అనేది తనకు సమస్యే కాదని ఆనందంగా చెబుతున్నారు.

### ప్రభుత్వ సహకారంతో..

మహిళా సాధికారత కోసం ప్రభుత్వం ఎలక్ట్రిక్ స్కూటర్‌లకు రూ. 12,300 నుంచి ఆటోలకు రూ.36,000 వరకు సబ్సిడీ అందిస్తోంది. మరోవైపు ప్రభుత్వ చొరవకు తమ వంతు సహాయంగా ర్యాపిడో ఈఎంఐ విషయంలో ఫీజు మినహాయింపునిచ్చింది. ఈ వాహనాలన్నీ ఎలక్ట్రిక్ కావడంతో ఇంధన వ్యయం గణనీయంగా తగ్గిపోయింది. దీంతో ర్యాపిడో నడుపుతున్న మహిళలు నెలకు సుమారు రూ. 13 నుంచి 16 వేల వరకు ఆదాయం ఆర్జిస్తున్నారు.

### మూడు నెలల్లో 45 వేల రైడ్లు..

మెప్మా సహకారంతో ర్యాపిడో నడుపుతున్న మహిళా డ్రైవర్లు కేవలం మూడు నెలల్లో (మే, జూన్, జూలై) రికార్డు స్థాయిలో 45 వేల రైడ్లు పూర్తి చేశారు. మొత్తంగా రూ.35 లక్షల ఆదాయం సంపాదించారు. మహిళల విజయగాథల స్ఫూర్తితో రాబోయే ఏడాదిలో మరో 4 వేల 800 మందికి ఈ పథకాన్ని విస్తరించాలని ప్రభుత్వం ప్రణాళికను సిద్ధం చేసింది.

### ఇది ఆరంభం మాత్రమేనన్న మంత్రి లోకేష్

మహిళలు సాధికారత సాధించాలనేది ప్రభుత్వ ఆలోచన అని విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. తెలుగుదేశం పార్టీ మహిళా రిజర్వేషన్లను ప్రవేశపెట్టడంతోపాటు, అన్ని రంగాల్లోనూ వారిని ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. ర్యాపిడోతో కలిసి రాష్ట్రంలో 1000 మందికి పైగా మహిళలు స్వీయ ఉపాధి సాధించినందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇది ఆరంభం మాత్రమేనని, రాబోయే రోజుల్లో మరింత చేస్తామని మంత్రి నారా లోకేష్ వివరించారు.

చైతన్యరథం



# ఎరువులపై ఆందోళన వద్దు

## రైతులకు మంత్రి అచ్చెన్నాయుడు భరోసా

- అందుబాటులో 6.48 లక్షల మెట్రిక్ టన్నులు
- పంపిణీపై పకడ్బందీ పర్యవేక్షణ
- పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని రైతులకు ఎరువుల సరఫరా విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా, పంటలకు అవసరమైన ఎరువులు సమయానికి అందేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల అవసరం, సరఫరా, నిల్వలు, కేంద్రం-రాష్ట్రం సమన్వయం, రైతులకు ఇచ్చిన హామీలపై మంత్రి అచ్చెన్నాయుడు వివరణ ఇచ్చారు. రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 31.15 లక్షల హెక్టార్లు కాగా, ఇప్పటి వరకు 21.34 లక్ష హెక్టార్లలో పంటలు వేశారు. యూరియా, డీఏపీ, ఎంఓపీ, ఎస్ఎస్‌పీ, కాంప్లెక్స్ ఎరువులు కలిపి 6.22 లక్షల మెట్రిక్ టన్నులు రైతులకు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రాష్ట్రం మొత్తం రైతుల అవసరాలను బట్టి జిల్లాల వారీగా సరఫరాలను సక్రమంగా పర్యవేక్షిస్తున్నామని వివరించారు.

**బఫర్ స్టాక్ ఏర్పాటు - భవిష్యత్ ప్రణాళిక**

రైతులకు ఎరువుల కొరత రాకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుని 1.10 లక్షల మెట్రిక్ టన్నుల బఫర్ స్టాక్ ఉంచిందని మంత్రి తెలిపారు. గోదావరి వరదల వల్ల కొన్ని ప్రాంతాల్లో రవాణా సమస్యలు తలెత్తినప్పటికీ, రైతులకు ఎరువులు సమయానికి అందేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఇంకా 79,633 మెట్రిక్ టన్నులు డిపోల్లో నిల్వ ఉండగా, అవసరమైన ప్రాంతాలకు తరలింపులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

**పంపిణీపై కఠిన పర్యవేక్షణ**

ఎరువుల సరఫరాలో కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతో 50:50 నిష్పత్తిలో పంపిణీ జరుగుతోందని మంత్రి స్పష్టం చేశారు. కేంద్రం నుండి ఇప్పటి వరకు 3.50 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించగా, అందులో 1.30 లక్షల మెట్రిక్ టన్నులు చేరాయని, 0.47 లక్షల మెట్రిక్ టన్నులు రాబోతున్నాయని తెలిపారు. ఆగస్టు నెలలో 1.65 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించగా, అందులో 0.75 లక్షల మెట్రిక్ టన్నులు ఇప్పటికే రాష్ట్రానికి చేరాయని, మిగిలిన 0.90 లక్షల మెట్రిక్ టన్నులు గంగవరం, కాకినాడ, విశాఖపట్నం, ఒడిశా పోర్టుల ద్వారా త్వరలో చేరనున్నాయని వివరించారు. రైతులకు ఎరువులు పారదర్శకంగా, సమయానికి అందించేందుకు ఇంటిగ్రేటెడ్ ఫెర్టిలైజర్ మేనేజ్మెంట్ సిస్టం (ఐఎఫ్ఎంఎస్) ద్వారా పర్యవేక్షణ కొనసాగుతోందని మంత్రి తెలిపారు. ఈ విధానం వల్ల ఎరువుల నిల్వలు, అవసరాలు, పంపిణీపై రియల్ టైమ్ సమాచారం అందుతుందని చెప్పారు. జిల్లా స్థాయి అధికారులు, సహకార సంఘాలు, వ్యవసాయ శాఖ సంయుక్తంగా సమన్వయం చేసుకుంటూ ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నారని వివరించారు.

**రైతులకు హామీ -భరోసా**

రాష్ట్రంలో 6.48 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని మంత్రి స్పష్టం చేశారు. రైతులు సాగు కొనసాగించడానికి కావలసినంత ఎరువులు సకాలంలో అందుతాయని హామీ ఇచ్చారు. వర్షాల ప్రభావంతో కొన్నిచోట్ల రవాణా ఆలస్యం జరిగినా, రైతులకు ఇబ్బంది కలగకుండా తక్షణ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వర్షాల వలన దెబ్బతిన్న ప్రాంతాల్లో పంటలకు ప్రత్యేక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎరువులు అందిస్తున్నామని చెప్పారు.

మార్కెట్లో కొందరు మధ్యవర్తులు అధిక ధరలకు ఎరువులు అమ్మే ప్రయత్నాలు చేస్తే, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నల్లబియ్యం, అరటి, చెరకు వంటి ప్రత్యేక పంటలకు తగిన ఎరువులు సరఫరా అయ్యేలా ప్రత్యేకంగా పర్యవేక్షణ జరుగుతోందని తెలిపారు. రైతుల సంఘాలు, సహకార సంఘాలు, మార్కెటింగ్ సొసైటీల ద్వారా ఎరువుల సరఫరా వేగంగా జరుగుతోందని వివరించారు. అన్నదాతలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం పంట అవసరాలను దృష్టిలో ఉంచుకొని అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. కేంద్రం సహకారంతో రాష్ట్రంలోని ప్రతి రైతుకి ఎరువులు అందేలా కృషి చేస్తున్నామని అని మంత్రి అచ్చెన్నాయుడు పునరుద్ఘాటించారు.

# అబద్ధాల్లో అంబటికి ఆస్కార్ ఇవ్వొచ్చు

- మంత్రి నిమ్మల రామానాయుడు వ్యంగ్యం
- పదవిలో ఉన్నప్పుడు చేతులెత్తేసి ఇప్పుడు సవాళ్లు సిగ్గుచేటు
- పోలవరంపై మాట్లాడటానికి వైకాపా నాయకులకు సిగ్గుండాలి
- ఉనికి కాపాడుకునేందుకు విష ప్రచారం, అడ్డదారులు



పాలకొల్లు (చైతన్యరథం): పోలవరం ప్రాజెక్టుపై మాట్లాడడానికి వైసీపీ నాయకులకు సిగ్గుండాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్ధాలు అతికినట్టు చెప్పడంలో మాజీ మంత్రి అంబటి రాంబాబుది అందె వేసిన చెయ్యి అంటూ ఈ విషయంలో ఆయనకు ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చునని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో సోమవారం మీడియాతో మంత్రి నిమ్మల మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ ఎప్పుడు పూర్తవుతుందో, అసలు పూర్తవుతుందో లేదో తనకే తెలియదని చేతులెత్తేసిన అంబటి రాంబాబు నేడు పోలవరంపై చర్చకు సిద్ధమంటూ ముఖ్యమంత్రి చంద్రబాబుకి సవాలు విసరడం అంటే సింహం ముందు చిట్టెలుక చిందులు వేయడంలా ఉందని ఎద్దేవా చేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్ శాఖకు మంత్రిగా రెండో కృష్ణుడుగా వచ్చిన అంబటికి... అతని పదవీకాలం రెండేళ్లు మొత్తం పోలవరం ప్రాజెక్టు గురించి అర్థం చేసుకోవడానికే సరిపోలేదన్నారు. అందువల్లనే.. ఈ ప్రాజెక్టు ఎప్పటికీ పూర్తవుతుందో, పూర్తవుతుందో లేదో కూడా తెలియడం లేదని అంబటితోపాటు, వాళ్ల పార్టీ అధినేత, అప్పటి సీఎం జగన్మోహన్ రెడ్డి చేతులెత్తేసిన సంగతి వాళ్లు మర్చిపోయినా రాష్ట్ర ప్రజలు మర్చిపోలేదన్నారు. అవగాహన లేని అంబటి పోలవరంపై చర్చకు సిద్ధమంటూ సవాలు విసరటం సిగ్గుచేటన్నారు. అన్నీ తెలిసిన వాళ్ళతో చర్చించవచ్చు.. అసలు ఏమీ తెలియని వాళ్ళతో చెప్పి ఒప్పించవచ్చు. అటు ఇటు కాని వాళ్ళతో ఏం చర్చిస్తాం.. ఏం మాట్లాడతామని మంత్రి నిమ్మల అన్నారు.

**ఉనికి కాపాడుకునేందుకే..**

ముఖ్యమంత్రి దాకా ఎందుకు, పోలవరంపై...మా పార్టీ దిగువ శ్రేణి నాయకులకు ఉన్న పరిజ్ఞానం కూడా అంబటికి లేదని తేల్చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి 2014 -19 మధ్య అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనిచేయటంతో ఆ ఐదేళ్ల కాలంలో ప్రాజెక్టు పనులు 72శాతం పూర్తయ్యాయన్నారు. దురదృష్టం కొద్దీ 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన దిక్కుమాలిన వైకాపా ప్రభుత్వం జాతి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టులో జీవం తీసేసిందని. రివర్స్ టెండరింగ్ పేరిట.. కాంట్రాక్ట్ ఏజెన్సీలతో పాటు, సాంకేతిక నిపుణులను, సిబ్బందిని కూడా మార్చేసి శాడిజం ప్రదర్శించిందన్నారు. 18 నెలలు కాలయాపన చేసి డయాఫ్రం వాల్ కొట్టుకుపోవడానికి కారణభూతమైందని, ఇప్పుడు ఆ డయాఫ్రమ్ వాల్ కట్టడానికి రూ. 900కోట్లు ఖర్చు అవుతోందన్నారు. పోలవరం ప్రాజెక్టుకు వైకాపా చేసిన పాపాలలో ఇది ఒక ఉదాహరణ మాత్రమేనన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రాజెక్టు నిర్మాణ, సాంకేతిక విభాగాలు అన్నింటిని నిర్లక్ష్యానికి గురిచేసి నిర్వీర్యం చేసేసిందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రగతిని పాతికేళ్ల వెనక్కి నెట్టేసిందని, 2019లో కూడా టీడీపీ ప్రభుత్వం కొనసాగి ఉంటే పోలవరం ప్రాజెక్టు పూర్తి అవడమే కాక ఏటా రూ. 50 వేల కోట్ల రూపాయలు విలువచేసే పంటలు పండేవి.. రాష్ట్రం సస్యశ్యామలమై ఉండేదన్నారు. ఇలా జరగకనోవడానికి దుర్మార్గ, కక్ష సాధింపు వైకాపా ప్రభుత్వమే కారణమన్నారు. 14 నెలల కూటమి ప్రభుత్వ పనితీరు గురించి మాట్లాడే నైతికత వైకాపా నేతలకు లేదన్నారు. ఇచ్చిన హామీలు మొదటి ఏడాదే 80 శాతం పైగా నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. వైకాపాకు భవిష్యత్తు లేదు, ఆ పార్టీ త్వరలో కనుమరుగు కాబోతోందని ప్రజలకు అర్థం అయిపోయిందన్నారు. ఈ కారణంగానే ఉనికిని కాపాడుకోవడానికి వైకాపా అడ్డదారులు తొక్కుతోందని, ప్రజల మనసు గెలవాలన్న రాజమార్గాన్ని వీడి విష ప్రచారం, అబద్ధాలు, హింసను ప్రేరేపించడం, సమాజంలో అశాంతిని, అలజడిని రేకెత్తించడం ద్వారానో తిరిగి అధికారంలోకి రావాలని చూస్తోందని మంత్రి నిమ్మల మండిపడ్డారు.

# వినాయక మండపాలకు ఉచిత విద్యుత్

***రూ.25 కోట్ల నిధుల కేటాయింపు : మంత్రి గొట్టిపాటి రవికుమార్***



ఒంగోలు (చైతన్యరథం): వినాయక చవితి ఉత్సవాల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన మండపాలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయనున్నట్టు విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మొత్తం 15 వేల ఉత్సవ మండపాలకు ఉచిత విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.25 కోట్లు కేటాయిం చిందని వివరించారు. ప్రజల ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఎటు వంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ముందుగానే చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఒంగోలులో సోమవారం పర్యటించిన ఆయన ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీక రించిన జనసేన నేత షేక్ రియాజ్‌తో సమావేశమై అభినందించా రు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలనపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. జగన్ పాలనలో రాష్ట్రాన్ని అప్పు ల కుప్పగా మార్చారని, అరకొర సంక్షేమ పథకాలతో ప్రజలను మభ్యపెట్టాలని మాత్రమే ప్రయత్నించారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వంలో సంపద సృష్టి పూర్తిగా సున్నా కాగా, కూటమి ప్రభు త్వం మాత్రం సంపద సృష్టించి తద్వారా సంక్షేమాన్ని అందించే లక్ష్యంతో ముందుకువెళుతోందని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేసి చూపిందని తెలిపారు. పింఛన్ల విష యంలోనూ కూటమి ప్రభుత్వం విప్లవాత్మకమైన చర్యలు చేపట్టిం దని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 65 లక్షల మందికి పింఛ న్లు అందుతున్నాయని తెలిపారు. అంతేకాకుండా ఇటీవల 1.10 లక్షల మందికి కొత్తగా స్పౌజ్ పింఛన్లు మంజూరు చేసినట్లు వెల్ల డించారు. కొందరు అర్హత లేని వారికి కూడా పింఛన్లు అందుతు న్నాయన్న ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వం సమగ్ర సర్వే చేపట్టిన ట్లు మంత్రి తెలిపారు. దానిని వక్రీకరించి వైసీపీ అసత్య ప్రచారం చేస్తోందని ధ్వజమెత్తారు. అర్హులైన ప్రతిఒక్కరికీ పింఛన్లు అందిం చడమే కూటమి ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు.

# 'అనంత' అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాం

- జిల్లా రూపురేఖలు మార్చేందుకు కృషి
- డీఆర్‌సీ సమావేశంలో మంత్రులు భరత్, కేశవ్




అనంతపురం (చైతన్యరథం): జిల్లా అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని అనంతపురం జిల్లా ఇన్చార్జ్ మంత్రి, రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ.భరత్, రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం సాయంత్రం జిల్లా అభివృద్ధి సమీక్షా కమిటీ (డిఆర్సీ) సమావేశం మంత్రి టీజీ.భరత్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో మంత్రి పయ్యావుల కేశవ్, హిందూపురం ఎంపీ పార్థసారథి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, రాప్తాడు, గుంతకల్లు, శింగనమల, కళ్యాణదుర్గం ఎమ్మెల్యేలు పరిటాల సునీత,గుమ్మనూరు జయరాం, బండారు శ్రావణి శ్రీ, అమిలినేని సురేంద్రబాబు, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ పి.జగదీష్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, ఏడిసిసి బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి టీజీ.భరత్ మాట్లాడుతూ సమావేశంలో ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధుల నుంచి తెలియజేసిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమలు రాష్ట్రమంతా రాబోతున్నాయన్నారు. అధికారంలోకి వచ్చిన 14 నెలల కాలంలోనే 10 లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చేలా ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు. వాటి ద్వారా 8.50 లక్షల ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉందన్నారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని సత్యసాయి జిల్లాకు ఎక్కువగా పరిశ్రమలు వచ్చే అవకాశం ఉందన్నారు. బెంగళూరుకు సమీపంలో ఉండడం సత్యసాయి జిల్లాకు కలిసివచ్చిందని, మౌలిక సదుపాయాలు మరింత పెరిగితే పెద్ద ఎత్తున పరిశ్రమలు అనంతపురంలో కూడా పరిశ్రమలు నెలకొల్పే అవకాశం ఉందన్నారు. ఆ దిశలో చర్యలు తీసుకుంటున్నామన్నారు. డ్రిప్ ఇరిగేషన్‌లో దేశంలో అనంతపురం జిల్లా రెండవ స్థానంలో నిలవడం పట్ల జిల్లా యంత్రాంగాన్ని, అధికారులను అభినందించారు. రాష్ట్రంలో 175 ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి తెలిపారని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి డిఆర్సీ మీటింగ్ నిర్వహించేందుకు చర్యలు చేపడతామన్నారు.

మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ముందుగా సమావేశంలో ప్రభుత్వం హంద్రీ నీవా కాలువ వెడల్పు పనులను రికార్డు స్థాయిలో 100 రోజుల్లో పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందించడం ఒక గొప్ప కార్యక్రమం అని తీర్మానం ప్రవేశ పెడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులు ప్రభుత్వం అంకితభావాన్ని, అధికారుల మంచి పని తీరుని అభినందించారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ఎన్పీసీఐ పెండింగ్ ఉన్న వాటిని త్వరితగతిన క్లియర్ చేయాలన్నారు. ఎన్పీసీఐ లింక్ పెండింగ్ పూర్తి చేసుకోవటం, ఆధార్ నెంబర్ ఈకేవైసీ చేసుకోవటంపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ జేడిని ఆదేశించారు. క్షేత్రస్థాయి సిబ్బందిని పెట్టి రైతుల వద్దకే వెళ్లి ఈకేవైసీని చేయించాలన్నారు. మండలానికి కనీసం ఐదు కిసాన్ డ్రోన్ లు అందుబాటులో ఉంచాలని సూచించారు. యూరియాను గత ప్రభుత్వంలో చివరి సీజన్ కి 22,000 మెట్రిక్ టన్నులు కేటాయించగా, ఈ ఖరీఫ్ సీజన్ కి గత ప్రభుత్వం కన్నా ప్రస్తుత ప్రభుత్వం సుమారు 5వేల మెట్రిక్ టన్నులకుపైగా ఎక్కువ కేటాయించిందన్నారు. గత ఏడాది కంటే పంట సాగు తగ్గిపోయినా, ఇంతకుముందు కంటే 5,000 మెట్రిక్ టన్నుల యూరియా అధికంగా తమ కూటమి ప్రభుత్వం కేటాయించినా యూరియా కొరత ఎందుకు వస్తోందనే విషయంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఏ ఏరియాలో ఎంత యూరియా అవసరముంది, ఎంత కేటాయించారు అనేది సరిచూసుకుని బఫర్ తగినంత అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేటు ఏజెన్సీల కన్నా ఆర్ఎస్కే, డిసిఎంఎస్ ల ద్వారా మరింత ఎక్కువగా యూరియా అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వం యూరియా అవసరానికి మించే కేటాయించిందని తెలిపారు. కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని, విజిలెన్స్ అధికారులు తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రతి రైతుకు యూరియా అందేలా చూడాలన్నారు. అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం ఇస్తున్నామన్నారు. తమది పని చేసే ప్రభుత్వమని, రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిరోజు రాష్ట్ర సచివాలయంలో కూర్చుంటున్నారని, వారానికి రెండు రోజులు క్షేత్రస్థాయిలో తిరుగుతున్నారన్నారు. ప్రతి శాఖ పరిధిలో సాధించిన ప్రగతిపై పాత్రికేయుల సమావేశాలు పెట్టి ప్రజలందరికీ తెలియజేయాలన్నారు. జిల్లాకు సంబంధించి ప్రధానమైన సమస్యలను ఫాలోఅప్ చేయడానికి అమరావతిలో ఒక అధికారిని జిల్లా కలెక్టర్ నియమించాలని, అన్ని శాఖలతో సమన్వయం చేసుకొని పని చేసేందుకు తగిన ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు.. ప్రాజెక్టుల పెండింగ్ అంశాలను రానున్న 3 లేదా నాలుగు సంవత్సరాల్లో పూర్తి చేయడానికి సుముఖంగా ఉన్నారన్నారు. జిల్లాలో బిటిపీ ప్రాజెక్టు, అప్పర్ పేరూరు, మడకశిర కెనాల్, తదితర ప్రాజెక్టులను మూడు నాలుగు ఏళ్లలో పూర్తి చేయాలన్నది ముఖ్యమంత్రి సంకల్పం అన్నారు. తక్కువ నిధులతో ఎక్కువ ప్రయోజనం కలిగే వాటిని పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధంగా పెట్టుకోవాలన్నారు. జిల్లాలో ప్రతి చెరువుకు నీరందించాలన్నారు. అనంతపురం జిల్లా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, జిల్లాలో హంద్రీనీవా కాలువ, మడకశిర కెనాల్, బిటిపి ప్రాజెక్టులు, అన్నిటిని పూర్తిచేసే వరకు ఈ ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందన్నారు. జిల్లా అభివృద్ధి కోసం రాజకీయాలకతీతంగా పని చేస్తామన్నారు. డీఎస్సీ కింద ఉద్యోగుల నియామకాలు పారదర్శకంగా చేపడతామన్నారు. అన్ని శాఖల అధికారులకు వారి సబ్జెక్టులపై అవగాహన కల్పించుకోవాలని, కీ పర్ఫామెన్స్ ఇండికేటర్స్ ను గుర్తుపెట్టుకోవాలన్నారు.

# మార్కాపురం ప్రత్యేక జిల్లా ఏర్పాటు దిశగా కృషి



- వెలిగొండ పూర్తి చేసి ప్రజల నీటి కష్టాలు తీర్చుతాం
- ఏడాదిలోనే సూపర్ సిక్స్ - సూపర్ హిట్
- మంత్రి గొట్టిపాటి రవి కుమార్

మార్కాపురం (చైతన్యరథం): మార్కాపురం ప్రత్యేక జిల్లా ఏర్పాటు దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజల నీటి కష్టాలను తీర్చుతామని హామీ ఇచ్చారు. ప్రకాశం జిల్లా నేతలంతా ఐక్యంగా ఉంటూ జిల్లాలో అభివృద్ధి పరుగులు పెట్టిస్తామని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. సోమవారం నాడు మార్కాపురంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పర్యటించారు. మార్కెటింగ్ యార్డ్ చైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు.

అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేసిందని గుర్తు చేశారు. ఎంతమంది పిల్లలున్నా ప్రతి తల్లికి వందనం పథకం కింద రూ.13 వేల చొప్పున ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 65 లక్షల పింఛన్లు ఇస్తోందని, ఇటీవల మరో 1.10 లక్షల మందికి స్పౌజ్ పింఛన్లు మంజూరు చేశామని చెప్పారు. వైసీపీ పాలనలో ఒక్క స్పౌజ్ పింఛను కూడా ఇవ్వలేదని ఆయన విమర్శించారు. అర్హత లేని వారికి పింఛన్లు అందుతున్నాయన్న ఫిర్యాదుల కారణంగా ప్రభుత్వం సమగ్ర సర్వే చేపట్టగా, దానిపై వైసీపీ అసత్య ప్రచారం చేస్తోందని మంత్రి వ్యాఖ్యానించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందించడమే కూటమి ప్రభుత్వ సంకల్పం అని స్పష్టం చేశారు.

ఇచ్చిన హామీ మేరకు డీఎస్సీ ద్వారా పోస్టులను భర్తీ చేస్తున్నామని, త్వరలోనే విద్యుత్ శాఖలో కూడా ఉద్యోగ నియామకాలు చేపడతామని వెల్లడించారు. వైసీపీ పాలనలో విద్యుత్ శాఖ అస్తవ్యస్తమైందని, దానిపై రూ. 80 వేల కోట్ల భారాన్ని మోపారని ఆయన ఆరోపించారు. మూడు రాజధానుల ముసుగులో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వ్యక్తి జగన్ రెడ్డేనని మంత్రి మండిపడ్డారు. 33 వేల ఎకరాలు ఇచ్చిన రైతుల త్యాగాన్ని విలువలేనిదిగా మార్చారని, దేశంలో రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను నిలిపిన ఘనుడు జగన్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. అమరావతి పునర్నిర్మాణానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అలాగే మార్కాపురం జిల్లా ఏర్పాటు, వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయడం కూటమి ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు. పేదలను దోచేది వైసీపీ ప్రభుత్వం అయితే, పేదలకు సాయం చేసేది కూటమి ప్రభుత్వం అని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ స్పష్టం చేశారు.

## పూర్తికాని వెలుగొండను జాతికి అంకితం చేసి

# జిల్లా ప్రజల్ని మోసం చేసిన జగన్



- ఇచ్చిన మాట ప్రకారం పూర్తి చేస్తాం
- హామీలన్నీ అమలు చేస్తున్నాం.. త్వరలో నిరుద్యోగ భృతి
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

మార్కాపురం (చైతన్యరథం): ఇచ్చిన మాట ప్రకారం మార్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తాం, వెలుగొండ ప్రాజెక్ట్ పూర్తి చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం నాడు ప్రకాశం జిల్లా మార్కాపురంలో ఏఎంసీ చైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రులు డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, కూటమి ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజ నేయస్వామి మాట్లాడుతూ...వ్యవసాయానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు.5 ఏళ్ల వైసీపీ పాలనలో జగన్ రైతుల్ని పట్టించుకున్న పాపానపోలేదు. వెలుగొండ పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేసి జగన్ జిల్లా ప్రజల్ని మోసం చేశారు. ఎన్నికల ముందు డ్రామాలాడి ప్రజల్ని మోసం చేసి నేడు వైసీపీ నేతలు సిగ్గులేకుండా వెలుగొండ గురించి మాట్లాడుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం మార్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తాం, వెలుగొండ పూర్తి చేసి జిల్లాను సస్య శ్యామలం చేస్తాం. సూపర్ సిక్స్ హామీలు సూపర్ హిట్ అయ్యాయన్నారు. పింఛన్ల పెంపు, తల్లికి వందనం, దీపం, అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి, మెగా డీఎస్సీతో 16 వేల ఉద్యోగాలు ఇలా...ఇచ్చిన అన్ని హామీలు అమలు చేస్తున్నాం. ఎస్సీ వర్గీకరణ చేశాం. రూ.1290 కోట్లతో మార్కాపురంలో తాగునీటి ప్రాజెక్టు ఏర్పాటు చేస్తున్నాం. త్వరలో నిరుద్యోగ యువతకు భృతి ఇస్తామని మంత్రి డా. స్వామి అన్నారు.

# స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ ప్రారంభం

- పారదర్శకంగా సరుకులకు శ్రీకారం
- 1.46 కోట్ల కుటుంబాలకు కార్డులు
- క్యూఆర్ కోడ్ స్కాన్‌తో పూర్తి సమాచారం
- సమస్యలుంటే 196కు కాల్ చేయొచ్చు
- కార్డు పోయినా మళ్లీ తీసుకోవచ్చు
- పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్

మచిలీపట్నం (చైతన్యరథం): రాష్ట్రంలో చౌక దుకాణాల ద్వారా పారదర్శకంగా నిత్యావసర సరుకులు పొందేందుకు స్మార్ట్ రైస్ కార్డులు ఎంతగానో ఉపయోగపడతాయని పౌరసరఫరాలు శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం పౌరసరఫరాల కమిషనర్ సౌరబ్‌గౌర్, సంయుక్త కలెక్టర్ గీతాం జలి శర్మలతో కలసి పెనమలూరు నియోజకవర్గం పోరంకి బీజేఆర్ నగర్‌లో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. అనంతరం పోరంకి డీలర్ దుర్గారాణి చౌక దుకాణాన్ని తనిఖీ చేసి స్టాకు వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఈ రోజు రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పౌరసరఫరాల శాఖలో అనేక సంస్కరణలు చేపట్టిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలో కొత్తగా 1.46 కోట్ల గృహాలకు 4.42 కోట్ల స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ ప్రారంభించినట్లు చెప్పారు. ఈ స్మార్ట్ కార్డు వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయని, ముఖ్యంగా పారదర్శకంగా నిత్యావసరాలు



పొందడంతో పాటు కార్డులో ఉన్న క్యూఆర్ కోడ్‌కు స్కాన్ చేస్తే మనం తీసుకున్న సరుకుల సమాచారం ఫోన్‌లోకి వస్తుందన్నారు. ఏ సమయంలో ఏ సరుకులు తీసుకున్నారో తెలుస్తుందన్నారు.

**సమస్యలుంటే 196కు కాల్ చేయొచ్చు**

కార్డులో ఇంటి చిరునామాలు, కుటుంబ వివరాలు చేర్పులు మార్పులు సహజంగా గ్రామ వార్డు సచివాలయాలలో దరఖాస్తు చేసుకుంటే అదేరోజు వారు అప్లోడ్ చేస్తారని ఇంటిగ్రేటెడ్ డేటా అప్రోచ్ ద్వారా డేటా అంతా జిల్లాస్థాయిలో జిల్లా కలెక్టర్ సంయుక్త కలెక్టర్, రాష్ట్రస్థాయిలో పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో కమి షనర్ వద్ద పొందుపరచబడి సమాచార లోపం లేకుండా చేసుకోవ చ్చున్నారు. ఎవరికైనా ఏమైనా ఇబ్బంది ఉంటే కార్డుపై ఉన్న 196 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి చెప్పవచ్చున్నారు. కృష్ణా జిల్లాలో 5,17, 825 క్యూ ఆర్ కోడ్ ఉన్న స్మార్ట్ కార్డుల పంపిణీ జరుగుతుందన్నారు. అందులో పెనమలూరు నియోజకవర్గంలో దాదాపు 92 వేల కార్డులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్డులను పౌరస రఫరాల శాఖ ఉద్యోగులతో పాటు గ్రామ వార్డు సచివాలయాల సిబ్బంది కూడా పంపిణీ చేస్తారని వివరించారు. ఈ కార్డు ఒక గుర్తింపు కార్డు లాగా కూడా పనిచేస్తుందని చెప్పారు. ఉద్యోగం, చదువు కోసం ఎక్కడికి వెళ్లినా అక్కడ చౌక దుకాణాల నుంచి నిత్యావసరాలు పొందే సౌలభ్యం కల్పించామని వివరించారు.

**కార్డు పోయినా మళ్లీ తీసుకోవచ్చు**

పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా నూతన సాంకేతిక పరిజ్ఞానంతో పాత కార్డుకు అనుసంధానం చేస్తూ స్మార్ట్ బియ్యం కార్డులను గుర్తింపు కార్డుల రూపంలో మన రాష్ట్రంలో తొలిసారిగా ప్రవేశపెట్టి మరీ ముఖ్యంగా తన నియోజకవర్గంలో లబ్ధిదారులకు అందజేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్‌లకు ధన్యవాదాలు తెలుపుతు న్నామన్నారు. ఈ కార్డు ఒకవేళ పోతే 196 టోల్ ఫ్రీ నెంబర్‌కు తెలియజేసి దరఖాస్తు చేసిన పక్షంలో రూ.50 ఖర్చుతో కొత్త కార్డు ను ఇంటికే పోస్ట్ ద్వారా పంపడం జరుగుతుందన్నారు. సాంకేతి కత పరిజ్ఞానంతో కార్డు అనుసంధానమై ఉన్నందున దుర్వినియో గం చేసే అవకాశం లేదన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో మోహన్‌బాబు, ఉయ్యూరు ఆర్డీవో బిఎస్ హేలా షారోన్, తహసీల్దారు గోపాలకృష్ణ, తాడిగడప మునిసిపల్ కమిషనర్ నజీర్, వీఆర్వో పవన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్‌కార్డులతో ప్రయోజనాలు

- పౌరసరఫరాల శాఖలో సంస్కరణలు
- లబ్ధిదారుల సమాచారం అందులోనే..
- జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు
- పాలకొల్లులో రేషన్ స్మార్ట్‌కార్డుల పంపిణీ

పాలకొల్లు (చైతన్యరథం): స్మార్ట్ రేషన్‌కార్డులతో పౌరసరఫరాల శాఖలో సంస్కరణలకు శ్రీకారం చుట్టినట్లు జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో అమలు చేస్తున్న సూపర్‌సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. సోమ వారం పాలకొల్లు తహసీల్దార్ కార్యాలయంలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ కలిగిన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణితో కలిసి స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభించారు. అధికారం ఇస్తే అభివృద్ధి వైపు నడపాలని, విధ్వంసం వైపు కాదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్స ర కాలంలోనే ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు



చేయడం ప్రజలందరూ చూస్తూనే ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని పరిస్థితులను చక్కదిద్దుతూ సంక్షేమం, అభివృ ద్ధిని కొనసాగించడం ఎంతో గొప్ప విషయమన్నారు. నేడు స్మార్ట్ రేషన్ కార్డ్ పంపిణీతో ఏ సమయంలోనైనా, ఎక్కడ నుండైనా రేష న్ పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందన్నారు. వృద్ధులకు, దివ్యాంగులకు, శివారు గ్రామాలకు ఇంటి వద్దకే రేషన్ పంపిణీకి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రేషన్ డీలర్లకు మంచి గౌరవం కల్పించామని, వారు కూడా లబ్ధిదారులకు గౌర వ, మర్యాదలతో రేషన్ సక్రమంగా అందించాలన్నారు. జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్రభుత్వం రేషన్ పంపిణీని మరిం త పారదర్శకంగా నిర్వహించే లక్ష్యంగా పాత కార్డులు స్థానంలో క్యూఆర్ కోడ్ కలిగిన కొత్త రైస్ కార్డులను అందుబాటులో తీసు కొచ్చిందన్నారు. ఆగస్టు 25 నుంచి 31 వరకు గ్రామ, వార్డు సచి వాలయ సిబ్బంది ద్వారా, సెప్టెంబర్ 1 నుంచి 15 వరకు రేషన్ షాప్ డీలర్ ద్వారా రేషన్ షాప్ వద్దకు వచ్చిన కార్డుదారులకు డీలర్ అందజేస్తారు. సెప్టెంబర్ 16 నుంచి 20 వరకు ఇంకా మిగిలిన కార్డులను మళ్ళీ గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది కార్డుదారుల ఇంటి వద్దనే అందజేయడం జరుగుతుందన్నారు. అప్పటికీ కార్డులు తీసుకోకపోతే వాటిని సెప్టెంబర్ 21న తహసీ ల్దార్ కార్యాలయంలో అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, నరసాపురం ఆర్డీవో దాసిరా జు, డీఎస్వో ఎన్.సరోజ, తహసీల్దార్ వై.దుర్గా కిషోర్, ఏఎస్ఓ రవి శంకర్, స్థానిక నాయకులు రోజా రమణి, బోనం చిన్నబాబు, శ్రావణ కుమార్, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్‌కార్డులతో అక్రమాలకు చెక్

- ఏటీఎం కార్డు తరహాలో రూపకల్పన
- టెక్నాలజీని అమలుచేస్తున్న తొలి సీఎం
- పంపిణీని ప్రారంభించిన మంత్రి దుర్గేష్
- నిడదవోలు అధికారులకు అభినందనలు

నిడదవోలు (చైతన్యరథం): రేషన్ సరకుల పంపిణీలో అక్రమాలకు చెక్ పెడుతూ రేషన్ వ్యవస్థను ప్రక్షాళనచేసేలా లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేసినట్లు పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. సోమవారం తూర్పుగోదావరి జిల్లా నిడదవో లు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్ నందు జిల్లా స్థాయిలో నిర్వహించిన స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీని మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మాదిరి పెద్ద పుస్తకాల్లా కాకుండా ఏటీఎం కార్డు, ఆధార్ కార్డుల తరహాలో జేబులో ఇమిడిపోయే విధంగా రాజముద్రతో పాటు లబ్ధిదారు చిత్రం ఉండే విధంగా స్మార్ట్ రేషన్‌కార్డులు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించామని వెల్లడించారు. వీటిలో క్యూఆర్ కోడ్ పొందుపరిచామన్నారు. కార్డుపై ముద్రించిన క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేస్తే కుటుంబసభ్యుల వివరాలు, ఈకేవైసీ స్థితి, రేషన్ సరకుల వివరాలు, కేటాయించిన పరిమాణం, రేషన్ పొందిన స్థితి, డిపో వివరాలు



తెలుస్తాయన్నారు. అంతేగాక రాష్ట్రంలో ఎక్క డి వారైనా, ఎక్కడి నుంచైనా రేషన్ తీసుకునే సదుపాయం కల్పిం చామని వివరించారు. రేషన్ డీలర్ల వద్ద ఉండే ఈ పోస్ యంత్రా లనూ కూటమి ప్రభుత్వం ఆధునికీకరించిందని వివరించారు.

**కార్డుల పంపిణీలో నిడదవోలు నెంబర్ 1**

స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ ప్రక్రియను తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో ప్రారంభించడం ఆనందంగా ఉందని తెలిపారు. నిడదవోలు నియోజకవర్గంలోని ఉండ్రాజవరం, పెరవలి, నిడద వోలు రూరల్ మండలాల్లో మొత్తం రేషన్ కార్డులు 81,749 ఉంటే ఇందులో 713 మినహాయించి మిగతా 81,026 రేషన్ కార్డులు స్మార్ట్‌కార్డులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. కార్డు ల పంపిణీలో తూర్పుగోదావరిలోనే నిడదవోలును నంబర్ 1 స్థానంలో నిలబెట్టినందుకు అధికార యంత్రాంగాన్ని అభినందిం చారు. ప్రజల కోరిక మేరకు ఎండీయూ వ్యవస్థను రద్దు చేసి మళ్లీ రేషన్ డీలర్ వ్యవస్థను తీసుకొచ్చినట్లు చెప్పారు.

**ప్రజాసేవకే టెక్నాలజీ వినియోగిస్తున్న తొలి సీఎం**

దేశంలో టెక్నాలజీని ఒడిసి పట్టుకుని ప్రజల సంక్షేమం కోసం అమలుచేస్తున్న మొట్టమొదటి ముఖ్యమంత్రి చంద్రబాబు అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ మెచ్చుకున్నారని గుర్తుచేశారు. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్, వాట్సాప్ గవర్నెన్స్ తదితర అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రాష్ట్రానికి తెచ్చిన వ్యక్తి సీఎం చంద్రబాబు అన్నారు. ఈ క్రమంలో స్మార్ట్ రేషన్ కార్డులు ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ఎ.దుర్గేష్, డీఎస్వో వి.పార్వతి, నియోజవర్గ అబ్జర్వర్, నిడదవో లు పట్టణ మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్మన్, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, నిడదవోలు జెడ్పీ టీసీ, కూటమి పార్టీ మండల అధ్యక్షులు, పట్టణ, మండలాల కూటమి నాయకులు పాల్గొన్నారు.

చైతన్యరథం

# డీఎస్సీ అంటూ జగన్ దగా చేశారు

- నాడు నిరుద్యోగులను మోసగించాడు
- కూటమి ప్రభుత్వంలో వారి కల సాకారం
- ఉద్యోగాలిస్తుంటే తప్పుదోవ పట్టిస్తున్నారు
- ఉద్దేశపూర్వకంగానే గందరగోళం సృష్టిస్తున్నారు
- అభ్యర్థులు వైసీపీ చెప్పుడు మాటలు వినొద్దు
- న్యాయపరమైన చిక్కులు తెచ్చుకోవద్దు
- ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి



మంగళగిరి (చైతన్యరథం): డీఎస్సీలో ఉద్యోగాలు పొందుతున్న అభ్యర్థులు ఎవరి చెప్పుడు మాటలు వినాల్సిన పనిలేదని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి సూచించారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ యువతకు మెగా డీఎస్సీ నిర్వ హించింది. అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు డీఎస్సీ ఫైల్‌పై తొలి సంతకం చేశారు. ప్రభుత్వం 16,347 టీచర్ పోస్టు లు భర్తీ చేస్తోంది. కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశం కల్పిస్తుంటే జగన్, ఆయన వందిమాగధులు వారిని తప్పుదోవ పట్టిస్తున్నారు.. బులుగు మీడియా.. నిరుద్యోగు ల్లో గందరగోళం సృష్టిస్తోంది. కూలంకుశంగా పరిశీలించి ఆప్షన్ లు పెట్టుకోవాలని దరఖాస్తులు పూర్తిచేసేటప్పుడే తెలిపారు. ఈ విషయం నోటిఫికేషన్‌లోనే స్పష్టంగా పేర్కొనడం జరిగింది. అర్హత సాధించిన వారు, ఉద్యోగాలు పొందిన వారిని వైసీపీ తప్పుదోవ పట్టిస్తోంది. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతున్న సమయంలో వారి లో గందరగోళాన్ని సృష్టిస్తున్నారు. 15 రోజుల్లో వారికి నియామక పత్రాలు అందజేసే సమయంలో ఇలాంటి వాటికి తెరలేపడం సరికాదు. ఎవరెవరు ఏ పాఠశాలల్లో పనిచేయాలో స్థలాలు కూడా కేటాయించడం జరుగుతోంది. అందరూ ఆనందంగా ఉన్న సమ యంలో ఇలాంటివి పనికిరాదని హితవుపలికారు.

**ఉద్యోగాలివ్వడం వారికి ఇష్టం లేదు**

నిరుద్యోగులకు ఉద్యోగాలివ్వడం జగన్‌కు, సాక్షి పత్రికకు కంటకంగా మారింది. డీఎస్సీలో నో ఆప్షన్, పరీక్షకు ముందే పోస్టుల ప్రాధాన్యతలను ఆయా ఉద్యోగస్థులు ఎంపిక చేసుకున్నా రు. మళ్లీ ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలని ఉద్యోగాలు పొందినవారిలో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నప్పటికీ ప్రజలకిచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఉద్యోగావకాశాలు కల్పిస్తోంది. ప్రస్తుతం ఉద్యోగాలు పొందుతున్న నిరుద్యోగులు ఈ విషయాన్ని గమనించాలి. గతంలో జగన్ 23 వేల పోస్టులు భర్తీ చేస్తానని చెప్పి నిరుద్యోగులను మోసం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం 16,347 పోస్టులు భర్తీ చేయడం జరుగుతోంది. దరఖాస్తు చేసుకొనే సమయంలోనే ఎస్జీటీ కావాలా? లేక స్కూల్ అసిస్టెంట్ పోస్టా, ఉర్దూ పోస్టా, ఏది కావా లని ప్రశ్నిస్తూ ఆప్షన్లు పెట్టారు. ఇప్పుడు గందరగోళం సృష్టిస్తు న్నారు. మంచిగా జరుగుతున్న ఈ తీరును తప్పుడు ట్రాక్‌లోకి తీసుకెళ్లడానికి కొందరు ప్రయత్నిస్తున్నారు. అనేక అనుమానాలను తెరమీదికి తెస్తున్నారు. చెప్పుడు మాటలు వినద్దు. సర్టిఫికెట్ల వెరిఫికే షన్‌లో అందరూ పాల్గొని రాష్ట్ర విద్యాభివృద్ధిలో అందరూ పాలుపంచుకోవాలి. ఏడెనిమిదేళ్లుగా రాష్ట్రంలో డీఎస్సీ జరగలేదు. నిరుద్యోగులు వారి స్వప్నాన్ని సాకారం చేసుకుంటున్న సమయం లో బ్లూ మీడియాలో వచ్చిందనో, ప్రతిపక్ష పార్టీల ప్రతినిధులు మాట్లాడారనో ఎలాంటి అనుమానాలు, ఆందోళనలకు గురి కావద్దని సూచించారు.

**చిక్కులు కొని తెచ్చుకోవచ్చు**

ఆ రోజు ఏ ఆప్షన్ పెట్టుకున్నారో ఆ ఆప్షన్‌తోనే ముందు కెళ్లండి. గతంలో సర్వీస్ కమిషన్ ఉద్యోగాలు న్యాయపరమైన చిక్కుల్లో పడ్డాయి. 1998, 2008 డీఎస్సీలకు సంబంధించినవారు నేటికి కూడా కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ఇలా న్యాయ సం బంధమైన చిక్కుల్లో పడొద్దు..అమ్మ పెట్టదు, అడుక్కోనివ్వదు అన్నట్లుగా వైసీపీ ప్రభుత్వం ఒక్క ఉద్యోగం ఇవ్వలేదు, ప్రస్తుతం ఇస్తున్న 16,347 ఉద్యోగాలకు అడ్డుపడుతున్నారు. వైసీపీ దీన్ని సమర్థించాలి..ఉద్యోగాలు పొందుతున్న వారిని ఆశీర్వదించి వారికి అండగా నిలవాలి.. మంచినీళ్లలో బురద జల్లే కార్యక్రమం మాను కోవాలని హితవుపలికారు.

**డీఎస్సీతో చంద్రబాబు, లోకేష్ వెలుగులు నింపారు**

అనేకమందికి వయసు పెరిగింది. వారికి ప్రభుత్వం సడలింపు నిచ్చింది. జూలై 1 నాటికి గరిష్ఠ వయోపరిమితి 44గా పెట్టింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఈడబ్ల్యుఎస్ అభ్యర్థులకు వయో పరిమితి 49 సంవత్సరాలు, దివ్యాంగ అభ్యర్థులకు 54 ఏళ్లుగా నిర్ణయించి ఈ డీఎస్సీ నిర్వహించింది. దీంతో చంద్రబాబు, లోకేష్ అనేక మంది జీవితాల్లో వెలుగులు నింపారు. జగన్ 4 సంవత్సరాల 9 నెలలు కుంభకర్ణుడిలా నిద్రపోయారు. జగన్ రాష్ట్రంలో 23 వేల ఉద్యోగా లు ఖాళీ ఉన్నాయని చెప్పారు. 4 సంవత్సరాల 9 నెలలకు అనగా ఎన్నికలు రెండు నెలలు ఉన్నాయనగం కుంభకర్ణ నిద్ర వీడి డీఎస్సీ వదిలారు.

దాన్ని కూడా పూర్తి చేయలేని దద్దమ్మ జగన్. టీడీపీ ప్రభుత్వం 2014-19 మధ్య రెండు మెగా డీఎస్సీలు నిర్వహించి 18 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిన ఘనత చంద్రబాబుది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సమగ్ర శిక్షలో దాదాపు 720 నాన్ టీచింగ్ పోస్టులు ఇటీవల భర్తీ చేసింది. గిరిజన ప్రాంతాల్లో 90 ఎస్టీలకు కొత్తగా ఉపాధ్యాయులను నియమించింది. 700 కోయ భారతి టీచర్ పోస్టులను కూడా భర్తీ చేసింది. గెస్ట్ ఫ్యాకల్టీలుగా జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 700 మంది సిబ్బంది సేవ లను పునరుద్ధరించింది. కేవలం 10 వేలతో పనిచేస్తున్న వారికి 27 వేల జీతాన్ని పెంచింది. కూటమి ప్రభుత్వం ఆర్థికంగా ఆదు కుని వారికి అండగా నిలిచింది.

**లోకేష్ గాడిన పెడుతున్నారు**

వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉపాధ్యాయులను అనేక అవమానాల పాలు చేసింది. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు వారు కేవలం పాఠ్యాంశాలపైనే దృష్టి పెట్టేందుకు అనేక చర్యలు చేపట్టడం జరిగింది. అనేక యాప్‌లతో ఇబ్బంది పడే ఉపాధ్యాయు లకు ఒకే ఒక యాప్‌ను తెచ్చింది. అనేక విశ్వవిద్యాలయాల్లో సంస్కరణలు డిగ్రీ, ఇంజనీర్ కళాశాలల్లో సంస్కరణలు తీసు కొచ్చేందుకు నారా లోకేష్ చిత్తశుద్ధితో పనిచేస్తున్నారు. కూటమి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తోంది. పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం జరిగింది. ప్రైవేటు విద్యా సంస్థల్లో కూడా ఉపాధ్యా యులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తున్నారు. దేశం లోనే విద్యా రంగాన్ని అగ్రగామిగా నిలిపేందుకు లోకేష్ ప్రయ త్నం చేస్తున్నారని తెలిపారు.

**వైసీపీ నేతలు సవాల్‌కు సిద్ధమా?**

వైసీపీ నాయకులు, బ్లూ మీడియా రాష్ట్రంలో పాఠశాలలు మూతపడుతున్నాయని, విద్యా వ్యవస్థ భ్రష్టుపట్టిపోతోందని దుష్ప్రచారం చేస్తున్నాయి. రకరకాల అవాకులు, చవాకులు పేలుస్తున్నారు. వారందరికీ సవాల్ విసురుతున్నాను. 2019-24లో విద్యా వ్యవస్థ బాగుందా? ఈ 15 నెలల కాలంలో విద్యా వ్యవస్థ బాగుందా జనాలు చెప్పాలి. కూటమి ప్రభుత్వ కాలం లోనే విద్యా వ్యవస్థ గాడిలో పడింది. యూనివర్శిటీలలో వైస్ ఛాన్సలర్ల నియామకంలో వైసీపీ ప్రభుత్వం అవకతవకలకు పాల్పడింది. కూటమి ప్రభుత్వం విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సల ర్ల నియామక విషయంలో నిష్పాక్షికంగా, రాజకీయాలతో సంబం ధం లేనివారిని ఉప కులపతులుగా నియమి స్తోంది. యూనివ ర్శిటీలను ప్రక్షాళన చేస్తున్నాం. వైసీపీ హయాంలో వారి బంధు వులు, వారి పార్టీ అనుచరులైన ప్రసాద్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, సుందర వల్లిలను వీసీలుగా నియమించారు. అనర్హులను విశ్వవి ద్యాలయాలకు వైస్ ఛాన్సలర్లుగా నియమించి విద్యా వ్యవస్థనే భ్రష్టుపట్టించారు. అలాంటివాటికి అవకాశం లేకుండా విజ్ఞులైన వారిని వీసీలుగా నియమించి విద్యావ్యవస్థకు పెద్దపీట వేశాం. ఈ విషయాల్లో వైసీపీ నాయకులు అవాకులు చవాకులు పేల్చ డం తగదు. వైసీపీలా లక్షలాది రూపాయలు లంచాలు తీసుకుని ఉపాధ్యాయులకు బదిలీ ఆర్డర్లు ఇవ్వలేదు. ఎలాంటి అవకతవ కలకు తావులేకుండా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

# నర్సింగ్ కోర్సుల్లో సంస్కరణలు

**తొలిసారి ప్రత్యేక పరీక్షతో ప్రవేశాలు - మేనేజ్‌మెంట్ కోటా భర్తీ హెల్త్ వర్సిటీదే - ప్రతిభ కలిగిన విద్యార్థులకు మేలు - రెండు జీవోల్లో మార్పులకు ఆమోదం**

అమరావతి (చైతన్యరథం): ప్రతిభ కలిగిన విద్యార్థులకు పెద్దపీట వేసేందుకు బీఎస్సీ నర్సింగ్ కోర్సుల ప్రవేశాల్లో అవకతవకలకు తావులేకుండా కూటమి ప్రభుత్వం సంస్కరణలు ప్రవేశపెట్టింది. 2025-26 విద్యా సంవత్సరంలో జరిగే ప్రవేశాలతో ఈ సంస్కర ణలు అమలులోకి రానున్నాయి. ఈ మేరకు బీఎస్సీ (నర్సింగ్) కోర్సులో ప్రవేశాలకు సంబంధించి 1998లో జారీ అయిన జీవో నెంబర్ 145, 2023లో జారీ అయిన జీవో నెంబర్ 41ల్లో తగు మార్పులు చేయడానికి వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపారు. ఈ విషయానికి సంబంధించి ఉన్నతాధికారు లతో పలు అంశాలను సమీక్షించి మంత్రి ఆమోదం తెలిపారు.

**నూతన సంస్కరణలు**

ఇప్పటివరకు నాలుగేళ్ల బీఎస్సీ(నర్సింగ్) కోర్సులో ఎంసెట్ ర్యాంకులు, ఇంటర్ మార్కుల ప్రాతిపదికన ప్రవేశాలు జరిగాయి. మొదటిసారిగా గత ఏడాది జూలైలో బీఎస్సీ (నర్సింగ్)లో ప్రవేశా ల కోసం ఏపీ నర్సింగ్ కామన్ ఎగ్జామినేషన్ టెస్ట్ను(ఏపీఎన్ సెట్) ను డాక్టర్ ఎన్టీఆర్ వైద్య విజ్ఞాన విశ్వవిద్యాలయం నిర్వహించింది.

ఆ పరీక్షలో వచ్చిన ర్యాంకుల ఆధారంగా ఈ విద్యా సంవత్సరం లో ప్రవేశాలు జరుగుతాయి. ఇప్పటివరకు ప్రైవేట్ కళాశాలల్లో కన్వీనర్ కోటాలో ప్రవేశాలను హెల్త్ యూనివర్సిటీ నిర్ణయిస్తూ



ఉండగా..మేనేజ్‌మెంట్ కోటాలో ప్రవేశాలను ఆయా కళాశాలల యాజమాన్యాలు నిర్ణయించేవి. తద్వారా ప్రతిభ తక్కువ కలిగిన విద్యార్థులకు, ఇతర రాష్ట్రాల వారికి మేనేజ్‌మెంట్ కోటాలో ప్రవే శాలు లభించేవని ఆరోపణలు వచ్చాయి.

ఈ నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ నర్సింగ్ కళాశాలల్లో కన్వీనర్ కోటాలో ప్రవేశాలతో పాటు ప్రైవేట్ నర్సింగ్ కళాశాలల్లోని మేనేజ్‌మెంట్ సీట్లకు కూడా డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆన్‌లైన్ వెబ్ కౌన్సిలింగ్‌తోనే ప్రవేశా లు చేపట్టనుంది. విశ్వవిద్యాలయం నియమించే సెలక్షన్ కమిటీ ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసిన విద్యార్థులనే మేనేజ్‌మెంట్ సీట్ల లో చేర్చుకోవాల్సి ఉంటుంది. ఈ సంస్కరణతో ప్రతిభ కలిగిన విద్యార్థులకు నర్సింగ్ కోర్సులో ప్రవేశాలు లభిస్తాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

**ప్రవేశానికి అర్హతలు**

నాలుగేళ్ల బీఎస్సీ(నర్సింగ్) కోర్సులో ప్రవేశం పొందడా నికి సాధారణ తరగతులకు(అన్ రిజర్వ్‌డ్) చెందిన వారు ఏపీఎన్‌సెట్ పరీక్ష రాసిన వారిలో 50 పర్సంటైల్‌లో ఉండాలి(అనగా ఏపీఎన్ సెట్ పరీక్ష రాసిన వారిలో 50 శాతం వారు పొందిన మార్కుల కంటే ఎక్కువ పొంది ఉండాలి). సాధారణ తరగతులకు చెందిన దివ్యాంగులు 45 పర్సంటైల్‌లో ఉండాలి(45 శాతం వారు సాధించిన మార్కుల కంటే ఎక్కువ పొంది ఉండాలి). ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ తరగతులకు చెందిన వారు, ఈ తరగతులకు చెందిన దివ్యాంగులు 40 పర్సంటైల్‌లో ఉండాలి. రాష్ట్రంలో బీఎస్సీ (నర్సింగ్) విద్యను అందించే కళాశాలల్లో మొత్తంగా 13,726 సీట్లుండగా 2024-25 విద్యా సంవత్సరంలో కన్వీనర్ కోటాలో 6,441 మంది విద్యార్థులు ప్రవేశాలు తీసుకోగా మేనేజ్‌మెంట్ కోటాలో 5,144 మంది ప్రవేశాలు పొందారు. 2,141 సీట్లు మిగిలిపోయాయి. కన్వీనర్ కోటా ప్రవేశాల్లో రిజర్వేషన్ నియమా లు వర్తిస్తాయి. మేనేజ్‌మెంట్ సీట్లలో రిజర్వేషన్లు ఉండవు.

# టీటీడీపై పనిగట్టుకుని వైసీపీ విషప్రచారం

- పవిత్రతను మంటగలిపి భ్రష్టుపట్టించారు
- భూమన అవినీతిపై మాట్లాడితే రోజులు సరిపోవు
- ఇనాం భూములు దోచారు.. తిరిగి అప్పగించాలి
- దేవుడి భూమి జోలికిపోతే ఎవరైనా సర్వ నాశనమే
- ఒబెరాయ్‌కు స్థలం ఎక్కడ కేటాయించారో తెలుసా?
- దమ్ముంటే భూమన సైట్ విజిట్‌కు రావాలి
- నాడు తలాతోక లేని కంపెనీలకు జగన్ భూములు
- బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్


మంగళగిరి (చైతన్యరథం): హిందూ మతం, హిందూ ఆచారా లు, హిందూ దేవుళ్లపై జగన్‌రెడ్డికి, వైసీపీ నేతలకు ఏ మాత్రం గౌరవం, మర్యాదలు లేవని టీడీపీ ఏపీ బ్రాహ్మణ సాధికార సమి తి రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ మండిపడ్డారు. సోమవారం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో హిందూ దేవాలయాలు, అర్చకులు, పూజారులపై జరిగి న దాడులు దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో కూడా జరగలేదు. కూట మి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 14 నెలల కాలంలో ఒక్క ఆలయంపై అయినా, ఒక్క పూజారిపై అయినా దాడి జరిగిందా? హిందూ ఆలయాలపై, దేవుళ్లపై మాకు ఉన్న నమ్మకానికి ఇదే నిదర్శనమని తెలిపారు.

### నాడు భూమన గాడిదలు కాశారా?

నిన్న భూమన కరుణాకర్‌రెడ్డి ఒబెరాయ్ హొటల్‌కు స్థలం కేటాయింపుపై మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో 24-11-2021 లో ఒబెరాయ్ హొటల్‌కు 25 ఎకరాలకు కేటాయిస్తూ జీఓ 24 విడుదల చేసింది వాస్తవం కాదా? మీరు స్థలం ఎక్కడ కేటాయిం చారు? అలిపిరి నుంచి చెర్లోపల్లికి మధ్య పశ్చిమాన కేటాయించారు. ఆ స్థలంలో జూ పార్క్, ఫారెస్ట్ స్థలం, టీటీడీ స్థలం ఉంది. అక్కడ మధ్యలో 25 ఎకరాలు ఒబెరాయ్ హొటల్‌కు కేటాయిం చారు. టీటీడీలో తీర్మానం చేయించి కేటాయింపులు కూడా చేశారు. ఆ రోజు మఠాధిపతులు, పీఠాధిపతులు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఎన్నో పోరాటాలు చేశాయి. అయినా స్పందన లేదు. పనులు మొదలుపెట్టలేదు మా అదృష్టం. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ భూములు మీకు ఇచ్చేందుకు టీటీడీ సిద్ధం లేదు.. దక్షిణాన పక్కన భారతీ విద్యాభవన్, వేదిక్ కాలేజీ, అరవిందో కంటి ఆస్పత్రి, టాటా క్యాన్సన్ ఆస్పత్రి వంటి ప్రైవేట్ సంస్థలు ఉన్న స్థలం ఉంది. వీటి మధ్యలో కొంత భూమి ఇస్తా మని టీటీడీ తీర్మానం చేసింది. ఇక్కడ దేవుడికి సంబంధించిన భూమిని ఒబెరాయ్‌కు టీటీడీ ఇవ్వడం లేదు. ప్రైవేట్ సంస్థలు ఉన్న చోటే టీటీడీ ఆ కేటాయింపులు చేస్తుందని వైసీపీ నేతలు గుర్తుపెట్టుకోవాలని హితవుపలికారు. ఇంకా కేటాయింపులు కూడా చేయలేదు..అప్పుడే భూమన బుజాలు తడుముకుంటున్నా రు. వైసీపీ హయాంలో జూ పార్క్ పక్కన ఒబెరాయ్‌కు భూమి కేటా యించినప్పుడు గాడిదలు కాశావా? అప్పుడు ఎందుకు మాట్లా డలేదు. మీ ప్రభుత్వం లేకపోతే టీటీడీపై హిందూ దేవుళ్లపై ఎదు రు దాడికి దిగుతున్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రశాంతమైన వాతావరణంలో తిరుపతి ప్రజలు ఉన్నారు. వాళ్లకు అశాంతిని చేకూర్చే విధంగా భూమన వ్యవహరిస్తున్నారు. భూమన అవినీతి, అక్రమాల గురించి మాట్లాడితే రోజులు సరిపోవు. ఇనాం భూము లు కొట్టేశాడు. స్వర్ణముఖి నదికి సమీపంలో తొమ్మిది ఎకరాల్లో కంచే వేసి పెట్టుకున్నావు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని ఆ భూమిని ప్రభుత్వానికి అప్పగించండి. దేవుడి భూమి జోలికిపోతే ఎవరైనా సరే నాశనం అయి పోతారు. భూమన కరుణాకర్‌రెడ్డి నక్సలైట్ ఉద్యమంలో ఉన్నప్పుడు తిరుమల కొండపై ఉన్నది నల్లరాయి అంటూ మాట్లాడారు. క్రిస్టియన్ పద్దతిలో పెళ్లి చేసుకున్న భూమన నేడు నీతులు చెబుతున్నాడు. తిరుపతి, చిత్తూరు జిల్లాలో పెట్టుబ డులు రాకుండా వైసీపీ నేతలు కుట్రలు చేస్తున్నారు.

### నాడు తలాతోక లేని కంపెనీకి భూ కేటాయింపు

జగన్‌రెడ్డి పాలనలో రూ.300 కోట్లు విలువ చేసే 10 ఎకరాల భూమిని బర్డ్స్ ఆస్పత్రి వద్ద ప్రైమ్ ల్యాండ్ సంస్థకు చెందిన సంజయ్ కేదార్ నాథ్‌కు విరాళం ఇచ్చారు. తలాతోకలేని కంపెనీకి చిల్డ్రన్స్ ఆస్పత్రి నిర్మిస్తామంటే బ్యాంక్ అకౌంట్‌లో రూ.25 వేలు కూడా లేని కంపెనీకి భూములు ఇచ్చారు. సైట్ విజిట్ చేసి టీడీపీ బీజేపీ, జనసేన, భక్తులు పెద్దఎత్తున ఉద్యమాలు చేస్తే అప్పుడు రద్దు చేశారు. మీ ప్రభుత్వంలో మీరు చేసిన అక్రమాలు విధానాలు అందరికీ తెలుసు. రూ.300 కోట్ల విలువైన భూములను రూ.3 లక్షల ఉన్న కంపెనీకి ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. ఒబెరాయ్ కంపెనీ తో మీకు క్విడ్ ప్రోకోలో భాగంగా గండికోట, తిరుపతి, విశాఖ, చిత్తూరులో స్థలాలు అప్పనంగా



కేటాయించారు. కూటమి ప్రభు త్వం మీరు చేసిన తప్పులను సరిచేస్తూ వేరే చోట స్థలాలు ఇచ్చేం దుకు ప్రత్యామ్నాయం చూపించాం. ఇంకా స్థలం కూడా కేటాయిం చలేదు. లేనిది ఉన్నట్టు చెప్పడంలో వైసీపీ నాయకులు పీహెచ్‌డీ చేశారు. అమరావతి మునిగిపోతుందని బురద జల్లుతారు. పోలవ రంపై బురద జల్లుతారు. తప్పుడు ప్రచారాలతో లేనిది ఉన్నట్టు చెప్పడాన్ని వైసీపీ నేతలు మానుకోవాలని హితవుపలికారు. దమ్ముంటే భూమన కరుణాకర్‌రెడ్డి సైట్ విజిట్‌కు రావాలి. మేం 5 మంది వస్తాం. మీరు 5 మంది రండి. ఎవరి ప్రభుత్వం ఎక్కడ స్థలం కేటాయించిందో చూపిస్తాం. వైసీపీ హయాంలో మున్సిపల్ స్థలాన్ని హొటల్‌కు కేటాయించారు. ఆ రోజు గాడిదలకు భూమ న పళ్లు తోముతున్నారా? మీ తప్పులను సరిదిద్దుతుంటే వైసీపీ నాయకులకు వణుకుపుడుతుంది. తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను కాపాడేందుకు మేం పనిచేస్తున్నాం. జరగనిది జరిగిన ట్టు గొడవ చేసే విధానాన్ని భూమన మానుకోవాలని హితవు పలికారు.

# రసవత్తరంగా అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీలు

## *రెండోరోజూ హొరాహొరీగా క్రీడలు - పర్యవేక్షించిన శాప్ చైర్మన్ రవినాయుడు*



తిరుపతి (చైతన్యరథం): నగరంలో ఆదివారం నుంచి జరుగు తున్న అమరావతి ఛాంపియన్‌షిప్ రాష్ట్రస్థా యి క్రీడాపోటీలు రెండవ రోజు ఉత్సాహభరితంగా సాగాయి. ఎస్వీయూలోని తారకరామ స్టేడియం, ఎస్వీ స్కూల్ క్యాంపస్, ఎస్వీయూ ఫిజిక ల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్, శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన వివిధ క్రీడలను శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు సోమవారం పర్యవేక్షించారు. తొలుత తిరుపతి ఎస్వీ స్కూల్ క్యాంపస్‌లో జరిగిన ఆర్చరీ పోటీల్లో నాలుగు జోన్ల నుంచి 89 మంది మెన్ అండ్ ఉమెన్ ఆర్చర్‌లు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. కాంపౌండ్, రికర్వ్, ఇండియన్ రౌండ్ విభాగాల్లో జరిగిన పోటీలను శాప్ డైరెక్టర్లతో కలిసి శాప్ చైర్మన్ పర్యవేక్షిం చారు. అలాగే ఎస్వీయూ తారకరామా స్టేడియంలో రెండవ రోజు జరిగిన అథ్లెటిక్స్ పోటీలను వీక్షించారు. ఈ పోటీల్లో నాలుగు జోన్ల నుంచి 80 మంది మెన్ అండ్ ఉమెన్ అథ్లెట్‌లు పాల్గొన్నా రు. 100 మీటర్స్, 400 మీటర్స్, 800 మీటర్స్, లాంగ్ జంప్, షాట్‌పుట్ ఈవెంట్‌లో అథ్లెట్‌లు తమ దైన శైలిలో ప్రతిభ కన బరిచారు.

### రసవత్తరంగా బాక్సింగ్ పోటీలు

ఎస్వీయూలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ ఇండోర్ హాలులో బాక్సింగ్ పోటీలు రసవత్తరంగా జరిగాయి. శాప్ చైర్మన్ రవినాయుడు అధ్యక్షతన ప్రారంభించిన బాక్సింగ్ పోటీ లను జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నర్సింహ యాదవ్, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ ముఖ్యఅతిథులుగా పాల్గొని బాక్సింగ్ పోటీలను ప్రారంభించారు. మెన్ బాక్సింగ్‌లో 42 మంది, ఉమెన్ బాక్సింగ్‌లో 39 మంది పాల్గొని పంచ్‌లతో విరుచుకుపడ్డారు. అనంతరం వెయిట్ కేటగిరీలో గెలుపొందిన బాక్సర్‌లకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

### రసవత్తరంగా కబడ్డీ, వాలీబాల్, ఆర్చరీ పోటీలు

ఎస్వీ క్యాంపస్ స్కూల్ గ్రౌండులో వాలీబాల్ పోటీలు, ఆర్చరీ పోటీలు హొరాహొరీగా జరిగాయి. అలాగే శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్సులో కబడ్డీ పోటీలు ఆద్యంతం అద్భుతంగా జరి గాయి. జోన్-3, జోన్-2 జట్ల మధ్య వాలీబాల్ మ్యాచ్, జోన్-1, జోన్-2 పురుషుల జట్ల మధ్య కబడ్డీ మ్యాచ్‌ను ప్రారంభిం చారు. ఈ పోటీలకు ముందు ఆర్చరీ పోటీలను పర్యవేక్షించ డంతో పాటు యారో విడిచిపెట్టి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నిం పారు. ఈ కార్యక్రమంలో శాప్ డైరెక్టర్లు రవీంద్రనాథ్, సంతోష్ కుమార్, రజినీ పాల్గొన్నారు.

# పాస్‌బుక్ రాకుండా అడ్డుకుంటున్నాడు





### వైసీపీ జెడ్పీటీసీ భర్త నిర్వాకం
### భూ ఆక్రమణతో వైసీపీ నేత దందా
### ప్రజావినతుల్లో బాధితుల ఫిర్యాదులు

మంగళగిరి (చైతన్యరథం): తమ వ్యవసాయ భూమికి పాస్ బుక్ జారీ చేయకుండా వైసీపీ జెడ్పీటీసీ కర్రి సుభాషిణి గౌరి భర్త కర్రి వేణుబాబు అడ్డుపడుతున్నారని పశ్చిమగోదావరి జిల్లా పెను మంట్ర మండలం వెలగలేరు గ్రామానికి చెందిన కొవ్వూరి భాస్కర రెడ్డి ఆరోపించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ప్రజావినతుల కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఆయనపై చర్యలు తీసుకుని పాస్‌బుక్ జారీ చేసేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాల ని కోరారు. కుమ్మర శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ప్రేరేపి ఈశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వడ్రాణం హరిబాబునాయుడు అర్జీలు స్వీకరించారు.

### చిత్తూరు వైసీపీ నేత దందా

వైసీపీ నాయకుడు వై.గణేష్ తమ భూమిని అక్రమంగా ఆక్రమించి తిరిగి తమపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారని చిత్తూరు జిల్లా సదుం మండలం కిమ్మానాయునిపల్లె గ్రామానికి చెందిన జి.గిరిబాబు ఫిర్యాదు చేశారు. ఈ కేసుపై విచారణ జరిపి కేసును కొట్టివేసి తమకు న్యాయం చేయాలని కోరారు. మరో ఫిర్యాదులో వైసీపీ కార్యకర్త ఎస్.నవాద్ అలీ రోడ్డుపై కిరాణం దుకాణం నిర్వహిస్తూ మద్యం సేవించి దారిన వెళ్లే వ్యక్తులతో అసభ్య పదజాలంతో మాట్లాడుతున్నారని నంద్యాల జిల్లా మిడుతూ రు మండలం దేవనూరు గ్రామానికి చెందిన ఎస్.వలిద్దీన్ ఫిర్యాదు చేశారు. అతనిపై కఠిన చర్యలు తీసుకుని రోడ్డుపై ఉన్న దుకాణా లు తొలగించాలని కోరారు.

### అనర్హుడికి దివ్యాంగ పింఛన్

మాయర నాగేశ్వరరావు అనే వ్యక్తి అర్హత లేకపోయినా దివ్యాం గుల కోట కింద నెలకు రూ.6000 పింఛన్ పొందుతున్నారని ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ చెందిన ఎన్.నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు. ఆయన పింఛన్ ఐడీ 106000 22833, ఆధా ర్ నెంబర్: 207487347581 అని, ఈ విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# “సూపర్ సిక్స్ - సూపర్ హిట్”... 1600 టీచర్ పోస్టులు




●“స్త్రీ -శక్తి “ ఉచిత బస్సు కోసం ఏడాదికి రూ.2 వేల కోట్లు

●చెప్పింది చేస్తాం....చేసేదే చెబుదాం.... అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అనపర్తి (చైతన్యరథం): వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని పూర్తిగా దివాలా తీసి ప్రజలను మోసం చేసి వెళ్లిపోయిందని, ఇలాంటి స్థితిలో ఆర్థిక ఇబ్బందులతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధాని మోదీ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అన్ని హామీలు అమలు చేస్తూ, దేశంలోనే నెంబర్‌వన్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతున్నట్లు నియోజకవర్గ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తెలిపారు. అనపర్తి పంచాయతీ కార్యాలయం సెంటర్‌లో “స్త్రీ శక్తి” మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు పథకం ప్రారంభించిన సందర్భంగా కృతజ్ఞత బహిరంగ సభలో పాల్గొన్ని ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... “స్త్రీ – శక్తి” ఉచిత బస్సు ప్రయాణం సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని, 16,300 ఉపాధ్యాయ పోస్టులు డీఎస్సీ ద్వారా తీసుకోవడం జరిగిందన్నారు. ఇదే డీఎస్సీ కోసం నాడు జగన్ అధికారంలోకి వస్తే వారం రోజుల్లో భర్తీ చేస్తానని చెప్పి ఐదేళ్ల పత్తా లేకుండా పోయాడని దుయ్యబట్టారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం జిల్లా వరకే పరిమితం అని నాడు వాగ్దానం చేసామని కానీ కూటమి ప్రభుత్వం మహిళలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రవ్యాప్తంగా ఉచిత ప్రయాణాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. ఇందుకోసం ప్రభుత్వంపై నెలకు రూ.167 కోట్లు, ఏడాదికి 2 వేల కోట్లు భారం పడుతుందన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ మహిళలకు మేలు చేయాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అలాగే ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు అమల్లోకి తీసుకురావడం జరిగిందన్నారు. తల్లికి వందనం పేరిట ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికి రూ.13,000 వంతున వారి ఖాతాలలో జమ చేసామన్నారు. నాడు అమ్మఒడి అంటూ జగన్ నాన్న బుడ్డికి ఆ డబ్బులు లాగేసారని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన రోజే పింఛన్లు పెంచి పేద ప్రజల పట్ల తనకున్న నిజాయితీని కూటమి ప్రభుత్వం చాటుకుందన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకంలో రూ.20వేలు ఇస్తామని చెప్పామని తొలి విడుదల ఏడు వేల రూపాయలు జమ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# “సూపర్ సిక్స్ - సూపర్ హిట్”... 1600 టీచర్ పోస్టులు



నిడదవోలు (చైతన్యరథం): రేషన్ సరకుల పంపిణీలో అక్రమాలకు చెక్ పెడుతూ, రేషన్ వ్యవస్థను ప్రక్షాళన చేసేలా లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసినట్లు మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. సోమవారం తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్లో జిల్లా స్థాయిలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గతంలో మాదిరి పెద్ద పుస్తకాల్లా కాకుండా ఏటీఎం కార్డు, ఆధార్ కార్డుల తరహాలో రాజముద్రతో పాటు లబ్దిదారు చిత్రం ఉండే విధంగా స్మార్ట్ రేషన్ కార్డులు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించామని వెల్లడించారు. వీటిలో క్యూఆర్ కోడ్ పొందుపరిచామన్నారు. కార్డుపై ముద్రించిన క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే కుటుంబ సభ్యుల వివరాలు, ఈకేవైసీ స్థితి, రేషన్ సరకుల వివరాలు, కేటాయించిన పరిమాణం, రేషన్ పొందిన స్థితి, డిపో వివరాలు తెలుస్తాయన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో ఎక్కడి వారైనా, ఎక్కడి నుంచైనా రేషన్ తీసుకునే సదుపాయం కల్పించామని మంత్రి దుర్గేష్ వివరించారు.

# వర్తక, వాణిజ్య కేంద్రంగా రామచంద్రపురం : మంత్రి వాసంశెట్టి



రామచంద్రపురం (చైతన్యరథం): రామచంద్రపురం నియోజవర్గాన్ని వర్తక, వాణిజ్య కేంద్రంగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక మహాలక్ష్మి నగర్లో సుమారు కోటి రూపాయలతో నూతనంగా నిర్మించిన రామచంద్రపురం చాంబర్ ఆఫ్ కామర్స్ భవన నిర్మాణాన్ని మంత్రి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ సత్యం, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, మార్కెట్ యార్డ్ చైర్మన్ అక్కల యశ్వంత్ రాయ్ చేతుల మీదుగా సోమవారం ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి సుభాష్ మాట్లాడుతూ... రామచంద్రపురాన్ని వర్తక, వాణిజ్య రంగాలతోపాటు అన్ని విభాగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. చిన్న చిన్న పరిశ్రమల ఏర్పాటు చేయటం ద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. వ్యాపారస్తుల శ్రేయస్సు కోరుతూ వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. చిరు వ్యాపారులు ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సుమారు కోటి రూపాయలు వెచ్చించి నూతన భవనాన్ని నిర్మించి చాంబర్ ఆఫ్ కామర్స్‌కు అందించిన దాత, కామర్స్ అధ్యక్షులు కొవ్వూరి తాతారెడ్డిని మంత్రి సుభాష్ ప్రత్యేకంగా అభినందించారు. వ్యాపారంతో పాటు, సేవా దృక్పథం కూడా కలిగి ఉండడం అభినందనీయమన్నారు. నియోజకవర్గంలో నిరుద్యోగులకు జాబ్ మేళాలు, మహిళలకు, వితంతువులకు ఉపాధి కల్పన ధ్యేయంగా కుట్టు మిషన్ల శిక్షణ, జ్యూట్ బ్యాగ్స్ తయారీ, ఎంబ్రాయిడరీ, బ్యూటీషియన్, కాస్మోటిక్, గృహోపకరణాల తయారీ వంటి వృత్తి విద్య కోర్సుల్లో ఉచిత శిక్షణలు ఇస్తున్నామన్నారు.

# స్మార్ట్ కార్డుతో ఎన్నో ఉపయోగాలు : ఎమ్మెల్యే ముప్పిడి



తాళ్లపూడి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వంలో అన్నింటిపైన ప్రభుత్వ రాజముద్రతో ముద్రించి ఇస్తున్నామని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. తాళ్లపూడిలో క్యూఆర్ కోడ్ ఆధారిత నూతన స్మార్ట్ రేషన్కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. స్మార్ట్ కార్డుతో ఎన్నో ఉపయోగాలున్నాయని, మారుతున్న కాలానికి అనుగుణంగా వీటిని అందజేస్తున్నామని ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. గత వైసీపీ హయాంలో అన్నింటిపైన రంగురంగుల జగన్ చిత్రాలను ముద్రించి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. రేషన్ దుకాణదారులు దుకాణాల వద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేయాలన్నారు. ఏమైనా ఇబ్బందులుంటే టోల్ ఫ్రీ నంబరుకు తెలియజేయాలన్నారు. తూకంలో తేడా లేకుండా సరకులు ఇవ్వాలన్నారు. స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచి అనురాధ మండలశాఖ నాయకులు, నేతలు ఉన్నారు.

# అంకితభావంతో పని చేసే నాయకులకు, కార్యకర్తలకు పార్టీలో పెద్దపీట

●వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడి



కాకినాడ (చైతన్యరథం): జిల్లా కచేరిపేటలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా పార్లమెంట్ విస్తృతస్థాయి సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు, నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ముఖ్యపార్టీ కార్యకర్తలు విస్తృతంగా హాజరయ్యారు. కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గం అభివృద్ధి దిశగా పార్టీ తలపెట్టిన కార్యక్రమాలు, జిల్లాలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై పార్టీ నాయకులతో వివరంగా చర్చించారు. జిల్లా పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు ఎంపికపై ప్రతిపాదనలను మంత్రి అచ్చెన్నాయుడు స్వీకరించారు. ఆయా కమిటీల ఎంపికపై క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ... గ్రామ స్థాయి నుండి పార్లమెంటరీ స్థాయి వరకు పార్టీ బలోపేతానికి అందరూ ఏకమై పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ స్థాయి కార్యకలాపాలలో క్రమబద్ధత, సమన్వయం అవసరమని, కొత్తగా నియమించబడిన మెయిన్ కమిటీ మరియు అనుబంధ కమిటీ సభ్యులు పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో పార్టీ బలం గ్రామాల నుండి పార్లమెంట్ స్థాయికి మరింత విస్తరించడమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సమావేశం ద్వారా పార్లమెంట్ స్థాయి నాయకత్వం బలపడుతుందని, కార్యకర్తలకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యకర్తల కష్టసాధ్యమైన పోరాటం ద్వారానే పార్టీ విజయాలు సాధిస్తుందని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం అహర్నిశలు శ్రమించే నాయకుల వివరాలను అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లి ఆయా కమిటీల్లో కీలక బాధ్యతలు అప్పగిస్తామని హామీ ఇచ్చారు. కమిటీల నియామకాలపై పార్టీ నాయకులు, కార్యకర్తల ప్రతిపాదనలను పార్లమెంట్ పరిశీలకులు అధ్యయనం చేసి అధిష్ఠానానికి నివేదిస్తామన్నారు. అనంతరం కమిటీల ఏర్పాటులో ఎవరికి స్థానం కల్పించాలనే విషయంలో పార్టీ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. పార్టీ కోసం క్రమశిక్షణ, అంకితభావంతో పని చేసే నాయకులకు రాష్ట్ర ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ ఎల్లప్పుడూ పెద్దపీట వేస్తారని అన్నారు. కార్యకర్తే అధినేత అని భావిస్తూ, కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దే ఏకైక పార్టీ తెలుగుదేశం అని మంత్రి అచ్చెన్నాయుడు తెలియజేశారు.

# నందిగామలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



నందిగామ (చైతన్యరథం): మండలంలోని కోనయపాలెం గ్రామంలో సోమవారం నాడు నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణా జిల్లా కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్, మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్, జిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ గద్దె అనురాధ గార్లతో కలిసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణా జిల్లా కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్ మాట్లాడుతూ... “ఈ డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులు గ్రామీణ పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే కాకుండా, ప్రభుత్వ సేవల్ని పారదర్శకంగా, వేగంగా అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి” అని పేర్కొన్నారు. “టెక్నాలజీని ఉపయోగించి ప్రజల దైనందిన అవసరాలను తీర్చాలన్న ప్రభుత్వం సంకల్పానికి ఇది ఓ అద్భుత ఉదాహరణ” అని ఆయన అన్నారు. డిజిటల్ భారత్ దిశగా అడుగులు వేసే విధంగా – ఈ స్మార్ట్ కార్డులు రేషన్ పంపిణీ వ్యవస్థను మరింత ఆధునీకరించబోతున్నాయి. అవినీతిని నివారించడంలో, సరైన లబ్ధిదారులకు సేవలు చేరవేయడంలో ఇవి ప్రభావవంతంగా పనిచేస్తాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో తంగిరాల సౌమ్య మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం అనేక సంస్కరణలు చేపడుతోందని, అందులో భాగంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ప్రవేశపెట్టబడిందని తెలిపారు. ఈ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు పారదర్శకంగా, సులభంగా రేషన్ సరుకులు అందుతాయని ఆమె వివరించారు. మైలవరం శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేరుస్తూ ముందుకు వెళ్తున్నామని తెలియజేశారు. జిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ గద్దె అనురాధ కూడా ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందుతాయని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ చొరవను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి మరో మైలురాయి

**●రూ.3.40 కోట్ల పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



గుంటూరు (చైతన్యరథం): పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా ముందుకు సాగుతున్నాయి. సోమవారం 35వ డివిజన్‌లో సుమారు రూ.3.40 కోట్ల విలువైన సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... ఈ రోజు 35వ డివిజన్‌లో రఘురామ్ హాస్పిటల్ నుండి కృష్ణనగర్ 2వ లైన్ వరకు, కృష్ణనగర్ 2వ లైన్ నుండి ఎన్టీఆర్ విగ్రహం వరకు, కుందుల రోడ్ నుండి పిఫ్ ఆఫీస్ రోడ్ వరకు, పిఫ్ ఆఫీస్ రోడ్ నుండి కృష్ణనగర్ మెయిన్ రోడ్ వరకు, కృష్ణనగర్ 5వ లైన్‌లో చర్చి నుండి యూనియన్ బ్యాంక్ వరకు, యూనియన్ బ్యాంక్ నుండి కృష్ణనగర్ మెయిన్ రోడ్ వరకు సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణం జరగనుంది. టీజేపీఎస్ కాలేజ్ రోడ్ పక్కన క్రిస్టినా నగర్ వద్ద సీసీ డ్రెయిన్ నిర్మాణం, పేవర్ బ్లాక్ పనులు చేపడుతున్నారు. మొత్తం ఈ పనుల అంచనా వ్యయం 3.40 కోట్ల పనులకు శంకుస్థాపన చేయటం జరిగింది. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి దిశగా ఈ కార్యక్రమాలలో ఒక కీలక ముందడుగువుతుందన్నారు. గతంలో కూడా రోడ్లు, డ్రెయిన్లు, శానిటేషన్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలే ప్రజలకు అత్యంత అవసరమని, వాటి కోసం నిరంతరం కృషి చేస్తానని, పనుల నాణ్యత విషయంలో కాంట్రాక్టర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడకూడదన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు, కార్పొరేటర్ ఈరంటి వర ప్రసాద్, జనసేన అధ్యక్షుడు బాబు, పాకలపాటి శ్రీకాంత్ మరియు ఎన్డీయే కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజలకు మంచి చేయడంలో చంద్రబాబు పట్టువదలని విక్రమార్కుడు

**●సంక్షేమం పేరుతో జగన్ రాష్ట్రాన్నే ఊడ్చేశాడు... ప్రత్తిపాటి మండిపాటు**



చిలకలూరిపేట (చైతన్యరథం): ప్రజలకు మంచి చేయడంలో ముఖ్యమంత్రి పట్టువదలని విక్రమార్కుడని, హంద్రీనీవా ద్వారా కృష్ణా నీటిని కుప్పానికి తరలించిన ఆయన సంకల్పంతో, ఆ ప్రాంత ప్రజలు.. రైతుల సంతోషానికి అవధుల్లేవని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్ పక్కన నూతన చేపల మార్కెట్, మాంసం మార్కెట్ల దుకాణ సముదాయం నిర్మాణానికి సోమవారం ఆయన శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వ్యాపారులు, స్థానికుల్ని ఉద్దేశించి ప్రత్తిపాటి మాట్లాడారు.

**3 నెలల్లో దుకాణసముదాయ నిర్మాణం పూర్తికావాలి**

పట్టణాభివృద్ధికి అవసరమైన నిధులు అందించడంలో కూటమిప్రభుత్వం ఉదారంగా వ్యవహరిస్తోందని, ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనుల విషయంలో అధికార యంత్రాంగం వేగంగా స్పందించాలని ప్రత్తిపాటి సూచించారు. రూ.1.22 కోట్లతో చేపట్టిన నూతన చేపల, మాంసం మార్కెట్ సముదాయం నిర్మాణ పనులు 3 నెలల్లో పూర్తిచేయాలని, పనులకు సంబంధించిన ప్రగతిని ప్రతినెలా తనకు తెలియచేయాలని ప్రత్తిపాటి స్థానిక మున్సిపల్ డీఈ రహీంని ఆదేశించారు. పనుల్లో నాణ్యత లోపించినా, సకాలంలో పూర్తి అవ్వకపోయినా, అధికారులే బాధ్యులవుతారని ప్రత్తిపాటి స్పష్టంచేశారు. దుకాణాలు నిర్మించి తమకు అప్పగించాక వ్యాపారులు వాటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని, రోడ్లపై వ్యర్థాలు, ట్రాఫిక్ సమస్యలతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా వ్యాపారం చేసుకోవాలని ప్రత్తిపాటి సూచించారు.

**సంక్షేమం పేరుతో.. జగన్ రాష్ట్రాన్నే ఊడ్చేశాడు**

గతంలో హంద్రీనీవా కాలువలో నీళ్ల సెట్టింగ్ వేసిన జగన్ నాడు ప్రజల్ని మోసగించి, తన పబ్బం గడుపుకున్నాడన్న ప్రత్తిపాటి. నేడు చంద్రబాబు పట్టుదలతో నీటిని తరలించి తన ప్రాంత ప్రజల కష్టాలు తీర్చాడన్నారు. సినిమావాళ్ల మాదిరి సెట్టింగులు వేసి జనాన్ని మోసగించిన నాడే జగన్ బండారం బయటపడిందని, ఆయన పనితనం కేవలం మాటలకే పరిమితమని ప్రత్తిపాటి ఎద్దేవాచేశారు. బటన్ నొక్కుడు పేరుతో ప్రజలకు పావలా ఇచ్చిన జగన్, సంక్షేమం పేరుతో తన అవినీతి మీడియాలో అంతకు పదింతలు ఊదరగొట్టించుకొని, చివరకు రాష్ట్రాన్నే ఊడ్చేశాడని ప్రత్తిపాటి చెప్పారు. మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు సహా అన్ని వర్గాల ప్రజలఆలోచనలు పసిగడుతూ, సంక్షేమ పథకాల్లో కూడా నూతనవిధానాలు ప్రవేశపెట్టడం చంద్రబాబుకే సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, రవి తదితరులు పాల్గొన్నారు

# విజయవాడలో ఇంటింటికీ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



విజయవాడ (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నూతన విధానాన్ని తీసుకువచ్చింది. ఏటీఎం కార్డు తరహాలో సరికొత్త స్మార్ట్ రేషన్ కార్డులను రూపొందించింది. ఈ కార్డుపై నేతల ఫొటోలు ఎక్కడ కూడా కనిపించవు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ లోగోలతో హుందాగా కనిపించే సరికొత్త కార్డులు పేదల చేతుల్లోకి చేరాయి. ఇంటింటికీ వెళ్లి అధికారులు రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందించారు. చౌకబియ్యాన్ని పక్కదారి పట్టించే నాటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టారు. క్యూఆర్ కోడ్‌తో పని చేసేలా ప్రత్యేక టెక్నాలజీతో తయారు చేశారు. డీలర్ల వద్ద నుంచే ఈ పోస్ యంత్రాలను సైతం ఆధునీకరించారు. స్కాన్ చేసి, ఐరిష్, వేలిముద్ర ఆధారంగా రేషన్ తీసుకోగానే క్షణాల్లో ఆ సమాచారాన్ని కేంద్ర డ్యాష్ బోర్డుకు అందించే ఏర్పాట్లు చేశారు. మన సెల్‌ఫోన్‌లోని స్కానర్‌తో స్కాన్ చేస్తే చాలు. సులభంగా వివరాలు అన్ని మనమే తెలుసుకోవచ్చు. ప్రభుత్వం జారీ చేసిన ఈ స్మార్ట్ రేషన్ కార్డులు, ఏర్పాట్ల పట్ల విజయవాడ లక్ష్మీనగర్ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటింటికీ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని మంత్రి నాదెండ్ల ప్రారంభించారు. విజయవాడ వరలక్ష్మీనగర్‌లో ఇంటింటికీ వెళ్లి పేదలకు స్మార్ట్ రేషన్ కార్డులు అందించారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరబ్ గౌర్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీషా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సెప్టెంబర్ 15 కల్లా 1.46 కోట్ల కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తామని మంత్రి తెలిపారు. కొత్తగా రేషన్ కార్డులు పొందిన వారు, అడ్రస్ మార్పు చేసుకున్నవారికి స్మార్ట్ రేషన్ కార్డులిస్తామని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో రేషన్ దుకాణాల ద్వారా గోధుమలు కూడా అందజేస్తామన్నారు. రేషన్ డీలర్ వద్ద ఉన్న 'ఈ పోస్' యంత్రాలను ఆధునీకరిస్తున్నామన్నారు.

# కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి : ఎంపీ బాలసౌరి

**●గుడ్లవల్లేరు మండలంలో 100 ట్రాక్టర్లతో... అన్నదాత సుఖీభవ భారీ విజయోత్సవ ర్యాలీ**



గుడివాడ (చైతన్యరథం) : కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఎంపీ వల్లభనేని బాలసౌరి అన్నారు. గత వైసీపీ అసమర్థ పాలనలో అన్నదాతలు దగాకు గురయ్యారన్నారు. గుడ్లవల్లేరు మండలంలో అన్నదాత సుఖీభవ విజయోత్సవ ర్యాలీ 100 ట్రాక్టర్లతో ఘనంగా జరిగింది. ర్యాలీలో నియోజకవర్గ పరిధిలోని రైతన్నలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గుడ్లవల్లేరు మండలం నుండి కౌతవరం వరకు జరిగిన ర్యాలీలో ఎంపీ బాలసౌరి, కూటమి నేతలతో కలిసి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ర్యాలీలో పాల్గొన్న రైతులు కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ నినాదాలు చేశారు. ర్యాలీలో భాగంగా మార్గమధ్యంలోని స్వర్గీయ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, సర్దార్ గౌతు లచ్చన్న, వంగవీటి మోహనరంగా, ఎన్టీఆర్ విగ్రహాలకు ఎమ్మెల్యే రాము కూటమి నాయకులు నివాళులు అర్పించారు.

**ర్యాలీ ముగిసిన అనంత కౌతవరం వాటర్ వర్క్స్ వద్ద**

మచిలీపట్నం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ నిధులు రూ.17.50 లక్షలతో నూతనంగా నిర్మించిన మైక్రో వాటర్ ఫిల్టర్ ను ఎమ్మెల్యే రాము, ఎంపీ బాలశౌరి ప్రారంభించారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ... ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ నిధులు విడుదల కావడం సంతోషకరమన్నారు.గత వైసీపీ ప్రభుత్వంలో అన్నదాతలు దగాకు గురయ్యారన్నారు. గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు ఎరువుల వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు అందిస్తుందని వెల్లడించారు. విత్తనాల పంపిణీ నుంచి ఎరువులు, సాగునీరు తదితర విషయాల్లో రైతులకు మేలు చేసే విధంగా చర్యలు చేపడుతోందని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం సఫలీకృతమైందన్నారు. వైసీపీ నేతలు విద్వేష రాజకీయాలకు పాల్పడుతున్న చలించకుండా ప్రజల సంక్షేమం రాష్ట్ర అభివృద్ధికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం దిగ్విజయంగా ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే రాము, ఎంపీ బాలసౌరి పునరుద్ఘాటించారు.

ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, గుడ్లవల్లేరు టిడిపి అధ్యక్షులు కొసరాజు బాబయ్య చౌదరి, కూటమి పార్టీల నాయకులు సాయన పుష్పావతి, వల్లభనేని బాబురావు,జంగం మోహన్ రావు, కొప్పినేని శేషవేణి, జగన్నోహన్రావు, మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం,తోట చిన్నారి, వల్లపనేని వెంకట్రావు, అట్లూరి దిలీప్, పొట్లూరి రవికుమార్, వెనిగళ్ళ నాగేశ్వరరావు, వీరమాచినేని శివప్రసాద్, వల్లపనేని రంగబాబు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# భవన కార్మికుల సమస్యలు అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్తా

**●మృతి చెందిన భవన నిర్మాణ కార్మికునికి నివాళులర్పించిన ఎమ్మెల్యే నసీర్**



గుంటూరు (చైతన్యరథం): భవన నిర్మాణ కార్మికుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ హామీ ఇచ్చారు. పాత గుంటూరుకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు వేజండ్ల కోదండ రామయ్య మృతి చెందడంతో సోమవారం ఎమ్మెల్యే నసీర్ ఆయన స్వగృహానికి వెళ్లి నివాళు లర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తోందని తెలిపారు. ప్రతి కార్మికుడు సంక్షేమ బోర్డులో రిజిస్టర్ చేయించుకోవాలని సూచించారు. దీనిపై కార్మిక శాఖ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. రిజిస్టర్ అయిన భవన నిర్మాణ కార్మికులకు ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. సహజ మరణమైతే రూ.60 వేలు సాయం చేస్తారని వెల్లడించారు. కార్మికుల కుమార్తెల వివాహానికి రూ.20 వేలు, ప్రసవ సమయంలో రూ.30 వేలు, ప్రమాదవశాత్తు గాయపడి, పని చేయలేని స్థితిలో ఉన్న కార్మికులకు గరిష్ఠంగా నెలకు రూ. 4,500 వరకు ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. అసంఘటిత కార్మికులకు సైతం ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో భవన నిర్మాణ కార్మికులు అధికంగా ఉన్నారని, వీరికి తాను ప్రభుత్వ పరంగా సౌకర్యాలు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్మికుల పిల్లల చదువులు, ఉద్యోగాల విషయంలో తనను సంప్రదించాలని సూచించారు.

జోన్-4
(ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)
చైతన్యరథం

# తిరుగులేని శక్తిగా తెలుగుదేశం పార్టీ



## శ్రేణులకు టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతల పిలుపు

బాపట్ల, (చైతన్యరథం): బాపట్లలో నిర్వహించిన పార్లమెంటరీ విస్తృతస్థాయి సమావేశంలో చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమారు, ఎమ్మెల్సీ, చీఫ్ విప్ పంచుమర్తి అనూరాధ, జిల్లా ఎమ్మెల్యేలు నరేంద్ర వర్మ, ఆనంద్ బాబు, విజయ్ కుమార్, తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు ముఖ్య నాయకులతో కలిసి పాల్గొన్నాను. ఈ సందర్భంగా పరిశీలకులతో కలిసి పార్లమెంట్ కమిటీ, అనుబంధ కమిటీ, సాధికార కమీటల నుంచి ప్రతిపాదనలను స్వీకరించారు. కమిటీల ప్రతిపాదనలను పార్లమెంట్ పరిశీలకులు అధ్యయం చేసి అధిష్టానానికి నివేదిస్తారు. బాపట్ల పార్లమెంటరీ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని తిరుగులేని శక్తిగా మల్చేందుకు కలిసికట్టుగా పని చేయాలని నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.



# అధికారం ఉందని విర్రవీగం

## మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

వేదాయపాళెం, (చైతన్యరథం): నెల్లూరులోని వేదాయపాళెంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వైసీపీ నేతలకు కండువాలు కప్పి టీడీపీలోకి ఆత్మీయ ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ మనుబోలు మండలం వీరంపల్లికి చెందిన ముఖ్య నాయకులు టీడీపీలో చేరడం చాలా సంతోషంగా ఉందన్నారు. వైసీపీ మండల ఉపాధ్యక్షుడు, వీరంపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు తురిమెర్ల రఘురామిరెడ్డి, ఎంపీటీసీ తాటిపర్తి రాఘయ్య, వార్డు సభ్యులు పలగాని శేషరెడ్డితో పాటు 13 మంది ముఖ్య నాయకులు టీడీపీలో చేరారన్నారు. గత ఎన్నికల్లో వీరంపల్లిలో 300కి పైగా ఓట్ల మెజార్టీ వచ్చిందని కొత్తగా వీరి చేరికలతో టీడీపీ మరింత బలోపేతమవుతుందని అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఐదు మండలాల పరిధిలో టీడీపీ ఘనవిజయం సాధించడానికి సంకేతంగా బలోపేతమవుతోందన్నారు. తాము అధికారంలో ఉన్న సమయంలో చీమకు సైతం అన్యాయం జరగనివ్వమన్నారు. చేతనైతే సాయం చేస్తామని, లేదంటే సర్దిచెబుతామని అన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అనేక అరాచకాలు జరిగాయని, అమాయకులు ఆస్తులు కోల్పోయారని గుర్తు చేశారు. పూల తోటలు ఎండబెట్టుకున్నారన్నారని, భూములు బీడు పెట్టుకున్నారన్నారు. రొయ్యల గుంతలు తెగ్గొట్టడంతో కోట్ల రూపాయలు నష్టపోయిన వారు కూడా ఉన్నారన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక అన్యాయాలు, అక్రమాలకు చరమగీతం పాడడంతో వ్యవస్థలన్నీ గాడిలో పడుతున్నాయన్నారు. రీసర్వే పేరుతో భూముల రికార్డులను ఇష్టారాజ్యంగా మార్చేశారన్నారు. ప్రధానంగా టీడీపీ సానుభూతి పరులను లక్ష్యంగా చేసుకుని వైసీపీ నేతలు రికార్డుల్లో పేర్లను తొలగించడం, విస్తీర్ణం తగ్గించడం, నిషేధిత భూముల జాబితాలో చేర్చడం వంటి పిచ్చి చేష్టలకు పాల్పడ్డారన్నారు. ఆ లోపాలన్ని సరిదిద్దేందుకే చాలా సమయం పడుతోందన్నారు. వెంకటాచలం మండలం కాకుటూరులో ఎకరా రూ.2.50 కోట్ల విలువ చేసే 15 ఎకరాల భూముల రికార్డులతో గుడ్లూరు తహసీల్దార్ కార్యాలయంలో కూర్చుని మార్చేశారన్నారు. రామదాసుకండ్రిగలో 57 ఎకరాలు, మరుపూరులో 57 ఎకరాలు, సూరాయపాళెంలో 36 ఎకరాలను, కొమ్మలపూడిలో 19.20 ఎకరాలు, సర్వేపల్లిలో 6.30 ఎకరాలు, వావిలేటిపాడులో 4.20 ఎకరాలు కాజేశారని ఆరోపించారు. ఇప్పుడు టీడీపీ అధికారంలో ఉందని వైసీపీ నాయకుల భూములు లాక్కుని మా పార్టీ వాళ్లకు ఇస్తామా అని ప్రశ్నించారు. ఎవరైనా పొరపాట్లు చేసే ప్రయత్నం చేసినా సరికాదని మందలిస్తాం గానీ కానీ ప్రోత్సహించే ప్రసక్తి లేదన్నారు. పార్టీలో చేరిన వారిలో మన్నారపు రఘురామయ్య, పొట్టేళ్ల ప్రసాద్, మోడిబోయిన వెంకట్రామయ్య, పలగాని శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో వీరంపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు, వైసీపీ మండల ఉపాధ్యక్షుడు తురిమెర్ల రఘురామిరెడ్డి, ప్రస్తుత ఎంపీటీసీ సభ్యులు తాటిపర్తి రాఘయ్య, వార్డు సభ్యుడు పలగాని శేషరెడ్డి, ముఖ్య నాయకులు తురిమెర్ల మస్తాన్ రెడ్డి, నరసింహారెడ్డి, సుధాకర్ రెడ్డి, లక్ష్మి నరసారెడ్డి, దగ్గవోలు రామచంద్రారెడ్డి, పలగాని పుష్యంత్ రెడ్డి, పంట మనోహర్ రెడ్డి, జెట్టి ఆదినారాయణ రెడ్డి, సునీల్ రెడ్డి, యద్దలపూడి సుబ్రహ్మణ్యం ఉన్నారు.

# నిష్పక్షపాతంగా నిత్యావసర సరుకుల పంపిణీ




## చంద్రగిరి శాసన సభ్యుడు పులివర్తి నాని వెల్లడి

చంద్రగిరి, (చైతన్యరథం): చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం పాకాల పంచాయతీ గుట్టకిందఇండ్లులో కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ పాకాల మండలంలోని 41 రేషన్ షాపులకు 15693 స్మార్ట్ కార్డులను పంపిణీ చేశామన్నారు. ఈ స్మార్ట్ కార్డును స్కాన్ చేస్తే కార్డుదారునికి ఎన్ని కేజీలు బియ్యం, కుటుంబ సభ్యులు వివరాలు చూపిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా పంపిణీ వ్యవస్థలో మార్పులను తీసుకువచ్చారన్నారు. గడిచిన 5 సంవత్సరాలలో కార్డుదారులు రేషన్ తీసుకోవాలంటే వాహనం ఒక చోట పెడితే అక్కడికి వెళ్లి తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. గతంలో కార్డుదారులకు 1వ తేదీ నుండి 15 తేదీ వరకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని, కానీ 3,4 రోజులలో పూర్తిగా నిత్యవసర సరుకులు పంపిణీ చేసి సరిపెట్టేశారన్నారు. కొంత మంది కార్డుదారులకు ఎండియు వాహనం అందుబాటులో లేక నిత్యవసర సరుకులు తీసుకోలేని పరిస్థితి దాపురించిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ఎండియు వాహనాల ద్వారా పేదలకు పంపిణీ చేస్తున్న బియ్యంను అక్రమ రవాణా చేసి మిల్లర్లకు దోచిపెట్టిన వైనాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. దాన్ని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, పౌరసరపాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రజా పంపిణీ వ్యవస్థలో మార్పులతో పాటు పాత పద్ధతిని అమలు చేయాలని రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులకు దిశా నిర్దేశం చేశారన్నారు. నూతన విధానంలో రాజ ముద్రతో కూడిన నూతన క్యూఆర్ కోడ్ ద్వారా రేషన్ కార్డులను తిరుపతి జిల్లా వ్యాప్తంగా సుమారు 5 లక్షల 80 వేల 120 రేషన్ కార్డులను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం పంపిణీ జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, రేషన్ డీలర్లు, కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# కృష్ణా జలాల రాకతో కుప్పం ప్రజల కల సాకారం

## ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టుదల, యువమంత్రి లోకేష్‌కు ఉమ్మడి చిత్తూరు ప్రజల నీరాజనాలు : పాతర్ల రమేశ్ వెల్లడి



అమరావతి, (చైతన్యరథం): ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసుల దశాబ్దాల నాటి కల సాకారమయిందని హంద్రీ నీవా ప్రాజెక్టు ద్వారా కుప్పం నుంచి కాలువకు కృష్ణానది జలాలు కుప్పం నియోజకవర్గం లోకి అడుగుపెడుతున్నాయని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ తెలిపారు అమరావతిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నలుగురు మంత్రుల వల్ల కానీ పనిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పూర్తి చేశారన్నారు. 1987లో అన్న ఎన్టీఆర్ హంద్రీనీవా ప్రాజెక్టుకు శ్రీకారం చుడితే నేడు చంద్రబాబు నాయుడు హయాంలో పూర్తయిందని ఆయన తెలిపారు భగీరథుడిలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 14 నెలల కాలంలోనే హంద్రీ నీవా కాలువను ఆధునీకరించి 730 కిలోమీటర్లు దూరంలో రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో కృష్ణా జలాలను పారించి రైతాంగానికి సాగునీరు అందించి భరోసా కల్పించారన్నారు. 2023 జనవరిలో నిర్వహించిన యువగళం పాదయాత్రలో నారా లోకేష్ కుప్పం ప్రజలకు హామీ ఇచ్చి మాటను నిలుపుకున్నారని ఆయన తెలిపారు సుమారు ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే హంద్రీనీవా పనులు పూర్తి చేసి రాయలసీమ చరిత్రలో పోతుందన్నారు. జూలై 17 న మల్యాల పంపింగ్ స్టేషన్ వద్ద నుంచి హంద్రీనీవాకు ముఖ్యమంత్రి చంద్రబాబు నీటిని విడుదల చేశారని సరిగ్గా నలభై రోజుల్లో కుప్పంకు సాగునీరు అందించి అక్కడ పరమ సముద్రం వద్ద జల హారతి ఇవ్వనున్నారని ఆయన తెలిపారు. వరదలు వస్తే శ్రీశైలం గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయడమే తప్ప సీమ ప్రజలకు సాగునీరు అందించాలని గత ఐదేళ్ల పాలనలో జగన్ రెడ్డి ఆలోచన లేదని ఆయన విమర్శించారు. కరువు తాండవించే ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించలేక రాయలసీమ ద్రోహిగా జగన్ రెడ్డి చరిత్రలో నిలిచిపోయారైన ఆయన తీవ్రంగా విమర్శించారు ఫేజ్ వన్ కాలువ విస్తరణలో కాలువ సామర్థం 2.200 క్యూసెక్కుల నుంచి 3.850 క్యూసెక్కులకు పెరిగిందని దీనితో 16 వేల క్యూసెక్కుల అదనపు నీరు రాయలసీమ ప్రాంతానికి అందుతుందని ఆయన తెలిపారు.

# మహిళా సాధికారత స్త్రీశక్తితో సాకారం

## కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

కోవూరు, (చైతన్యరథం): మహిళా సాధికారత స్త్రీశక్తితో సాకారమయిందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్గొన్నారు. స్థానిక తాసిల్దారు కార్యాలయ ఆవరణలో దాదాపు 5వేల మంది మహిళల సమక్షంలో సోమవారం జరిగిన స్త్రీ శక్తి విజయోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి దంపతులు హాజరుకాగా మహిళలు వారికి అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. అనంతరం వేదిక వద్దకు చేరుకున్న వేమిరెడ్డి దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీఎం చంద్రబాబు పాలనలో జరిగిన లబ్ధిని వివరిస్తూ మహిళలు ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి పలువురు మహిళలతో ముచ్చటించి ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు.



# కష్టపడే వారికి కూటమిలో గుర్తింపు ఖాయం

## దర్శి టీడీపీ ఇన్చార్జి గొట్టిపాటి లక్ష్మి వెల్లడి

ఒంగోలు, (చైతన్యరథం): కష్ట పడేవారికి కూటమి ప్రభుత్వంలో తగిన గుర్తిపు లభిస్తుందని దర్శి టీడీపీ ఇన్చార్జి గొట్టిపాటి పేర్కొన్నారు. ఒంగోలులో సోమవారం జనసేన జిల్లా పార్టీ అధ్యక్షుడు, షేక్ రియాజ్ ఒంగోలు డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయడం కూటమి ప్రభుత్వంలో శుభ పరిణామమని దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ లక్ష్మి తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనకు ఎదురొడ్డి పోరాడిన రియాజ్ లాంటి వారికి కూటమిలో తగిన గుర్తింపు లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో



ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు, మాగుంట శ్రీనివాస రెడ్డి, ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్, కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత జిల్లాలోని ప్రముఖ నాయకులు పాల్గొన్నారు.



# తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే శ్రీరామరక్ష

## హిందూపురం పార్లమెంటరీ పార్టీ విస్తృత సమావేశంలో మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల పిలుపు

పుట్టపర్తి, (చైతన్యరథం): పుట్టపర్తి టీడీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు అంజనప్ప అధ్యక్షతన సోమవారం హిందూపురం పార్లమెంటు విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి టీడీపీ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు రాష్ట్ర హిందూపురం పార్లమెంట్ కమిటీ సభ్యులుగా రాష్ట్ర మంత్రి టీజీ భరత్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కమిటీ సభ్యులుగా అగ్రిమిషన్ రాష్ట్ర వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సత్యసాయి జిల్లా నుంచి పార్టీ అధ్యక్షుడు అంజనప్ప, సత్యసాయిజిల్లా ఎమ్మెల్యేలు రాష్ట్రమంత్రి సవిత, ఎంపీ పార్థసారథి ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, పరిటాల సునీత, ఎమ్మెస్ రాజు, కందికుంట వెంకటప్రసాద్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, ధర్మవరం నియోజకవర్గ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్, ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి డీసీఎంఎస్ చైర్మన్ వెంకటేష్‌తో పాటు టీడీపీ అనుబంధ సంఘాల నాయకులు పార్టీ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు టీజీ భరత్ మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే శ్రీరామ రక్ష అన్నారు. వైసీపీ పాలనలో అనేక క్రమ కేసులు బనాయించినప్పటికీ వాటన్నింటిని తట్టుకొని 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకొచ్చిన కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ జెండా రెపరెపలాడేలా కార్యకర్తలు సైనికుల్లా విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.



# సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటుకు కృషి

## ఈడిగ సంఘం నాయకులకు మంత్రి సవిత హామీ

పెనుకొండ, (చైతన్యరథం): బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, స్వాతంత్ర్య సమరయోధుడు, గీత కులాల ముద్దు బిడ్డ సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని అధికారికంగా ప్రకటించినందుకు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహ ఏర్పాటు చేయాలని నియోజకవర్గం ఈడిగ (గౌడ) కులస్తులు మంత్రి సవితకు వినతి పత్రం అందించారు. అనంతరం మంత్రిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఈడిగ గౌడ నాయకులు మాట్లాడుతూ సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించేందుకు జీవో తీసుకువచ్చేందుకు కృషిచేసిన మంత్రి సవితకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. సర్దార్ గౌతు లచ్చన్న పోరాటయోధుడు, గొప్ప సంఘసంస్కర్త అన్నారు. ఆయన 1952లో సోంపేట నియోజక వర్గం నుండి శాసన సభ్యులుగా గెలుపొంది మద్రాసు రాష్ట్ర శాసన సభలో అడుగుపెట్టారని తెలిపారు. టంగుటూరు ప్రకాశం పంతులు, బెజవాడ గోపాలరెడ్డి మంత్రివర్గంలో మంత్రిగా పనిచేసి మంచి గుర్తింపు పొందారన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి వెలలేని సేవలు అందించిన గీతకులాల సర్దార్ గౌతు లచ్చన్నని ప్రభుత్వ గుర్తించినందుకు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పెనుకొండ నియోజకవర్గ కేంద్రంలో సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటుచేసేందుకు స్థలాన్ని పరిశీలించాలని విగ్రహం తప్పకుండా ఏర్పాటు చేస్తామని మంత్రి సవిత హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చిన్నప్పయ్య గోరంట్ల ఈడిగ సంఘం నాయకులు గిరిధర్ గౌడ్ సోమందేపల్లి ఈడిగ సంఘం నాయకులు నరేంద్రబాబు గౌడ్, భార్గవ్ గౌడ్, హరీష్ గౌడ్, పవన్ గౌడ్, ప్రకాష్ గౌడ్ బాబు గౌడ్, నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలే టీడీపీకి కొండంత బలం




## పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి వెల్లడి

పుట్టపర్తి, (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే కొండంత అండ అని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. సోమవారం హిందూ పురం పార్లమెంటరీ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీకి కార్యకర్తలు ప్రతి ఎన్నికల్లో అండగా ఉన్నారని అందుకు ప్రతి కార్యకర్తకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై అనేక అక్రమ కేసులు పెట్టి, వేధించినప్పటికీ వాటికి ఏమాత్రం భయపడకుండా టీడీపీ విజయమే ధ్యేయంగా 2024 సార్వత్రిక ఎన్నికల్లో విజయం కోసం పని చేశారని తెలిపారు. పార్టీకి పనిచేసిన ప్రతి కార్యకర్తలను పార్టీ అధిష్ఠానం గుర్తించి అలాంటివారికి ప్రభుత్వంలో పెద్దపీట వేసిందని తెలిపారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముకగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. కార్యకర్తల త్యాగాలు మరువలేమని కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు కార్యకర్తల సంక్షేమం కోసం తెలుగుదేశం పార్టీ పెద్దపీట వేస్తుందని తెలిపారు. జిల్లా కమిటీలో ఎంతో పారదర్శకంగా అన్ని కులాలకు ప్రాధాన్యత కల్పించేలా పార్టీ అధిష్ఠానం రాష్ట్ర కమిటీ వేసి జిల్లా టీడీపీ అధ్యక్షునితో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులను ఎంపిక చేస్తోందని తెలిపారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేపట్టిందని తెలిపారు. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో యూకే గోల్డ్ ఎడిషన్లో చోటు సంపాదించినందుకు ఎమ్మెల్యే బాలకృష్ణకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ప్రజా ప్రతినిధులు మండల కన్వీనర్లు జిల్లా కార్యవర్గ సభ్యులు, బూత్ కమిటీ యూనిట్ ఇన్చార్జిలు, క్లస్టర్ ఇంచార్జిలు, కార్యవర్గ సభ్యులు పార్టీ అనుబంధ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# టీడీపీ బలోపేతానికి కృషి

## మడకశిర ఎమ్మెల్యే రాజు పిలుపు

పుట్టపర్తి : తెలుగుదేశంపార్టీని జిల్లాలో బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త పనిచేయాల్సిన అవసరం ఉందని మడకశిర శాసనసభ్యుడు టీడీపీ పాలకమండలి సభ్యుడు రాజు అన్నారు. పుట్టపర్తిలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన హిందూపురం పార్లమెంటు విస్తృతస్థాయి కమిటీ సమావేశం, జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. జిల్లాలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతోందన్నారు. వైసీపీ తోడేళ్ల గుంపు వీటిని తట్టుకోలేక ప్రజలను ప్రక్కదారి పట్టించేలా దుష్ప్రచారాలు చేస్తున్నాయనాన్నారు. ప్రజలు వైసీపీని నమ్మే పరిస్థితి లేదు. కానీ టీడీపీ కూటమి పార్టీలు కూడా ప్రజలకు కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి ఏంటి అనే విషయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు. క్షేత్రస్థాయిలో కూటమి నాయకులు, కార్యకర్తలు అనునిత్యం ప్రజలతో మమేకమై ఉండాలన్నారు.

# పార్టీ కోసం కష్టపడ్డ వారికి ప్రాధాన్యం కల్పించాలి

## హిందూపురం పార్లమెంట్ సమావేశంలో పరిటాల సునీత, శ్రీరామ్ సూచన

పుట్టపర్తి, (చైతన్యరథం): ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో పార్టీ కోసం నిలబడ్డ వారికి పదవులు ఇవ్వాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ సూచించారు. శ్రీ సత్యసాయి జిల్లా మామిళ్లకుంట సమీపంలోని టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో హిందూపురం పార్లమెంటు విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్లమెంట్ పార్టీ కమిటీల ఏర్పాటు కోసం నియమించిన త్రి సభ్య కమిటీ సభ్యులు టీ.జీ.భరత్, దేవినేని ఉమా మహేశ్వర రావు, మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన సునీత, శ్రీరామ్ త్రి సభ్య కమిటీకి పలు అంశాల పై విజ్ఞప్తి చేశారు. గత ఐదేళ్లలో వైసీపీని ఎదుర్కొని నిలబడటానికి చాలా మంది నాయకులు కష్టపడ్డారన్నారు. కొందరు ఆర్థికంగా దెబ్బతింటే.. మరికొందరు కేసులు ఎదుర్కొన్నారన్నారు. నేటికీ ఆ కేసులు నడుస్తున్నాయన్నారు. చివరకు అధినేత చంద్రబాబును అరెస్ట్ చేసిన సమయంలో మహిళలపై కూడా కేసులు నమోదు చేశారన్నారు. ఇలా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నా.. నామినేటెడ్ పదవులు అందరికీ ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. ఇలాంటి సమయంలో పార్టీ పదవుల విషయంలో తగిన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పార్లమెంట్ అధ్యక్షుని వద్ద నుంచి కింది స్థాయి వరకు పార్టీ కోసం కష్టపడ్డ వారికే పదవులు దక్కాలన్నారు. అలాగే రాష్ట్ర కమిటీలో కూడా స్థానం కల్పించాలని త్రిసభ్య కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. అలాంటి వారికి తమ వైపు నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని సునీత, శ్రీరామ్ స్పష్టం చేశారు.



# పరిమళించిన మానవత్వం

## - వరదలపై పాక్‌ను అప్రమత్తం చేసిన భారత్



భారత్-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతోన్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. వరదలపై దాయాదిని న్యూఢిల్లీ అలర్ట్ చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు కొన్ని మీడియా కథనాలను ఉటంకిస్తూ పీటీఐ కథనం వెల్లడించింది. ఇరు దేశాల మధ్య సింధూ నదీ జలాల ఒప్పందం అమలు నిలిచిపోయినప్పటికీ.. వరదలపై పాక్ ను భారత్ అప్రమత్తం చేసి మానవత్వాన్ని చాటుకుంది. భారీ వర్షాల కారణంగా జమ్మూకశ్మీర్‌లోని తావి నది ఉప్పొంగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనా వేసింది. అదే జరిగితే పాకిస్థాన్లో వరదలు సంభవించే ముప్పు ఉంది. దీంతో ఇస్లామాబాద్ లోని భారత హైకమిషన్ పాక్ అధికారులకు దీనిపై సమాచారం ఇచ్చినట్లు ఆ దేశంలోని జియో న్యూస్, ది న్యూస్ ఇంటర్నేషనల్ వంటి మీడియాల్లో కథనాలు వచ్చాయి. అంతకుముందు ఇలాంటి సమాచారాన్ని సింధూ నదీ జలాల ఒప్పంద కమిషనర్ పంచుకునేవారు. ఇప్పుడు దౌత్య కార్యాలయం పాక్‌ను అప్రమత్తం చేసినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. భారత్ అందించిన సమాచారంతో పాక్ యంత్రాంగం తమ ప్రజలకు హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపాయి. అయితే, దీనిపై భారత్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్లోని పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనతో దాయాదిపై తీవ్రంగా మండిపడిన భారత్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. 1960 నుంచి ఇరు దేశాల మధ్య అమల్లో ఉన్న సింధూ నదీ జలాల ఒప్పందాన్ని నిలిపివేసింది. ఇదిలా ఉండగా.. పాకిస్థాన్లో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరదలు సంభవించాయి. జూన్ 26 నుంచి ఇప్పటివరకు 780 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, మరో వెయ్యి మందికి పైగా గాయపడ్డారు.

# జైలు నుంచి ప్రభుత్వాలను నడిపే పరిస్థితి రాకూడదు

## అలాంటి సాంప్రదాయానికి మేం వ్యతిరేకం : అమిత్ షా



ముఖ్యమంత్రి అయినా... ప్రధానమంత్రి అయినా జైలు నుంచే పరిపాలన చేయడం మంచి విషయమేనా? అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశ్నించారు. మన ప్రజాస్వామ్యానికి అది మర్యాదపూర్వకంగా ఉంటుందా? అంటూ విపక్షాలపై మండిపడ్డారు. ప్రముఖ జాతీయ మీడియా సంస్థ 'ఏఎన్ఐ' అమిత్ షా ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా 100వ రాజ్యాంగ సవరణ బిల్లు సహా పలు అంశాలపై ఆయన మాట్లాడారు. మాజీ ఉప రాష్ట్రపతి ధన్‌కడ్ రాజీనామా అంశంపైనా స్పందించారు. "విపక్షాలు ఇప్పటికీ కూడా జైలుకు వెళ్తే సులభంగా ప్రభుత్వాలు ఏర్పాటుచేయగలమని అనుకుంటున్నారు. వారు జైలునే సీఎం, పీఎం అధికారిక నివాసాలుగా మార్చేస్తారు. అప్పుడు డీజీపీ, చీఫ్ సెక్రటరీ, కేబినెట్ సెక్రటరీ వంటి ఉన్నతాధికారులు జైలు నుంచే ఆదేశాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇలాంటి సిద్ధాంతాలను నేను, మా పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. జైలు నుంచే ప్రభుత్వాలను నడిపే పరిస్థితి మన దేశంలో రాకూడదు" అని అమిత్ షా అన్నారు.

"ప్రధాని గానీ, ముఖ్యమంత్రి గానీ లేదా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్న ఏ నేత అయినా సరే.. ఏదైనా కేసులో అరెస్టయితే 30 రోజుల్లో బెయిల్ పొందాలి. లేదంటే తమ తమ పదవులకు రాజీనామా చేయాలి. అలా చేయకపోతే.. చట్టమే వారిని తప్పించేలా 130వ రాజ్యాంగ సవరణను తీసుకొస్తున్నాం. చట్టమేదైనా ప్రభుత్వం, ప్రతిపక్షానికి ఒకేలా అమలవుతుంది. ఈ నిబంధన ప్రధాని పదవికి కూడా వర్తించేలా స్వయంగా నరేంద్రమోదీనే దీన్ని సవరణలో చేర్చారు. ఆయనకు కూడా ఇది వర్తిస్తుంది. ప్రధాని జైలుకెళ్తే ఆయనైనా రాజీనామా చేయాల్సిందే. ఎన్నికైన ప్రభుత్వం రాజ్యాంగ సవరణను తీసుకొస్తే దానిపై అభ్యంతరాలు లేవనెత్తే హక్కు అందరికీ ఉంటుంది. అంతేగానీ, పార్ల మెంట్‌లో ప్రవేశపెట్టేందుకు కూడా అవకాశం లేకుండా ఆందోళనలు చేస్తే ఎలా?" అని ప్రతిపక్షాలపై హోం మంత్రి మండిపడ్డారు. ఈ బిల్లు కచ్చితంగా పార్లమెంట్ ఆమోదం పొందుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

**నైతికత గురించి నాకు చెప్పొద్దు..**

130వ రాజ్యాంగ సవరణ బిల్లుపై విపక్షాల ఆరోపణలను అమిత్ షా తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా 2013 నాటి ఉదంతాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై ధ్వజమెత్తారు. "రాజ్యాంగ సవరణ బిల్లులో నైతికత లేదని విపక్షాలు అంటున్నాయి. నాడు లాలూ యాదవ్‌ను కాపాడేందుకు అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ పత్రాలను రాహుల్ గాంధీ చింపేశారు. ఆ రోజే ఆయన నైతికతతో వ్యవహరిస్తే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదు. రాజ్యాంగ సవరణపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తోంది. వరుస వైఫల్యాలతో ఆలోచనావిధానం మందగించి ఉంటుంది" అని కేంద్రమంత్రి ఎద్దేవా చేశారు.

**ధన్ ఖడ్ రాజీనామా అంశాన్ని ఎక్కువగా లాగొద్దు**

ఈ సందర్భంగా మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధనఖడ్ రాజీనామా అంశాన్నీ ఆయన ప్రస్తావించారు. "ధన రాజ్యాంగ పదవిలో కొనసాగారు. ఆయన పదవీకాలంలో ఎన్నో మంచి పనులు చేశారు. వ్యక్తిగత అనారోగ్య సమస్యల కారణంగా ఇప్పుడు రాజీనామా చేశారు. ఈ విషయాన్ని మరీ ఎక్కువగా లాగొద్దు. కేవలం ప్రతిపక్షాల ఆరోపణల ఆధారంగా దీనిపై ఓ అంచనాకు రావడం. సరికాదు' అని అమిత్ షా స్పష్టం చేశారు.

# రేఖా గుప్తాను కత్తితో పొడవాలని ప్లాన్ చేశా

## ఢిల్లీ సీఎంపై దాడి కేసులో నిందితుడు వెల్లడి

దేశ రాజధాని ఢిల్లీలో ముఖ్యమంత్రి రేఖా గుప్తాపై దాడి జరగడం ఇటీవల తీవ్ర చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో నిందితుడు సకారియా రాజేశ్ భాయ్ ఖిల్జీభాయ్(41)ను పోలీసులు అరెస్టు చేశారు. అతడిని విచారించగా.. పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. సీఎం (Delhi CM Rekha Gupu)ను కత్తితో పొడవాలని నిందితుడు ప్లాన్ చేసుకున్నట్లు సమాచారం. అయితే భారీ భద్రత కారణంగా తన ప్రణాళికను విరమించుకున్నట్లు సకారియా చెప్పినట్లు తెలుస్తోంది.

"ఢిల్లీలో వీధి కుక్కలను తరలించాలని నేను చాలాసార్లు అభ్యర్థించా. దీని గురించి సీఎం పట్టించుకోకపోవడంతోనే ఆమెపై డ్రాడి చేయాలని నిర్ణయించుకున్నా. సీఎం అధికారిక నివాసానికి వెళ్లడానికి ముందు సుప్రీంకోర్టుకు వెళ్లా, న్యాయస్థానం బయట సెక్యూరిటీని చూసి అక్కడి నుంచి వచ్చేశా. అనంతరం సివిల్ లైన్‌లో ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లి, తొలుత ఆమెను కత్తితో పొడవాలని ప్లాన్ చేశా, కానీ, భద్రత ఎక్కువగా ఉంచటం చూసి కత్తిని బయటే పడేశా" అని నిందితుడు సకారియా విచారణలో చెప్పినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.ఈ నెల 20న సివిల్ లైన్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో రేఖా గుప్తా "జన్ సున్వాయ్" కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఫిర్యాదుదారు ముసుగులో వచ్చిన దుండగుడు పత్రాలను అందిస్తూ.. సీఎంపై ఒక్కసారిగా దాడికి తెగబడ్డాడు. పెద్దగా కేకలు వేస్తూ.. చెంపదెబ్బ కొట్టాడు. ఆమెను వెనక్కి తోసేయడానికి ప్రయత్నించాడు. ఆమె జుట్టును గట్టిగా పట్టుకున్నాడు. తక్షణమే భద్రతా సిబ్బంది జోక్యం చేసుకొని అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ అనూహ్య ఘటనలో ముఖ్యమంత్రి తల, భుజం, చేతులకు గాయాలయ్యాయి.





**మరో నిందితుడి అరెస్ట్..**

ఇక, ఈ ఘటనలో మరో నిందితుడు తహసీన్ సయ్యద్‌ను ఢిల్లీ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. ఇతడు ప్రధాన నిందితుడు సకారియాకు స్నేహితుడిగా గుర్తించారు. దాడి ఘటనలో సకారియాకు సయ్యద్ సాయం చేశాడని, కొంత డబ్బు కూడా పంపించాడని పోలీసులు తెలిపారు. దాడికి ముందు సీఎం నివాసానికి సంబంధించిన వీడియోలను సకారియా తన స్నేహితుడు సయ్యదుకు పంపించినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు.

**రేఖా గుప్తాకు మునుపటి భద్రత...**

కాగా.. దాడి ఘటన కారణంగా ఇటీవల సీఎం రేఖా గుప్తాకు సీఆర్పీఎఫ్ జవాన్లతో జడ్ కేటగిరీ భద్రత కల్పించిన సంగతి తెలిసిందే. తాజా దాన్ని తొలగించారు. మునుపటిలాగే ఢిల్లీ పోలీసులు ఆమెకు భద్రత కల్పిస్తారని అధికారిక వర్గాలు సోమవారం వెల్లడించాయి.

### విచక్షణలేని హాస్యాన్ని ఆపేది లేదా

# కమెడియన్ల తీరుపై సుప్రీం ఆగ్రహం



దివ్యాంగుల మనసు నొప్పించే జోకులు వేసే కమెడియన్లపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. స్టాండప్ కామెడీ పేరుతో దివ్యాంగులను లక్ష్యంగా చేసుకోవడం తగదని ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇలాంటి వైఖరి ఎప్పుడు ఆగుతుందని వ్యాఖ్యానించింది. ఇలాంటి షోల్లో పాల్గొని అనుచిత వ్యాఖ్యలు చేసినవారు తమ సామాజిక మాధ్యమాల్లో కూడా క్షమాపణలు చెప్పాలని ఆదేశించింది. సమయ్ రైనా, విపున్ గోయల్ తదితర కమెడియన్లు దివ్యాంగుల మనసు బాధించేలా జోకులు వేశారని ఎస్ఎంఏ క్యూర్ ఫౌండేషన్ సుప్రీంలో వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరిగింది. 'ఇండియాస్ గాట్ లాటెంట్' షోలో యూట్యూబర్ రణ్‌వీర్ అల్హాబాదియా చేసిన వ్యాఖ్యలపై దాఖలైన పిటిషన్లతో పాటు దీనిని విచారించింది. ఈ వ్యాఖ్యలకు బాధ్యులైనవారు క్షమాపణలు చెప్పారని ఫౌండేషన్ తరఫు న్యాయవాది అత్యున్నత న్యాయస్థానికి వెల్లడించారు. ఈ సందర్భంగా రైనా దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్‌పై సుప్రీం స్పందించింది. "రైనా తనను తాను అమాయకుడిగా చిత్రీకరించుకొని, తర్వాత క్షమాపణలు చెప్పారు. ఈ ఒక్క కేసుకే పరిమితం కాకుండా, భవిష్యత్తు సవాళ్లను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం నిబంధనలు రూపొందించాలి. మన జీవితంలో హాస్యం ఒక భాగం. ఇతరులను ఎగతాళి చేయడం ప్రారంభించినప్పుడు, సున్నితత్వాన్ని కోల్పోతుంటారు. భారత్ ఎన్నో జాతుల సమూహం. ఇప్పుడు ఎంతోమంది ఇన్‌ఫ్లూయేన్సర్లు ఉన్నారు. వారు తమ వ్యాపారకోణంలో వ్యాఖ్యలు చేస్తున్నప్పుడు, ఇతరుల మనోభావాలను దెబ్బతీయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. హక్కులు, విధులకు మధ్య సమతుల్యం ఉండాలి" అని కోర్టు వ్యాఖ్యానించింది. "మేం బేషరతుగా క్షమాపణలు చెప్పాం. గత ఆదేశాలకు అనుగుణంగా ప్రతివాదులంతా హాజరయ్యారు" అని రైనా తరఫు న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. "ఈ రోజు దివ్యాంగులు. తర్వాత మహిళలు, వృద్ధులు, చిన్నారులు కావొచ్చు. ఇదంతా ఎక్కడ ఆగుతుందని, సుప్రీం ధర్మాసనం అసహనం వ్యక్తంచేసింది. ఇలాంటి వ్యవహారశైలిపై జరిమానా విధిస్తామని హెచ్చరించింది. అలాగే వారి యూట్యూబ్ ఛానళ్లలో కూడా క్షమాపణలు తెలియజేయాలని ఆదేశించింది.

# కలకల రేపిన పాక్ డ్రోన్లు

## అప్రమత్తమయిన సరిహద్దు భద్రతాదళాలు



నియంత్రణ రేఖ వెంట పాక్ డ్రోన్లు కలకలం సృష్టించాయి. గగనతలంలో పాక్ డ్రోన్లను గుర్తించిన భారత్ భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. ఆదివారం రాత్రి సరిహద్దు అవతలి నుంచి ఆరు డ్రోన్లు ఎగురుతూ వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఐదు నిమిషాల్లో అవి తిరిగి పాక్ భూభాగంలోకి వెళ్లాయన్నారు. నిఘా కోసం దాయాది దేశం వీటిని ప్రయోగించినట్లు అనుమానం వ్యక్తం చేశారు. డ్రోన్లు ఆయుధాలు, మాదకద్రవ్యాలను జారవిడిచి ఉంటాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని, డ్రోన్ల కదలికను గుర్తించిన అన్ని ప్రాంతాల్లో సోమవారం సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నామని వెల్లడించారు. గత కొన్నేళ్లుగా జమ్మూ కశ్మీర్లోని సరిహద్దు ప్రాంతాల్లో పాకిస్తాన్ డ్రోన్లు పలు ఆయుధాలు, మాదకద్రవ్యాలను జారవిడుస్తుండడం పెద్ద సమస్యగా మారిందని అధికారులు పేర్కొన్నారు. పహల్గాం దాడి అనంతరం భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉగ్రవాదులు చొరబడకుండా ఉండేందుకు సరిహద్దు ప్రాంతాల్లో భారత సైన్యం భద్రతను మరింత కట్టుదిట్టం చేసింది. ఆపరేషన్ సిందూర్ అనంతరం పాక్ చేసే డ్రోన్ దాడులను తిప్పికొట్టేందుకు పటిష్టమైన చర్యల్లో భాగంగా బీఎస్ఎఫ్ అధికారులు సరిహద్దు ప్రాంతాల్లో డ్రోన్ స్క్వాడ్రన్‌ను ఏర్పాటు చేశారు. సరిహద్దు వెంబడి నిఘా ఉంచడంతో పాటు, శత్రు సేనల కదలికల్ని గమనించడం, దాడుల్లో పాల్గొనడం వంటి కార్యకలాపాల్లో వీటిని వినియోగించనున్నారు.

# అమెరికాలో భారత్ లాబీయింగ్

**మరోసంస్థ మెర్క్యూరి పబ్లిక్ అఫైర్స్‌తో ఒప్పందం..వర్కవుట్ అవుతుందా?**





అమెరికాలో భారత రాయబార కార్యాలయం తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్ప టికే ఒక లాబీయింగ్ సంస్థతో ఒప్పందం ఉన్నప్పటికీ, త్వరలో అమల్లోకి రానున్న భారీ సుంకాలను ఎదుర్కొనేందుకు రెండవ సంస్థను కూడా రంగంలోకి దించింది. అమెరికా ప్రభుత్వం భారత ఎగుమతులపై 50% టారిఫ్ విధించబోతోంది. మన దేశం నుంచి అమెరికాకు పంపే కొన్ని ఉత్ప త్తులపై అదనపు పన్నులు వేయనున్నారు. ఇది మన ఎగుమతులకు పెద్ద దెబ్బే. ఇలాంటి పరిస్థితిలో అమెరికాలో భారత్‌కు మద్దతుగా వాదిస్తూ నెగెటివ్ ప్రచారాన్ని ఎదుర్కొంటూ మనకు అనుకూలంగా ఉంటూ లాబీయింగ్ సంస్థలు కీలకంగా పనిచేస్తాయి. ఈ నేపథ్యంలో భారత రాయబార కార్యాలయం తాజాగా మెర్క్యూరి పబ్లిక్ అఫైర్స్ అనే లాబీయింగ్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం, మూర్చరి సంస్థకు నెలకు 75 వేల డాలర్లు (సుమారుగా రూ. 62 లక్షలు) చెల్లించనున్నారు. ఆరు లక్షల డాలర్ల విలువైన ఈ ఒప్పందం ఆగస్ట్ 15 నుంచి మూడునెలల పాటు అమలులో ఉంటుంది. ఈ సంస్థకు చెందిన ప్రముఖులలో డేవిడ్ విటర్ – మాజీ రిపబ్లికన్ సెనేటర్, బ్రయాన్ లాంజా –ట్రంప్ ట్రాన్సిషన్ టీమ్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ (2020), న్యూయార్క్ రాష్ట్రానికి చెందిన మొదటి భారతీయ అమెరికన్ సెనేటర్ కెవిన్ థామస్ ఈ టీంలో ఉన్నారు.

**ట్రంప్ శిబిరానికి సంబంధాలు**

మెర్క్యూరి సంస్థకు ట్రంప్ మద్దతుదారులతో అనేక సంబంధాలు ఉన్నాయి. ఉదాహరణకు ట్రంప్-పంచ్ ప్రచార బృందంలో కమ్యూనికేషన్ డైరెక్టర్‌గా పనిచేసిన బ్రయాన్ లాంజా ఈ సంస్థలో కీలక నేత. కొంత కాలం క్రితం వరకు ట్రంప్ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా ఉన్న సూసీ వైల్స్ కూడా ఇదే సంస్థలో లాబీయిస్ట్‌గా పనిచేశారు.

**ఇదే మొదటిసారి కాదు**

ఇది కొత్త విషయం కాదు. ఇప్పటికే భారత్ ప్రభుత్వం ఎస్‌హెచ్‌డబ్ల్యూ పార్టనర్స్ ఎల్ఎల్‌సీ అనే మరో లాబీయింగ్ సంస్థను ఏప్రిల్ 2025లో నియమించింది. దీని కోసం మనం నెలకు 1,50,000 డాలర్లు (రూ. 1.25 కోట్లు) చెల్లిస్తున్నాం. మొత్తం ఒప్పందం విలువ 1.8 మిలియన్ డాలర్లు (రూ. 15 కోట్లకు పైగా). ఈ సంస్థను జేసన్ మిల్లర్ (మాజీ ట్రంప్ సలహాదారు) నిర్వహిస్తున్నారు. ట్రంప్ మాజీ బాడీగార్డ్ కీత్ షిల్లర్ సంస్థను నియమించుకోవడంతో ఇండియా కాస్త వెనుకబడిందన్న విమర్శలు వచ్చాయి. అందుకే అమెరికాలో మీడియా, డిజిటల్, రాజకీయ వర్గాల్లో సమర్థవంతంగా ప్రచారం చేసేందుకు రెండో సంస్థను దించింది.

# ఎక్కడ తక్కువైతే అక్కడే తీసుకుంటాం

## రష్యాలో భారత్ అంబాసిడర్



రష్యా నుంచి భారత్ క్రూడ్ ఆయిల్ దిగుమతి చేసుకోవటంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభ్యంతరం వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. రష్యాతో ఆయిల్ ఒప్పందాలు రద్దు చేసుకో వాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని కొన్ని నెలల క్రితమే ట్రంప్ హెచ్చరించారు. భారత్, రష్యా నుంచి క్రూడ్ ఆయిల్ కొనటం అంటే.. ఉక్రెయిన్‌పై యుద్ధం చేయడానికి రష్యాకు నిధులు సమకూరుస్తున్నట్లే అని అన్నారు. ట్రంప్ హెచ్చరికలను భారత్ ఏమాత్రం లెక్కచేయలేదు. రష్యా నుంచి క్రూడ్ ఆయిల్‌ను దిగుమతి చేసుకుంటూ ఉంది. దీంతో ట్రంప్ ఆగ్రహానికి గుర య్యారు. ఏకంగా 50 శాతం టారిఫ్ విధించారు. అయినా కూడా భారత్ వెనక్కు తగ్గలేదు. ఈ విషయంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ వారం రోజుల క్రితం మాట్లాడారు. తాము ఎవరి బెదిరింపులకు భయపడేది లేదని తేల్చి చెప్పారు. తమకు భారత ప్రజల ప్రయోజనాలే ముఖ్యమని అన్నారు. ఈ నేపథ్యంలోనే రష్యా తన మిత్ర దేశం భారత్‌కు బంపర్ ఆఫర్ ఇచ్చింది. క్రూడ్ ఆయిల్‌పై ఏకంగా 5 శాతం డిస్కౌంట్ ప్రకటించింది.

**ఎక్కడ తక్కువకు దొరికితే అక్కడే కొంటాం..**

రష్యా నుంచి భారత్ క్రూడ్ ఆయిల్ దిగుమతి చేసుకోవటంపై రష్యాలోని భారత అంబాసిడర్ వినయ్‌కుమార్ స్పందించారు. తాజాగా, రష్యా ప్రభుత్వ మీడియా టాస్ ఏజెన్సీకి ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'దేశంలోని ఆయిల్ కంపెనీలు ఆయిల్ ఎక్కడ తక్కువకు దొరికితే అక్కడే కొంటాయి. భారత ప్రభుత్వానికి దేశ ప్రజల ప్రయోజనాలే ముఖ్యం. ప్రజలకు సరిపడా ఆయిల్ అందించడానికి తగిన చర్యలు తీసుకుంటుంది. రష్యాతో పాటు పలు దేశాలకు భారత్ పరస్పర సహకారం అందించటం వల్ల జాతీయ ఆయిల్ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ ఆయిల్ మార్కెట్ నిలకడగా ఉంది. అంతెందుకు.. రష్యాతో అమెరికా కూడా వ్యాపారాలు చేస్తోంది కదా అని అన్నారు. ఎక్కడ తక్కువగా వస్తే అక్కడే తీసుకుంటామని ఆయన తెలిపారు.



## చైనాలో భరతనాట్యం

బీజింగ్: భారతీయ ప్రాచీన కళారూపమైన భరతనాట్యంలో 'అరంగేట్రం' చేయడం ద్వారా చైనా జాతీయురాలైన 17ఏళ్ల జాంగ్ జియాయువాన్ చరిత్ర సృష్టించింది. ఈ మేరకు బీజింగ్‌లో గత శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ప్రముఖ భరతనాట్య కళాకారిణి జిన్ షాన్ షాన్, భారత దౌత్య వేత్తలు, పెద్దఎత్తున హాజరైన స్థానికుల ఎదుట జాంగ్ తన అరంగేట్ర ప్రదర్శన చేసింది. తద్వారా చైనాలోనే శిక్షణ పొంది, ఇక్కడే అరంగేట్రం చేసిన రెండో నర్తకిగా రికార్డు సృష్టించింది. గతేడాది 13 ఏళ్ల లీ ముజీ చైనాలో మొట్ట మొదటిసారిగా భరతనాట్య అరంగేట్రాన్ని ప్రదర్శించిన తొలి విద్యా ర్థినిగా నిలిచింది. జాంగ్ ఐదేళ్ల వయసులోనే భరతనాట్యం నేర్చుకోవడం ప్రారంభించి, 12ఏళ్లు వచ్చేనాటికి తన గురువు జిన్ షాన్ షాన్ నిర్వహించే ప్రత్యేక నృత్య పాఠశాలలో చేరింది. అరంగే ట్రం కోసం రోజుకు 5గంటల చొప్పున కఠిన సాధన చేసింది. ప్రదర్శన తర్వాత భారత దౌత్యవేత్త అభిషేక్ ఆమెను అభినందిస్తూ అత్యంత క్లిష్టమైన భారతీయ నృత్య రూపాన్ని నేర్చుకోవడానికి తను చేసిన కృషిని ప్రశంసించారు.




## గాజాలో ఆగని ఆకలి చావులు

గాజా: నిత్యవసర వస్తువుల సరఫరాపై ఇజ్రాయెల్ ఆంక్షలు విధించిన నేపథ్యంలో గాజాగా ఆకలి చావులు కొనసాగుతున్నాయి. ఆకలి కారణంగా మరణించిన వారి సంఖ్య 290కు చేరుకొంది. వీరిలో 114 మంది పిల్లలు ఉన్నారు. ఈ మేరకు గాజాలోని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించింది. ది గ్లోబల్ హంగర్ మానిటర్, ఇంటిగ్రేటెడ్ ఫుడ్ సెక్యూరిటీ ఫేజ్ క్లాసిఫికేషన్ సైతం గాజాలోని కరువు పరిస్థితులను ఇప్పటికే నిర్ధారించింది. అందులో భాగంగా ఉత్తర గాజా గవర్నరేట్ పరిధిలోని బీట్ హనూన్, జబాలియా తదితర నగరాల్లోని పరిస్థితులు దాదాపుగా అలాగే ఉన్నాయని.. కొన్ని ప్రదేశాల్లో అంతకంటే దారుణంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఉత్తర గాజాలో ఆహార భద్రతపై తగినన్ని వివరాలు తమ వద్ద లేదని పేర్కొంది. కానీ ఈ ప్రాంతానికి అత్యవసరంగా ఆహారాన్ని అందించాల్సిన ఆవశ్యకత మాత్రం ఉందని స్పష్టం చేసింది. ఇక దక్షిణ గాజాలోని రఫా గవర్నరేట్‌పై తాము విశ్లేషణలు చేయలేదని ఈ సంస్థ వివరించింది. అదీకాక ఈ ప్రాంతంలో ఇజ్రాయెల్ విస్తృతమైన సైనిక కార్యకలాపాలు కారణంగా.. విధ్వంసం అధికంగా ఉందని తెలిపింది. ఇక్కడ జనాభా సైతం అంతగా లేదని స్పష్టం చేసింది. ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీ నాటికి గాజా గవర్నరేట్ పరిధిలో నివసిస్తున్న వారిలో 30 శాతం మంది మాత్రమే ఉన్నారని చెప్పింది. వీరంతా ఫేజ్ 5 స్థాయి ఆహార లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించింది. అలాగే ఆ ప్రాంతంలోని వివిధ గవర్నరేట్ల పరిధిలోని ప్రజలు ఫేజ్ 4 అత్యవసర పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లు తెలిపింది. మరోవైపు సెంట్రల్ గాజాలోని డీర్ ఎల్ బాలా, దక్షిణాన ఖాన్ యూనిస్ గవర్నరేట్లకు సెప్టెంబర్ చివరి నాటికి కరువు పరిస్థితులు విస్తరిస్తాయని అంచనా వేసింది. అయితే పరిస్థితులు రోజురోజుకు దిగజారి పోతాయని ఆందోళన వ్యక్తం చేసింది.

## గల్ఫ్‌లో ఐదుగురు తెలంగాణ ప్రవాసీలకు రెండేళ్ల జైలు..దేశ బహిష్కరణ

బహ్రెయిన్: సంస్థ యజమానితో కలిసి ఆహార ప్యాకెట్లపై గడువు ముగింపు తేదీలను మార్చడం ద్వారా మోసాలకు పాల్పడ్డారనే కేసులో ఐదుగురు తెలంగాణ ప్రవాసీలు జైలు పాలయ్యారు. న్యాయస్థానం వీరికి రెండేళ్ల జైలు శిక్ష, దేశ బహిష్కరణ విధించింది. అలాగే, ఇద్దరు అరబ్బు యజమానులు, ఓ భారతీయ మేనేజరు సహా 19 మంది ప్రవాస భారతీయులు కూడా జైలు శిక్ష పడిన వారిలో ఉన్నారు.

# మనిషి మెదడును తినేసిన అమీబా



అమెరికాలోని మిస్సోరికి చెందిన ఓ వ్యక్తి అత్యంత అరుదైన బ్రెయిన్ ఈటింగ్ అమీబా ఇన్ఫెక్షన్ కారణంగా చనిపోయాడు. ఓజార్క్స్ సరస్సులో ఈత కొట్టడం వల్ల బ్రెయిన్ ఈటింగ్ అమీబా అతడి శరీరంలోకి ప్రవేశించినట్లు మిస్సోరి డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్ అండ్ సీనియర్ సర్వీసెస్ భావిస్తోంది. ఆ వ్యక్తి నాల్జేరియా ఫౌలేరీ అనే మైక్రోస్కోపిక్ అమీబా బారిన పడ్డట్టు ఆగస్టు 13వ తేదీన అధికారులు ధ్రువీకరించారు. నాల్జేరియా ఫౌలేరీ అనేది ఏక కణ జీవి. దీన్నే 'మెదడును తినే అమీబా' అంటారు. ఈ అమీబా కారణంగా మనుషుల్లో అమీబిక్ మెనింగోఎన్సెఫాలిటిస్ వస్తుంది. ఇది ఒక అత్యంత అరుదైన బ్రెయిన్ ఇన్ఫెక్షన్. దీన్నే 'మెదడును తినే వ్యాధి' అని కూడా అంటారు. ఓజార్క్స్ సరస్సులో ఈత కొట్టినపుడు నాల్జేరియా ఫౌలేరీ బాధితుడి శరీరంలోకి ప్రవేశించింది. తర్వాత అతడి మెదడును చేరి ప్రాణాలు తీసింది. మిస్సోరి డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్ అండ్ సీనియర్ సర్వీసెస్ చెబుతున్న దాని ప్రకారం.. నాల్జేరియా ఫౌలేరీ ఇన్‌ఫెక్షన్లు చాలా అరుదుగా వస్తూ ఉంటాయి. ఇప్పుడు ఈ కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి.

అమెరికా వ్యాప్తంగా ప్రతీ ఏటా కేవలం 10 కంటే తక్కువ నాల్జేరియా ఫౌలేరీ కేసులు నమోదు అవుతున్నాయి. 1962 నుంచి ఇప్పటివరకు అమెరికా వ్యాప్తంగా 167 కేసులు మాత్రమే రికార్డుల్లో ఉన్నాయి. మిస్సోరీలో గతంలో రెండు కేసులు మాత్రమే నమోదు అయ్యాయి. ఒకటి 1987లో కాగా, మరొకటి 2022లో నమోదైంది. నాల్జేరియా ఫౌలేరీ కారణంగా మనుషులు చనిపోవడానికే ఎక్కువ అవకాశం ఉంది. అమీబా మెదడులోకి ప్రవేశించిన తర్వాత అక్కడి కణజాలాన్ని నాశనం చేస్తుంది. నాల్జేరియా ఫౌలేరీ కలుషితమైన నీళ్ల ద్వారా సోకుతుంది. ఆ అమీబా ముక్కు ద్వారా మెదడులోకి ప్రవేశిస్తుంది. దాదాపు 12 రోజులకు వ్యాధి లక్షణాలు బయటపడతాయి. తలనొప్పి, జ్వరం, వికారం, వాంతులు అవుతాయి. ఇన్‌ఫెక్షన్ పెరిగే కొద్ది దారుణమైన పరిస్థితి ఉంటుంది. ఇన్‌ఫెక్షన్ సోకిన వ్యక్తి కోమాలోకి వెళ్లి చనిపోయే అవకాశం ఉంది.

# డ్రీమ్ 11తో బీసీసీఐ కటీఫ్

ఇప్పటి వరకు భారత జట్టుకు ప్రధాన స్పాన్సరర్‌గా వ్యవహరించిన డ్రీమ్ 11తో ఒప్పందాన్ని బీసీసీఐ రద్దు చేసుకుంది. ఆన్‌లైన్ గేమింగ్ నిషేధం బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందిన నేపథ్యంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. భవిష్యత్తులోనూ ఇలాంటి సంస్థలతో సంబంధాలు కొనసాగించబోమని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా అధికారికంగా వెల్లడించారు. ఇప్పటికే డ్రీమ్ 11 ప్రతినిధులు బీసీసీఐ కార్యాలయానికి వెళ్లి సంప్రదింపులు జరిపారు. కొత్త చట్టం కారణంగా తాము ఈ ఒప్పందాన్ని కొనసాగించలేమని వారు చెప్పినట్లు తెలుస్తోంది. మరికొన్ని రోజుల్లో ఆసియా కప్ ప్రారంభం కానున్న నేపథ్యంలో బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడు డ్రీమ్11 స్థానంలో కొత్త స్పాన్సరర్‌ను వెతకాల్సి ఉంటుంది. అందుకోసం త్వరలోనే టెండర్లు పిలవనున్నట్లు బీసీసీఐ వర్గాల సమాచారం.

మూడేళ్ల కాలానికి 2023లో బీసీసీఐతో డ్రీమ్ 11 రూ.358 కోట్లతో ఈ ఒప్పందం చేసుకుంది. ఇప్పుడు మధ్యలో నిష్క్రమించాల్సి వచ్చింది. అయినప్పటికీ.. ఈ సంస్థపై భారత క్రికెట్ మండలి ఎలాంటి జరిమానా విధించడం లేదట. ఒప్పందం ప్రకారం చట్టపరమైన కారణాలతో మధ్యలో స్పాన్సర్‌షిప్ దిలేసినా.. ఎలాంటి జరిమానా పడకుండా నిబంధన ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలాఉండగా.. పలు ఐపీఎల్ ఫ్రాంచైజీలకూ డ్రీమ్11 స్పాన్సరర్‌గా వ్యవహరిస్తోన్న సంగతి తెలిసిందే. ఆ జట్లు కూడా ఇప్పుడు సంబంధాలు తెంచుకునే అవకాశాలున్నాయి. మరోవైపు, డ్రీమ్ 11 మాతృసంస్థ డ్రీమ్ స్పోర్ట్స్ ఆర్థికసేవల రంగంలోకి అడుగుపెట్టనున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం కొత్త యాప్ 'డ్రీమ్ మనీ'ని అందుబాటులోకి తేనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ యాప్ ప్రయోగాత్మక దశలో ఉంది. గూగుల్ ప్లే స్టోర్ వద్ద లభ్యమవుతున్న సమాచారం ప్రకారం పసిడి కొనుగోలు, ఫిక్స్ డ్ డిపాజిట్ సేవలను డ్రీమ్ మనీ యాప్ అందివ్వనుంది.




**టొయోటా ఆసక్తి**

డ్రీమ్ 11తో ఒప్పందం రద్దు చేసుకోవటంతో ప్రస్తుతానికి భారత క్రికెట్ జట్ల జెర్సీలకు అధికారిక స్పాన్సర్ లేకుండా పోయారు. త్వరలో ప్రారంభం కానున్న ఆసియా కప్‌లో కూడా టీమిండియా జెర్సీ స్పాన్సర్ లేకుండానే బరిలోకి దిగవచ్చు. ఈ లోపు కొత్త జెర్సీ స్పాన్సర్ దొరికితే వారి లోగోతో ఉన్న జెర్సీలతో టీమిండియా ఆటగాళ్లు ఆసియా కప్ బరిలోకి దిగుతారు.

డ్రీమ్11 స్థానంలో టీమిండియా జెర్సీని స్పాన్సర్ చేసేందుకు టొయోటా మోటార్ కార్పొరేషన్ ఆసక్తి చూపుతోంది. టొయోటాతో పాటు ఓ ఫిన్‌టెక్ స్టార్టప్, టాటా గ్రూప్, రిలయన్స్, అదానీ గ్రూప్ వంటి సంస్థలు కూడా బీసీసీఐకి తమ ఆసక్తిని తెలిపాయని సమాచారం.

### యూఎస్ ఓపెన్ తొలిరౌండ్‌లోనే ఇంటికి..

## రెచ్చిపోయి రాకెట్ విరగ్గొట్టిన మెద్వదేవ్



యూఎస్ ఓపెన్‌లో హైడ్రామా చోటు చేసుకుంది. ఈ టోర్నీ ఫస్ట్ రౌండ్‌లోనే మాజీ చాంపియన్ డానియల్ మెద్వదేవ్ ఓటమిని ఎదుర్కొన్నాడు. మెద్వదేవ్‌పై ఫ్రెంచ్ ఆటగాడు బెంజిమన్ బాంజీ విజయం సాధించాడు. ఈ మ్యాచ్ సమయంలో ఓ నాటకీయ పరిణామం చోటుచేసుకుంది. మూడో సెట్‌లో మెద్వదేవ్ ఓడపోతున్న సమయంలో ఓ ఫోటోగ్రాఫర్ గ్రౌండ్‌లోకి వచ్చాడు. ఆ సమయంలో మెద్వదేవ్ కాస్త శ్రుతి మించి ప్రవర్తించాడు.

మ్యాచ్ జరుగుతున్న సమయంలో ఫొటోగ్రాఫర్ అడ్డురావడంతో చైర్ అంపైర్ మరోసారి బాంజీకి ఫస్ట్ సర్వ్ చేసే అవకాశం ఇచ్చాడు. అప్పటికి 3-6, 5-7, 4-5 స్కోరుతో బాంజీ విన్నింగ్ పాయింట్ కోసం ఎదురుచూస్తున్నాడు. ఆ సమయంలో మెద్వదేవ్ హంగామా చేశాడు. ప్రత్యర్థికి మళ్లీ ఫస్ట్ సర్వ్ ఇవ్వడాన్ని నిరసించాడు. తన అరుపులతో స్టేడియంలోని ప్రేక్షకుల్ని రెచ్చగొట్టాడు. దీంతో ప్రేక్షకులు మెద్వదేవ్‌కు అనుకూలంగా అరిచారు. అందువల్ల ఆరున్నర నిమిషాల పాటు మ్యాచ్ ఆగిపోయింది. ఆట ఆరంభమైన తర్వాత మూడో సెట్‌లో బ్రేక్ పాయింట్ సాధించిన మెద్వదేవ్ ఆ సెట్‌ను సొంతం చేసుకున్నాడు. మూడో సెట్‌లో దూకుడును నాలుగో సెట్‌లో కూడా మెద్వదేవ్ కొనసాగించాడు. 0-6 స్కోరుతో ఆ సెట్‌ను సొంతం చేసుకున్నాడు. ఓటమి ఖాయనుకున్న దశలో మెద్వదేవ్ వరుసగా రెండు సెట్లు స్వంతం చేసుకుని మ్యాచ్‌ను టైబ్రేకర్‌కు తీసుకెళ్లాడు. అయితే చివరి సెట్‌లో మాత్రం ఫ్రెంచ్ ఆటగాడు బెంజిమన్ బాంజీ సత్తా చాటాడు. 6-4 స్కోరుతో ఆ సెట్‌ను సొంతం చేసుకుని మ్యాచ్ గెలిచాడు. దీంతో మెద్వదేవ్ ఫస్ట్ రౌండ్‌లోనే యూఎస్ ఓపెన్ నుంచి నిష్క్రమించాల్సి వచ్చింది. ఆ కోపంలో మైదానంలోనే తన రాకెట్‌ను మెద్వదేవ్ విరగ్గొట్టేశాడు. మ్యాచ్ ముగిసిన అనంతరం తన రాకెట్‌ను పదేపదే బెంచ్‌కేసి కొట్టి విరిచేశాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## కోచ్ అవతారంతో గంగూలీ



కెప్టెన్‌గా భారత క్రికెట్‌కు కొత్త ఊపు తెచ్చిన లెజండరీ క్రికెటర్ సౌరవ్ గంగూలీ కొత్త రూపంలో క్రికెట్ పిచ్‌పైకి వస్తున్నాడు. కానీ ఈసారి బ్యాట్‌తో కాకుండా, కోచింగ్ క్యాప్‌తో మైదానంలో దిగనున్నాడు. సౌతాఫ్రికా టీ20 లీగ్‌లోని ప్రిటోరియా క్యాపిటల్స్ జట్టు గంగూలీని తమ హెడ్ కోచ్‌గా ప్రకటించింది. 2026 సీజన్‌కి సిద్ధమవుతున్న ఈ జట్టు గంగూలీ రాకతో పుంజుకోనుంది. గతంలో ఇంగ్లండ్ బ్యాటర్ జోనాథన్ ట్రాట్ ఈ జట్టుకి కోచ్‌గా ఉన్నాడు. గత శనివారం ట్రాట్ ఈ పదవి నుంచి తప్పుకోవడంతో, గంగూలీకి అవకాశం వచ్చింది. మా జట్టుకి సౌరవ్ గంగూలీ కొత్త హెడ్ కోచ్‌గా వస్తున్నారు. దాదా రాకతో క్యాపిటల్స్ క్యాంప్‌లో రాజసమైన ఉత్సాహం నెలకొనబోతోందని ప్రిటోరియా క్యాపిటల్స్ ఇన్‌స్టాగ్రామ్‌లో రాసుకొచ్చింది.

**అసిస్టెంట్ కోచ్‌గా షాన్ పొలాక్**

గంగూలీతో పాటు దక్షిణాఫ్రికా లెజెండ్ షాన్ పొలాక్‌ను అసిస్టెంట్ కోచ్‌గా నియమించారు. దీంతో క్యాపిటల్స్‌కి కొత్త శకం మొదలైనట్లుగా భావిస్తున్నారు. ఈ కొత్త అధ్యాయాన్ని మొదలుపెట్టడానికి మా అసిస్టెంట్ కోచ్‌గా ప్రోటీన్ లెజెండ్ షాన్ పొలాక్ వస్తున్నారని జట్టు ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో పేర్కొంది.

## చివరి బంతికి సిక్సర్



కేరళ క్రికెట్ లీగ్ 2025లో ఆదివారం తిరువనంతపురంలో జరిగిన మ్యాచ్ చాలా ఉత్కంఠగా కొనసాగింది. కొచ్చి బ్లూ టైగర్స్‌తో ఆరీస్ కొల్లం సైలర్స్ తలపడ్డాయి. ఆ క్రమంలో చివరి బంతి వరకు నరాలు తెగే ఉత్కంఠతో సాగిన ఈ మ్యాచ్‌లో మహమ్మద్ ఆషిక్ చివరి బంతికి గొప్ప ట్విస్ట్ ఇచ్చి కొచ్చి బ్లూ టైగర్స్ జట్టును గెలిపించాడు. మొదట బ్యాటింగ్ చేసిన కొల్లం సైలర్స్ 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 236 పరుగుల భారీ స్కోర్ సాధించింది. విష్ణు వినోద్ (94), కెప్టెన్ సచిన్ బేబీ (91) విజృంభించారు. ఈ స్కోర్‌ని చూస్తే, కొచ్చి టైగర్స్‌కి టార్గెట్ చాలా కష్టమనిపించింది. కానీ, సంజు శాంసన్ కేవలం 51 బంతుల్లో 121 పరుగులు చేసి అదరగొట్టాడు. అతడి బ్యాటింగ్ సమయంలో స్టేడియం అంతా హొరెత్తిపోయింది.

కానీ, అసలు ఉంత్కంఠ చివరి ఓవర్‌లో మొదలయింది. కొచ్చి టైగర్స్‌కి 6 బంతుల్లో 17 పరుగులు కావాలి. మహమ్మద్ ఆషిక్ క్రీజ్‌లో ఉన్నాడు. మొదటి రెండు బంతుల్లోనే బౌండరీ, సిక్సర్‌తో ఆషిక్ అదరగొట్టాడు. మూడో బంతికి సింగిల్ తీసి ఆల్ఫీ ఫ్రాన్సిస్ జాన్‌ని స్ట్రైక్‌లోకి తెచ్చాడు. కానీ, నాలుగో బంతికి జాన్ (7) ఔట్ అయ్యాడు. అయినా, రనౌట్ అయ్యే సమయంలో ఆషిక్ మళ్లీ స్ట్రైక్‌లోకి వచ్చాడు. ఐదో బంతికి పరుగు రాలేదు. దీంతో చివరి బంతికి కచ్చితంగా 6 పరుగులు కావాలి. స్టేడియం మొత్తం నిశ్శబ్దంగా మారింది. ఆ క్రమంలో ఆషిక్ బంతిని బలంగా కొట్టాడు..అది సిక్సర్ కావటంతో కొచ్చి టైగర్స్ 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 121 పరుగులు చేసిన సంజు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ గెలుచుకున్నాడు. ఈ విజయంతో కొచ్చి టైగర్స్ తమ మూడు మ్యాచ్‌లలో 3 విజయాలతో మంచి జోరుతో ఉంది.

సంజు శాంసన్ టీ 20 ఇంటర్నేషనల్ కెరీర్ గురించి చెప్పాలంటే, 42 మ్యాచ్‌లలో 38 ఇన్నింగ్స్‌లో 861 పరుగులు చేశాడు. తన యావరేజ్ 25.38, మూడు సెంచరీలు, రెండు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. గత ఏడాది నుంచి ఓపెనర్‌గా సంజు కొత్త జోష్‌లో కనిపిస్తున్నాడు. బంగ్లాదేశ్, సౌత్ ఆఫ్రికా సిరీస్‌లలో 5 ఇన్నింగ్స్‌లలో మూడు సెంచరీలు బాదాడు. సెప్టెంబర్ 9 నుంచి యూఏఈలో జరిగే ఆసియా కప్‌కి కూడా సంజు భారత జట్టులో స్థానం దక్కించుకున్నాడు.

## దులీప్ ట్రోఫీ షెడ్యూల్ విడుదల



దులీప్ ట్రోఫీ -2025కు సంబంధించి షెడ్యూల్ విడుదలైంది. ఈ టోర్నమెంట్ క్వార్టర్- ఫైనల్ మ్యాచ్‌లతో ప్రారంభమవుతుంది. ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్న టోర్నీలో నార్త్ జోన్- ఈస్ట్ జోన్, సెంట్రల్ జోన్- నార్త్ ఈస్ట్ జోన్లు క్వార్టర్ ఫైనల్స్లో తలపడనున్నాయి. సౌత్ జోన్, వెస్ట్ జోన్ జట్లు ఇప్పటికే ఈ టోర్నమెంట్ సెమీ ఫైనల్స్‌కు అర్హత సాధించాయి. ఫైనల్ మ్యాచ్ బెంగళూరు వేదికగా సెప్టెంబర్ 11 నుంచి 15 వరకు జరగనుంది.

**దులీప్ ట్రోఫీ 2025 షెడ్యూలు**

**క్వార్టర్ ఫైనల్స్**

**ఆగస్టు 28- 31: నార్త్ జోన్ - ఈస్ట్ జోన్**
**ఆగస్టు 28- 31: సెంట్రల్ జోన్ - నార్త్ ఈస్ట్ జోన్**

**సెమీ ఫైనల్స్**

**సెప్టెంబర్ 4-7: సౌత్ జోన్ - క్వార్టర్ ఫైనల్ 1 విజేత**
**సెప్టెంబర్ 4-7: వెస్ట్ జోన్ - క్వార్టర్ ఫైనల్ 2 విజేత**

**ఫైనల్ మ్యాచ్**

సెప్టెంబర్ 11- 15: సెమీ ఫైనల్ 1 విజేత - సెమీ ఫైనల్స్ 2 విజేత

కాగా టీమ్ ఇండియా స్టార్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ దులీప్ ట్రోఫీకి దూరమయ్యాడు. అతడు వైరల్ ఫీవర్ బారిన పడినట్లు కథనాలు వస్తున్నాయి. ఇప్పటికే రక్త నమూనాలను బ్లడ్ టెస్టుకు పంపినట్లు సమాచారం. ఆ రిపోర్ట్ బీసీసీఐ వద్దకు చేరిందని.. దీంతో దులీప్ ట్రోఫీ నుంచి అతడికి మినహాయింపు దక్కిందని క్రికెట్ వర్గాలు తెలిపాయి. నార్త్ జోన్ జట్టు సారథిగా తొలుత గిల్‌ను ఎంపిక చేశారు. అయితే ప్రస్తుతం అతడికి బదులు వైస్ కెప్టెన్‌గా ఉన్న అంకిత్ కుమార్ జట్టును నడిపించే అవకాశాలు ఉన్నాయి.

ఇటాఉంటే దులీప్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌కు ఈస్ట్ జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్, పేసర్ ఆకాశ్ దీప్ కూడా దూరమయ్యారు. గాయాల నుంచి వీళ్లిద్దరూ ఇంకా కోలుకోకపోవడంతో ఈ మ్యాచుకు అందుబాటులో ఉండట్లేదు. ఈనెల 28 నుంచి 31 వరకు జరిగే క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో నార్త్ జోన్‌తో ఈస్ట్ జోన్ తలపడనుంది. ఇంగ్లాండ్ పర్యటనలో వెన్ను నొప్పితో ఇబ్బంది పడిన ఆకాశ్.. వైద్యుల సలహా మేరకు దులీప్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌కు అందుబాటులో ఉండటం లేదు. ఈ మేరకు అతడు జోనల్ సెలెక్షన్ కమిటీకి సమాచారం ఇచ్చాడు. ప్రస్తుతం బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ (సీఓఈ)లో అతను కోలుకుంటున్నాడు. ఇ-బైక్ మీద నుంచి పడిపోయిన ఇషాన్ చేతికి వైద్యులు కుట్లు వేశారు. అతను కూడా సీఓఈలోనే ఉన్నాడు. ఆకాశ్ స్థానంలో ముఖ్తర్ హుస్సేన్ (బీహార్), ఇషాను బదులుగా ఆశీర్వాద్ స్వేన్ (ఒడిశా)ను ఈస్ట్ జోన్‌కు ఎంపిక చేశారు. ఇషాన్ గైర్హాజరీలో అభిమన్యు ఈశ్వరన్ సారథ్యం వహించనున్నాడు. రియాన్ పరాగ్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

చైతన్య రథం
సినిమా
మంగళవారం 26 ఆగస్టు 2025 18

# బాలయ్య గ్రేట్..



వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్(లండన్)లో చోటు దక్కించుకున్న నటసింహం నందమూరి బాలకృష్ణకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. ఈమేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. "నందమూరి తారక రామారావు వారసుడిగా.. బాలనటుడిగా తెలుగు చలనచిత్ర రంగంలోకి అడుగుపెట్టి.. జానపదాలు, కుటుంబ కథా చిత్రాలు. యాక్షన్ చిత్రాలతో ప్రేక్షకులను మెప్పించారు. నట జీవితంలో 50 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణం పూర్తి చేసుకున్నారు. ఈ తరుణంలో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ స్థానం దక్కించుకున్న నటుడు, ఎమ్మెల్యే, పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నా.. ఆయనెప్పుడూ ఇలాగే నటనతో ప్రేక్షకులను అలరిస్తూ, ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షిస్తున్నా" అని పేర్కొన్నారు. 50 ఏళ్ల అసాధారణ నట ప్రయాణాన్ని పురస్కరించుకొని బాలకృష్ణకు ఈ అరుదైన గౌరవం (వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్- గోల్డ్ ఎడిషన్) దక్కింది. భారతీయ చిత్ర పరిశ్రమలో ఈ గౌరవాన్ని పొందిన తొలి నటుడు ఆయనే, ఈ సందర్భంగా ఈనెల 30న హైదరాబాద్లో బాలకృష్ణను సత్కరించనున్నారు.

# ఓటీటీలో 'కింగ్డమ్'



విజయ్ దేవరకొండ హీరోగా నటించిన 'కింగ్డమ్' సినిమా ఓటీటీ విడుదల తేదీ ఖరారైంది. ఈ నెల 27 నుంచి నెట్ఫ్లిక్స్లో స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని సదరు సంస్థ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. ఈ సినిమా జులై 31నథియేటర్లలో విడుదలైన సంగతితెలిసిందే.దర్శకుడు గౌతమ్ తిన్ననూరి తెరకెక్కించిన ఈ చిత్రంలో విజయ్కు అన్నయ్యగా సత్యదేవ్ ఆకట్టుకున్నారు. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్.

'కింగ్డమ్' కథ ఇదీ.. సూరి (విజయ్ దేవరకొండ) ఓ కానిస్టేబుల్. చిన్న వయసులోనే కుటుంబానికి దూరమైన తన అన్న శివ (సత్యదేవ్) కోసం వెతుకుతుంటాడు. ఆ ప్రయత్నంలో ఉండగానే సూరి కొందరు ఆఫీసర్లతో గొడవపడతాడు. ఆ సంగతిపై అధికారులకు తెలుస్తుంది. అందుకు సంబంధించి విచారణ జరుగుతున్నప్పుడు ఊహించని రీతిలో సూరికి ఓ మిషన్ బాధ్యతల్ని అప్పజెబుతారు. సూరి వెతుకుతున్న తన అన్న ఆచూకీ శ్రీలంక సమీపంలోని దివి అనే ఓ ద్వీపంలో ఉందని, గూఢచారిగా అక్కడ పనిచేయాలని చెబుతారు. తన అన్న కోసం ఎంత దూరమైనా వెళ్లడానికి సిద్ధమైన సూరి.. పై అధికారి చెప్పినట్టే శ్రీలంకలో అడుగు పెడతాడు. అత్యంత ప్రమాదకరమైన దీవిలోకి సూరి ఎలా వెళ్లాడు? శివ ఆ దీవికి వెళ్లడానికి కారణమేంటి? ఆ ద్వీపంలో ఉన్న తెగకీ, శివకీ సంబంధం ఏమిటి? అక్కడి తెగ 70 ఏళ్లుగా ఎవరి రాకకోసం ఎదురు చూస్తూ ఉంటుంది? తన అన్నతో కలిసి సూరి తిరిగొచ్చాడా? అన్నది కీలకం.

# ఆ ఒక్కటీ అడక్కు!





పుష్ప చిత్రాల సక్సెస్ తర్వాత అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ చేస్తున్న సినిమా అప్డేట్ గురించి ప్రేక్షకులు, అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. భారీ బడ్జెట్, హై టెక్నికల్ వాల్యూస్తో సన్ పిక్చర్స్ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. ఈ క్రమంలోనే అల్లు అర్జున్కు అత్యంత సన్నిహితుడు అయిన బన్నీ వాస్కు ఈ సినిమా గురించి ప్రశ్నలు ఎదురయ్యాయి. దానికి ఆయన తెలివిగా సమాధానమిచ్చారు. 'ఆ ఒక్కటీ అడక్కు' అంటూ సింపుల్గా తేల్చేశారు. శ్రీచరణ్ రాచకొండ, గీత్ షైని జంటగా నటించిన చిత్రం 'కన్యాకుమారి' ఆగస్టు 27 విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బన్నీ వాస్ మాట్లాడారు. 'అల్లు అర్జున్, అట్లీ సినిమా గురించి ఏమైనా చెబుతారా' అని అడగ్గా 'సన్ పిక్చర్స్ వాళ్లతో నాన్ డిస్క్లోజర్ అగ్రిమెంట్ ఉంది. ప్రస్తుతం ఏమీ మాట్లాడలేను. ఏదైనా చెబితే వాళ్లే చెప్పాలి' అన్నారు. ఈ సినిమాలో అల్లు అర్జున్ క్యారెక్టర్ మూడు కోణాల్లో సాగుతుందని సమాచారం. మోషన్ క్యాప్చర్ టెక్నాలజీలోపాటు విజువల్ ఎఫెక్ట్స్కి పెద్దపీట వేస్తూ ఈ సినిమాని తెరకెక్కిస్తున్నారు. ఇందులో ముగ్గురు కథానాయికలు నటించే ఆస్కారం ఉంది. సినీ కార్మికుల సమ్మె షూటింగ్లపై ఏమైనా ప్రభావం చూపిందా అన్న ప్రశ్నకు.. సమ్మె కారణంగా కొన్ని సందర్భాల్లో ఇబ్బంది పడ్డాం. ఇంకొన్నిసార్లు అభ్యర్థన మేరకు షూట్ చేశాం. ఎందుకంటే సినిమా నిర్మాణం కోట్ల రూపాయల ఖర్చుతో కూడుకున్నది. పైగా విదేశీ నిపుణులు మన దేశానికి వచ్చి వర్క్ చేస్తున్నారు. సమ్మె జరిగితే వాళ్లందరినీ ఖాళీగా కూర్చోబెట్టాలి. అగ్రిమెంట్ ప్రకారం వాళ్లకు పనిలేకపోయినా, డబ్బులు చెల్లించాలని బన్నీ వాస్ అన్నారు.

# అన్న ఎప్పుడూ అన్నే..



దళపతి విజయ్ పాలిటిక్స్లోకి వెళ్లడంతో... తదుపరి దళపతి శివ కార్తికేయన్ అంటూ తమిళ చిత్ర పరిశ్రమలో కొన్ని రోజులుగా టాక్ వినిపిస్తోంది. ఈ క్రమంలో శివకార్తికేయన్ను.. నెక్స్ట్ దళపతి, కుట్టి దళపతి, ఫ్యూచర్ దళపతి అంటూ ట్యాగ్స్ తెరపైకి వచ్చాయి. వాటిపై 'మదరాసి' మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్లో శివ కార్తికేయన్ స్పందించారు. విజయ్ను ఉద్దేశించి మాట్లాడుతూ అన్న ఎప్పుడూ అన్నే, తమ్ముడు ఎప్పుడూ తమ్ముడే.. అని పేర్కొన్నారు. విజయ్ అభిమానులను తాను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారన్న ఆరోపణపైనా శివ కార్తికేయన్ రియాక్ట్ అయ్యారు. ఏ నటుడూ మరొకరి అభిమానులకు గెలవాలని అనుకోరన్నారు. ఇండస్ట్రీలో 15 ఏళ్లుగా కష్టపడుతున్నా. కొందరి అభిమానాన్ని పొందగలిగా. అది చాలు. సచిన్ టెండూల్కర్, ధోనీలాంటి వారినీ కొందరు విమర్శిస్తుంటారు. సోషల్ మీడియాలో వచ్చే ట్రోల్స్పై మీరు అనవసరంగా స్పందించి, ఆవేశ పడొద్దని తన అభిమానులకు శివ కార్తికేయన్ విజ్ఞప్తి చేశారు. అదే వేడుకలో హీరోయిన్ రుక్మిణీ వసంత్ మాట్లాడుతూ.. తాను శివకార్తికేయన్ అభిమానినని తెలిపారు. ఆయన అంకితభావంతో పని చేస్తారని కొనియాడారు. తాను ఈ చిత్రంలో అతిథి పాత్ర పోషించినట్టు డైరెక్టర్ మురుగదాస్ తెలిపారు. ఈ సినిమా అదే పేరుతో తెలుగులోనూ సెప్టెంబరు 5న విడుదల కానుంది.

# రజనీతో నాగ్ అశ్విన్ మూవీ?

టాలీవుడ్లో మరో ఆసక్తికరమైన కాంబినేషన్కు తెర లేచింది. ఇప్పుడీ వార్త సోషల్ మీడియాలో సంచలనం రేపుతుండగా సినీ లవర్స్ లో అంతకుమించి ఆసక్తిని నింపుతోంది. గత సంవత్సరం కల్కి సినిమాతో వరల్డ్ బాక్సాఫీస్ను షేక్ చేసిన మహానటి ఫేం నాగ్ అశ్విన్.. సూపర్స్టార్ రజనీకాంత్ కాంబోలో త్వరలో ఓ సినిమా పట్టాలెక్కబోతున్నట్లు తమిళ, తెలుగు మీడియాల్లో టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే సరిపోదా శనివారం ఫేం దర్శకుడు వివేక్ ఆత్రేయ సైతం రజనీ కాంత్తో ఓ సినిమా గురించి చర్చించినట్లు చాలా రోజులుగా వార్తలు వస్తున్నాయి. సడన్గా ఇప్పుడు నాగ్ అశ్విన్ కబురు బయటకు రావటం ప్రాధాన్యత సంతరించుకుంది. భారీ బడ్జెట్తో, అద్భుతమైన టెక్నికల్ వాల్యూస్తో రూపొందనున్న ఈ సినిమాను తన హోం బ్యానర్, తెలుగు చిత్ర పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మక బ్యానర్ అశ్వినీదత్ ఆధ్వర్యంలోని వైజయంతి మూవీస్ నిర్మించనున్నట్లు సమాచారం.

ఇప్పటికే రజనీకాంత్ను కలిసి నాగ్ అశ్విన్ స్టోరీ డిస్కస్ చేసినట్లు, రజనీ సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, స్టోరీని డెవలప్ చేయమని చెప్పినట్లు వార్తలు వస్తున్నాయి. దీనిపై సోషల్ మీడియాలో ఇప్పటికే పలు హ్యాష్ట్యాగ్లు ట్రెండ్ అవుతున్నాయి. అయితే.. ప్రస్తుతం నాగ్ అశ్విన్ కల్కి పార్ట్ 2 తీసేందుకు ఉపక్రమిస్తున్న సమయంలో ఇప్పుడీ వార్త సౌత్ ఇండియాను ఊపేస్తుంది. ఒకవేళ ఈ కాంబో పట్టాలెక్కితే కల్కి 2 వాయిదా పడుతుంది అనే ఊహాగానాలు సైతం వ్యక్తం అవుతున్నాయి. ఇదిలాఉంటే.. వైజయంతి మూవీస్ అశ్వినీదత్కు రజనీకాంత్తో మంచి స్నేహ సంబంధాలు ఉన్నాయి. రజనీకాంత్ చివరిగా తెలుగులో నటించిన సినిమా కథానాయకుడు ఈ బ్యానర్ నుంచే రావడం గమనార్హం. అంతేగాక చాలాకాలం తర్వాత కమల్ హసన్ ఈ బ్యానర్ తోనే తెలుగులో కల్కి సినిమాలో నటించగా ఇప్పుడు రజనీ కాంత్ సైతం ఈ బ్యానర్ ద్వారానే తెలుగులో సినిమా చేయనుండడం విశేషం. అనుకున్న ప్రకారం ఈ సినిమా ఓకే అయితే.. ఈ ప్రాజెక్ట్ ఇండియన్ సినిమా హిస్టరీలో మరో ఎపిక్గా మారే అవకాశం ఉంది.

